నెపోలియన్
రూ॥ 180/-
పేజీలు: 190

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

మావోయిస్టులకు కంటిమీద కునుకులేకుండా చేస్తాం : అమిత్ షా

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య
కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సంక్షేమ అభివృద్ధిపై దృష్టి సారించాలి : తుమ్మల

నవ వరుడు దారుణ హత్య

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 203 | సోమవారం | 23 -06-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# ఇరాన్‌పై అమెరికా ప్రత్యక్ష దాడి



**మూడు అణుస్థావరాలపై గైడెడ్ ఆయుధాల ప్రయోగం**
**శక్తివంతమైన 14 బాంబులు జారవిడిచి భూగర్భంలో నిర్మించిన స్థావరాలు ధ్వంసం**
**'ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్' పేరుతో విధ్వంసం**

## హోర్ముజ్ జలసంధి మూసివేత !

ప్రతిరోజూ వేలాది చమురు నౌకల రాకపోకలకు ఉపయోగపడే కీలకమైన హోర్ముజ్ జలసంధిని మూసివేయాలని ఇరాన్ నిర్ణయించింది. ఇరాన్ పార్లమెంటుఈ మేరకు అనుకూలంగా ఓటు వేసి ఒక తీర్మానం ఆమోదించింది. ఇరాన్ ప్రభుత్వ మీడియా ఆదివారంనాడు ఈ విషయం వెల్లడించింది. ఐతే ఈ నిర్ణయాన్ని ఇంకా ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి ఆమోదించాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోని ఐదోవంతు ఖనిజవాయువు, చమురు ఎగుమతులు ఈ జలసంధి నుండే రవాణా అవుతాయి. అమెరికా దాడిచేస్తే, తమపై దాడులు కొనసాగిస్తే హోర్మోజ్ జలసంధిని మూసివేసే ఒక ప్రత్యామ్నాయం కూడా తమ వద్ద ఉందని మూడు రోజుల క్రితమే ఇరాన్ ఒక హెచ్చరిక చేసింది.

### భద్రతామండలి తక్షణం సమావేశమవ్వాలి..

భద్రతామండలి తక్షణ అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని ఇరాన్ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమిర్ సయీద్ ఇర్వానీ ఈ మేరకు ఐక్యరాజ్యసమితికి ఒక లేఖ రాశారు. అమెరికా అత్యంత హేయమైన రీతిలో అక్రమంగా సైన్యాన్ని ఉపయోగించి ఇరాన్‌కు వ్యతిరేకంగా దాడులకు దిగిందని ఈ విషయాన్ని భద్రతామండలిలో తక్షణం చర్చించాలని కోరింది. అమెరికాకు వ్యతిరేకంగా అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అమెరికాను జవాబుదారీ చేయాలని, అంతర్జాతీయ చట్టాలకు కట్టుబడి ఉండేవిధంగా లొంగదీయాలని ఆ లేఖలో ఇర్వానీ కోరారు. ''అమెరికా చేసిన దాడిని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ తీవ్రంగా ఖండిస్తున్నది. ఎలాంటి కవ్వింపు చర్యలూ లేకపోయినాగానీ దురాక్రమణకు ముందుగానే ఆలోచించి చర్యలు తీసుకున్నారు. భారీఎత్తున సైనిక దాడులు చేశారు. జూన్ 13 నుండి ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నది, తమ దేశం శాంతియుత ప్రయోజనాలకోసం చేస్తున్న అణుకార్యక్రమాల స్థావరాలపై దాడులు చేస్తోంది'' అని లేఖలో ఇర్వానీ తెలియజేశారు.

**వాషింగ్టన్ :** నిన్నమొన్నటి వరకూ ఇజ్రాయెల్‌ను అడ్డుపెట్టుకొని ఇరాన్‌ను వేధించిన అమెరికా ఇప్పుడు నేరుగా రంగంలోకి దిగడంతో, యుద్ధ జ్వాలలు ఎగసిపడుతున్నాయి. ఇది ఏ రూపాన్ని సంతరించుకుంటుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. శాంతి మంత్రం జపిస్తూ, యుద్ధాలను నిలువరించడానికి, శాంతి స్థాపనకు ప్రయత్నం చేస్తున్నట్టు చెప్తున్న అమెరికా వికృతరూపం ఈ దాడితో బట్టబయలైంది. ఆ దేశ యుద్ధ కాంక్షను, సామ్రాజ్యవాద ధోరణులను మరోసారి తెరపైకి తెచ్చింది. అగ్రరాజ్యం చెప్పేది ఒకటి.. చేసేది మరొకటని రుజువైంది. అణు పరిశోధనలు, అణ్వాయుధ తయారీ ప్రక్రియలను నిలిపివేయాలని తొలుత ప్రకటించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆ తర్వాత ఇరాన్ సుప్రీం అయొతుల్లా అలీ ఖమేనీ లొంగిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. పదిరోజులు సమయం ఇస్తున్నామని చెప్పిన కొన్ని గంటల్లోనే ఇరాన్‌పై అమెరికా యుద్ధ విమానాలతో విరుచుకుపడింది. ఈ చర్య అత్యంత ప్రమాదకరమైన పరిస్థితులకు దారితీయడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇరాన్‌ను పాదాక్రాంతం చేసుకోవాలన్న ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న ప్రయత్నాలను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచదేశాలను తప్పుతోవ పట్టించి, ఆదివారం తెల్లారకముందే ఇరాన్‌లోని మూడు అణుస్థావరాలపై గైడెడ్ ఆయుధాలతో దాడులు చేసింది. శక్తిమంతమైన 14 బాంబులు (బంకర్ బస్టర్ బాంబులు) జారవిడిచి భూగర్భంలో నిర్మించిన స్థావరాలను ధ్వంసం చేయడంతో మధ్యప్రాచ్యంలో ఆరని యుద్ధజ్వాలలకు అమెరికా ఆజ్యం పోసింది. బి–2 స్టీల్త్ బాంబర్లు అనేకగంటలు సుదీర్ఘ ప్రయాణం చేసివెళ్ళాయి. పర్వత లోయలో భూగర్భంలో నిర్మించిన ఫోర్డో అణు కేంద్రం సహా మిగతా తరువాయి 2లో



## దౌత్య చర్యలకు భారత్ పిలుపు

### ఇరాన్ అధ్యక్షుడితో మోదీ ఫోన్ సంభాషణ

ఇరాన్‌పై అమెరికా ప్రత్యక్ష దాడులుచేసిన తర్వాత భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం ఉదయం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో టెలిఫోన్ సంభాషణ చేశారు. తక్షణం ఉద్రిక్తతలు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంభాషణల ద్వారా, దౌత్య మార్గాల ద్వారా ఈ ఉద్రిక్త పరిస్థితుల నుండి మూడు దేశాలూ వెనక్కు మళ్ళాలని తరువాయి 2లో

## అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన

**ఇరాన్‌పై అమెరికా బాంబుదాడులను తీవ్రంగా ఖండించిన వామపక్ష పార్టీలు**

**న్యూఢిల్లీ :** ఇరాన్‌పై బాంబులదాడితో విరుచుకుపడుతోన్న అగ్రరాజ్యం అమెరికా ధోరణిని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇజ్రాయెల్‌ఇరాన్ మధ్య భీకర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ లోని అణుకేంద్రాలపై అమెరికా దాడులను వామపక్షపార్టీలు ఆక్షేపించాయి. ఇరాన్‌పై అమెరికా జరుపుతోన్న దాడులు అంతర్జాతీయ చట్టాలను 'తీవ్రస్థాయిలో ఉల్లంఘించడమే' అని ఆరోపించాయి. అమెరికా బాంబుల దాడి ఇరాన్ దేశ సార్వభౌమాధికారాన్ని, ఐక్యరాజ్యసమితి చార్టర్‌ను తీవ్రంగా ఉల్లంఘించడమేనని, అమెరికా అనుసరిస్తున్న తరువాయి 2లో

## నేడు కేబినేట్



ప్రజాపక్షం / హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సచివాలయంలో జరగనుంది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో ప్రధానంగా ఏపి ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల ప్రాజెక్టు, నూతన విత్తన చట్టం, స్థానిక సంస్థల ఎన్నికలు, ఇందిరమ్మ ఇళ్లు, బిసి రిజర్వేషన్లు, రైతు భరోసా, రాజీవ్ యువ వికాసం తదితర అంశాలపై చర్చించనున్నట్లు సమాచారం. గోదావరి–బనకచర్ల ప్రాజెక్టుపై ప్రతిపక్షం ప్రభుత్వంపై దుష్ప్రచారానికి తెరలేపిన నేపథ్యంలో ఈ మంత్రివర్గ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు.. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామని అధికారులు చెప్పారు. ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, తరువాయి 12లో

## బనకచర్లపై వెనక్కి తగ్గం



- ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వామ్యం ఉన్న ప్రతిఒక్కరూ జైలుకు వెళ్లడం ఖాయం
- స్థానిక ఎన్నికలపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- కాళేశ్వరంతో కోట్లాది రూపాయలు నీటిపాలు
- టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ కీలక వ్యాఖ్యలు

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలలో కీలకమైన బనకచర్ల ప్రాజెక్టు విషయంలో వెనక్కి తగ్గేది లేదని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ తేల్చి చెప్పారు. 650 మంది ఫోన్ ట్యాపింగ్‌లో భాగస్వామ్యం ఉన్న ప్రతిఒక్కరూ జైలుకు వెళ్లటం ఖాయమని వ్యాఖ్యానించారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలో టిపిసిసి చీఫ్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్‌అలీ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ఇంకా ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని, మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మహేశ్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో కోట్లాది రూపాయలు నీళ్లలో పోశారని, తరువాయి 2లో

## కెసిఆర్ కుటుంబానికి కాళేశ్వరం ఓ ఎటిఎం

- అంచనాలు పెంచి రూ. వేలకోట్లు దోచుకున్నారు
- ప్రాజెక్టు వల్ల ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది
- సిబిఐ విచారణ జరపాల్సిందే
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో బిజెపిపై విష ప్రచారం జరుగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కెసిఆర్ కుటుంబానికి ఎటిఎంలా మారిందని చెప్పారు. ఆ ప్రాజెక్టుపై సిబిఐ విచారణ జరపాలన్నదే మా డిమాండ్. ఇందులో మరోదానికి తావులేదు'' అని స్పష్టం చేశారు. రూ.38 వేల కోట్ల ప్రాజెక్టుకు రూ. 1.2 లక్ష కోట్ల అంచనాలు పెంచిన కేసిఆర్ కుటుంబం వేల కోట్లు దోచుకుందన్నారు. కాళేశ్వరంతో ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఆదివారం ఉదయం తరువాయి 2లో

## రాష్ట్ర అవసరాల మేరకే బడ్జెట్ నిధులు ఖర్చు

- శాఖల ఖర్చులు రేషనలైజేషన్ చేసి ప్రాధాన్యతా క్రమంలో ముందుకు సాగాలి
- నాన్ టాక్స్ రెవెన్యూ రాబడులు పెంచేందుకు అధికారులు దృష్టి సారించాలి
- డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్

నాన్ టాక్స్ రెవెన్యూ రాబడులను పెంచేందుకు అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల మంత్రివర్గ ఉపసంఘం చైర్మన్, డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. రాష్ట్ర అవసరాలను, ప్రాముఖ్యతల మేరకు బడ్జెట్ నిధులను ఖర్చు చేయాలని, శాఖల ఖర్చులనూ రేషనలైజేషన్ చేసి, ప్రాధాన్యత క్రమంలో ముందుకు సాగాలని సూచించారు. రానున్న పది రోజుల్లో రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేసి, సమగ్రమైన ప్రణాళికలను రూపొందించాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. భట్టి విక్రమార్క అధ్యక్షతన తరువాయి 12లో

## యథేచ్ఛగా పిడిఎస్ రైస్ అక్రమ దందా



- పక్కదారి పడుతున్న సన్న బియ్యం
- వ్యవహారం వెనుక రైస్ మిల్లర్ల పాత్ర?
- కొందరు రేషన్ డీలర్ల సహకారం!

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

పిడిఎస్ బియ్యం అక్రమ దందా మళ్లీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ప్రభుత్వం సన్నబియ్యం సరఫరా చేస్తే బియ్యం దందా ఆగిపోతుందని ప్రభుత్వం భావించింది. కానీ ఏం చేసినా గతంలో లాగానే రేషన్ బియ్యం అక్రమ దందా కొనసాగుతున్నది. కాగా ఈ దందా వెనక రైస్ మిల్లర్ల పాత్ర ఉందని ప్రచారం జరుగుతోంది. రేషన్ డీలర్ల వద్ద కిలోకు రూ.20 చొప్పున కొని రైస్ మిల్లుల్లో బియ్యాన్ని రీసైకిలింగ్ చేసి మార్కెట్ లో రూ.45 చొప్పున కింటాళ్ల కొద్ది అమ్ముతున్నట్లు తెలుస్తోంది. రెవెన్యూ అధికారులు అక్రమ బియ్యం దందాపై కన్నెత్తి చూడటం లేదన్న ఆరోపణలు వినిపిస్తు న్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పేదలకు పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా సన్న బియ్యం పంపిణీ చేసినా పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా మాత్రం అధికారులు నివారించలేక పోతున్నారన్నది స్పష్టమవుతుంది. రేషన్ దుకాణాల్లో నుంచి తీసుకువెళ్లి తినే దానికంటే నిల్వ చేసి అధిక ధరలకు అమ్ముకునే వారి సంఖ్యనే ఎక్కువగా ఉందన్న వాదన కూడా వినిపిస్తోంది. రేషన్ బియ్యం సేకరణకు గ్రామీణ ప్రాంతాల్లో ప్రత్యేక ముఠాలే సంచరిస్తున్నాయని, కొందరు రేషన్ డీలర్లు దీనికి సహకరిస్తున్నారని, వారి అండదండలతోటి చైన్ సిస్టం మాదిరిగా బియ్యం అక్రమ వ్యాపారం మళ్లీ పున : ప్రారంభమైనట్లు ప్రచారం జరుగుతోంది. రేషన్ దుకాణాల డీలర్లతో తరువాయి 12లో

## ప్రభుత్వ వ్యూహంతో ప్రతిపక్షం విలవిల

**'కమిషన్ల' వరుస విచారణలతో గులాబీ దళం ఉక్కిరిబిక్కిరి**

ఇ.చంద్రశేఖర్



హైదరాబాద్: ప్రజా సమస్యలపై ప్రతిపక్షం ప్రభుత్వాన్ని నిలదీస్తూ ఇరుకున పెట్టడం సహజం. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అందుకు భిన్నంగా పరిస్థితి కనబడుతున్నది. ప్రభుత్వ వ్యూహంతో ప్రధాన ప్రతిపక్షం విలవిలలాడుతున్నది. పలు విచారణ కమిషన్లు, సంస్థలు చేపట్టిన వరుస విచారణలు బిఆర్ఎస్ నాయకులను, ముఖ్యంగా కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావును చికాకుపరుస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం మొదలు పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన బిఆర్ఎస్ (గతంలో టిఆర్ఎస్) చేపట్టిన అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలలో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతుండడమే ఇందుకు కారణంగా కనబడుతున్నది. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తర్వాత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజాసేవే ప్రభుత్వ లక్ష్యమని పలుమార్లు సిఎం, టిపిసిసి అధ్యక్షుడు, ఇతర ముఖ్య నేతలు ప్రకటించారు. అయితే గత పదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, అక్రమాలను మాత్రం వదిలిపెట్టేదిలేదని, అందుకు తగిన శిక్షను వారు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## శాంతి కోసం మానవాళి బొబ్బలు పెడుతోంది : పోప్



**వాటికన్‌సిటీ:**మధ్యప్రాచ్యంలో, ప్రపంచంలో శాంతిని నెలకొల్పాలని మానవాళి ముక్తకంఠంతో బొబ్బలు పెడుతోందని పోప్ లియో–14 ఒక ప్రకటన చేశారు. ఇరాన్‌పై అమెరికా దాడులు చేసిన ఘటనపై పోప్ లియో తీవ్రంగా స్పందించారు. ఇరాన్‌పై సైనిక దురాక్రమణ చర్యలను తక్షణం నిలిపివేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ''ఈ విషాదకరమైన యుద్ధాన్ని నివారించవలసిన బాధ్యత ప్రతిదేశంమీదా ఉంది, ప్రతిఒక్కరూ ఇందుకు పూనుకోవాలి, భయంకరమైన నష్టాలు సంభవించకముందే అందరూ జోక్యం చేసుకోవాలి'' అని కోరారు. వాటికన్‌సిటీలో వారాంతపు ప్రార్థనల అనంతరం పోప్ లియో అక్కడకు వచ్చినవారిని ఉద్దేశించి పైవిధంగా చెప్పా రు. చాలా బాధకు గురిచేసే, ప్రమాదకరమైన వార్తలు మధ్యప్రాచ్యం నుండి వ స్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## ఇజ్రాయెల్–ఇరాన్ రెండూ
# అణుకార్యక్రమాలు ఆపేయాలి



**మాస్కో :** ఇజ్రాయెల్–ఇరాన్ రెండు దేశాలూ అణుకార్యక్రమాలను నిలిపివేయాలని రష్యా భద్రతామండలి డిప్యూటీ ఛైర్మన్ ద్మీత్రీ మెద్వెదేవ్ అన్నారు. ''ఇరాన్ దగ్గర అణ్వాయుధాలున్నాయా? ఈ విషయం మనకు తెలియదు. కానీ ఇజ్రాయెల్ రహస్యంగా అణు కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్న విషయం మాత్రం మనకు తెలుసు, సరే, ఏదైతే ఏమిటి? ఇక మీదట ఈ రెండు దేశాలు మధ్యప్రాచ్యంలో అణు కార్యక్రమాలను నిలిపివేయాలి, వాటికి దూరంగా ఉండాలి,ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరగాలి'' అని ద్మీత్రీ మెద్వెదేవ్ ప్రతిపాదించారు.

**ఇరాక్‌లో చేసిన తప్పే మళ్ళీచేశారు: చైనా**

ఇరాక్‌లో చేసిన తప్పునే అమెరికా ఇప్పుడు ఇరాన్‌లో కూడా రిపీట్ చేసిందని చైనా విమర్శించింది. అమెరికా చేసిన దాడులు అత్యంత ప్రమాదకరమైన మలుపు అని హెచ్చరించింది. ''చరిత్ర పునరావృతమైంది, ఇరాక్‌లో ఇలాంటి తప్పే అమెరికా చేసింది, మళ్ళీ ఇరాన్‌లో అదే తప్పు చేస్తోంది, దీనికొనసాగింపు పరిణామాలు మధ్యప్రాచ్యాన్ని వదలిపెట్టవు, దీనివల్ల ఇంకా సుదీర్ఘమైన ఘర్షణకు, ఈ ప్రాంతం బలహీనపడిపోవడానికి దారితీస్తాయి'' అని చైనా తన ప్రకటనలో పేర్కొంది.జపాన్ ప్రధానమంత్రి షిగెరు ఇషిబా కీలకమంత్రులతో ఒక సమావేశం నిర్వహించి పరిస్థితులను సమీక్షించారు. దక్షిణ కొరియా కూడా ఆదివారంనాడు అత్యవసర సమావేశం నిర్వహించి పరిస్థితిని సమీక్షించింది.

**చర్చలే మేలు**


అమెరికా దాడుల అనంతరం పలు దేశాలు మధ్యప్రాచ్యంలో పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. ఈ దాడుల తర్వాత ఇరాన్ తన యుద్ధాన్ని ఉద్ధృతం చేస్తుందని భయాలు వ్యక్తం చేశాయి. చర్చలద్వారా ఒక పరిష్కారం సాధించాలని అన్ని పక్షాలకూ ఫ్రాన్స్ విదేశాంగమంత్రి జీన్ నోయెల్ బారోట్ విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం సాధించాలని కోరారు. అణ్వస్త్రవ్యాప్తి నిరోధక ఒప్పందం చట్రం పరిధిలో అన్నిదేశాలకూ వర్తించేవిధంగా ఒక శాశ్వత పరిష్కారం సాధించాల్సిన అవసరం ఉందని ఫ్రాన్స్ దేశం బలంగా విశ్వసిస్తోందని బారోట్ అన్నారు. ఈజిప్టు విదేశాంగమంత్రిత్వ శాఖ అమెరికా దాడులను తీవ్రంగా ఖండించింది. ఈ పరిణామాలు, ఉద్రిక్తత చాలా శరవేగంగా అన్ని ప్రాంతాలకు వ్యాప్తి చెందుతాయని ఆందోళన వ్యక్తం చేసింది. దీనివల్ల మధ్యప్రాచ్యం మరింత సంక్షోభంలో కూరుకుపోతుందని, అంతర్జాతీయ భద్రత, శాంతి ప్రమాదంలో పడతాయని పేర్కొంది. దాడుల అనంతరం రష్యా అధ్యక్ష భవనం క్రెమ్లిన్ ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్‌తో పుతిన్ సంభాషణకు ఎలాంటి అవకాశం లేదని స్పష్టం చేసింది. యూరోపియన్ యూనియన్ ఒక ప్రకటనలో యుద్ధంలో నిమగ్నమైన పక్షాలన్నీ చర్చలబల్లవద్ద కూర్చుకుని విషయాలు తేల్చుకోవాలని కోరింది. యూరప్‌లోని 27 దేశాలూ ముక్తకంఠంతో ఈ విజ్ఞప్తి చేశాయి. చర్చలకు రావడంద్వారా త దుపరి ఉద్రిక్తలను నివారించాలని యూరోపియన్ యూ నియన్ విదేశీ వ్యవహారాల అత్యున్నత అధికార ప్రతినిధి కాజా కల్లాస్ కోరారు. బ్రిటన్ ఒక ప్రకటన చేస్తూ ఉద్రిక్తతలకు దూరంగా సంయమనం పాటించాలని కోరింది. యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఒక ప్రకటన చేస్తూ, అన్ని పక్షాలు సంయమనం పాటించాలని కోరారు. అన్ని పక్షాలు చర్చలకు రావాలని న్యూజిలాండ్ విదేశాంగమంత్రి విన్‌స్టన్ పీటర్స్ కోరారు. ఆస్ట్రేలియా కూడా ఈ చర్యను ఖండించింది. ఇరాన్‌లో తన దౌత్యకార్యాలయాన్ని మూసివేసింది.

### బుద్ధిలేని పని చేసిన అమెరికా ఐకాన్ విమర్శ

ఇరాన్‌పై దాడి అమెరికా బుద్ధిలేని చర్యలకు తార్కాణమని అణ్వస్త్ర వ్యతిరేక ప్రచార బృందం (ఐకాన్) ఒక ప్రకటనలో విమర్శించింది. ఈ బృందం కార్యనిర్వాహక సంచాలకుడు, నోబెల్ శాంతిబహుమతి గ్రహీత మెలెస్సా పార్కే ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ నిర్లక్ష్యపూరిత చర్యలకు ఇదొక తార్కాణమని అన్నారు. ఇజ్రాయెల్‌కు వంతపాడుతూ, ఆ దేశంతో కలిసి యుద్ధంలో చేరి ఇరాన్‌పై దాడులు చేయడం ద్వారా అమెరికా తన బృహత్తరమైన బాధ్యతలు విస్మరించిందని,అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి బుద్ధిలేని చర్యలకు దిగిందని విమర్శించారు. ఇరాన్ అణుకార్యక్రమాలు చేస్తోందని ఒకవేళ అమెరికా తీవ్ర ఆందోళన చెందితే ఇలా దాడి చేయడం మాత్రం పరిష్కార చర్య కాదని ఆయన అన్నారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ అధ్యక్షురాలు (ఐసిఆర్‌సి) మీర్జానా స్పోల్జారిక్ ఒక ప్రకటన చేస్తూ తిరిగికోలుకోలేని పరిణామాలస్థాయిలో మధ్యప్రాచ్యంలో యుద్ధానికి దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పౌరులకు, వైద్యసిబ్బందికి రక్షణ కల్పించాలని కోరారు.

# చర్చల ప్రశ్నేలేదు

ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి



**ఇస్తాంబుల్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తమపై దాడి చేసి అంతర్జాతీయ చట్టాలను, ఐక్యరాజ్యసమితి ఛార్టర్ నియమనిబంధనలను, ప్రాథమిక సూత్రాలను దారుణంగా ఉల్లంఘించారని ఇరాన్ విమర్శించింది. ఇజ్రాయెల్ దాడులు ఆపేస్తే చర్చల గురించి ఆలోచిస్తామని ప్రకటించిన ఇరాన్, ఇక చర్చలకు అవకాశమేలేదని చెప్పింది. ఇస్తాంబుల్‌లో 51 దేశాల ప్రతినిధులతో జరుగుతున్న ఐఒసి (ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కౌన్సిల్) సమావేశంలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈ ప్రకటన చేశారు. అమెరికా దాడులు చేసిన తర్వాత ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ దురాక్రమణ చర్యలకు ఇక అమెరికాయే పూర్తి బాధ్యత వహించాలన్నారు. ఇజ్రాయెల్‌తో చర్చలకు ఇక అవకాశమే లేదని, సోమవారంనాడు రష్యాఅధ్యక్షుడు పుతిన్‌ను కలుసుకుని ఆయనతో సంభాషణలు చేసి మరింత మెరుగైన నిర్ణయం తీసుకుంటామనీ చెప్పారు. ఇక తమ దేశాన్ని రక్షించుకోవడానికి, ప్రజలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని దారులూ తెరచుకున్నాయని, తమవద్ద అన్ని రకాల ప్రత్యామ్నాయ మార్గాలూ ఉన్నాయని అన్నారు. ఇకమీదట ప్రతి అమెరికన్ పౌరుడిమీదా దాడి చేయడానికి ఇరాన్‌కు పూర్తి హక్కులు వచ్చాయన్నారు. అమెరికా చేసిన క్రూరమైన సైనిక దురాక్రమణ చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. మస్కట్‌లో అ మెరికా–ఇరాన్ మధ్య ఆరో విడత చర్చలకు, దౌత్యపరమైన చర్యలకు జరుగుతున్న సన్నాహాలను రెండు రోజులముందుగానే ఇజ్రాయెల్ బాంబుదాడులతో పేల్చేసింది, ఇప్పుడు అమెరికా కూడా దౌత్యమార్గాన్ని బాం బు దాడులతో పేల్చేసింది, పదే పదే ఈ రెండు దేశాలు దౌత్యచర్యలను పేల్చివేశాయి'' అన్నారు. గతవారం ఇజ్రాయెల్ దాడి చేసినప్పుడు మేం అమెరికాతో చర్చలకు సిద్ధపడ్డాం, ఇప్పుడు అమెరికా దాడులు చేసినప్పుడు మేం యూరోపియన్ యూనియన్‌తో ఆర్గనైజేషన్ ఆఫ్ ఇస్లామిక్ కౌన్సిల్‌తో చర్చలు జరుపుతున్నాం, ఇలా మా ప్రయత్నాలను వమ్ము చేశారు, ఇక అమెరికాకు తీరనిగాయం అవుతుంది, అందుకు అమెరికా సిద్ధంగా ఉండాలి'' అని హెచ్చరించారు.

## చైనాలో ఊహించని వర్షపాతం భారీ వరదలు



**బీజింగ్ :** దక్షిణ చైనా హునాన్ రాష్ట్రంలో 1998 తర్వాత మళ్ళీ ఊహించని వర్షపాతం నమోదైంది. భారీస్థాయిలో వరదలు సంభవించాయి. దీంతో ఏడు చైనా నగరాలలో 4,00,000 మంది తీవ్ర ప్రభావితులయ్యారు. ఇళ్ళు కోల్పోయిన 95,000 మంది ప్రజలను ఇతర ప్రాంతాలకు తరలించారు. లిషుయ్ నది ఎగువ–దిగువ ప్రాంతాలలో ఉన్న జనావాసాలను వరదలు ముంచెత్తాయి. గడచిన బుధవారం నుండీ శనివారం సాయంత్రం వరకూ హునాన్ రాష్ట్రంలో 68.5 మి.మీ వర్షపాతం నమోదైంది. జాంగ్జియాజీ, చాంగ్డే, జియాంగ్జీ తుజియా, హువైహువా, మియామీ స్వయంప్రతిపత్తి ప్రాంతంలో 100 మి.మీ లకుపైగా వర్షపాతం నమోదైంది. షాంగ్జీ కౌంటీలోని బడాగోంగ్షాన్ టౌన్‌షిప్‌లో ఊహించనిరీతిలో 664.5 మి.మీ వర్షపాతం నమోదైంది. స్థానిక ప్రభుత్వాలు అత్యవసర సేవలను అందుబాటులోకి తెచ్చాయి. ముఖ్యంగా జాంగ్జియాజీ ప్రాంతంలో 331.3 మి.మీ వర్షపాతం నమోదైంది. ఇంతభారీస్థాయిలో వరదలు వస్తాయని స్థానికులు ఎప్పుడూ భావించలేదు. దీంతో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. గురువారం తెల్లవారుజామున ప్రజలు ఇంకా నిద్రలో ఉన్న సమయంలోనే నీరు నగరాల్లోకి, నివాసిత ప్రాంతాలలోకి ప్రవేశించింది. 14 నదుల వెంబడి ఉన్న 16 జలకేంద్రాల వద్ద భారీస్థాయిలో నీటిమట్టాలు పెరిగాయి. జిన్‌చెగ్జింయాన్ కేంద్రంవద్ద నీటిమట్టం నిల్వ 191,77 మీటర్ల ఎత్తుకు చేరాయి. 1983లో ఈ జలకేంద్రంవద్ద నీటి మట్టం 188 మీటర్లుగా మాత్రమే నమోదైంది.

## ఇజ్రాయెల్‌కు తిరుగులేదు : ట్రంప్ రిస్కీ గేమ్




**వాషింగ్టన్:** ఇరాన్‌పై దాడిచేసిన తర్వాత అమెరికా పత్రికలు ట్రంప్‌ను, ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి ఆకాశానికి ఎత్తేశాయి.''శత్రుదేశాలు మొదటిసారి ప్రత్యక్షంగా పోరాడుకుంటున్నాయి'' అని పేర్కొన్నాయి. మరికొన్ని అంతర్జాతీయ పత్రికలు ట్రంప్ చర్యను దుస్సాహసంగా అభివర్ణించాయి. ట్రంప్ రిస్కీ గేమ్ ఆడుతున్నాయని కొన్ని పత్రికలు హెచ్చరించాయి. ఇరాన్‌పై అమెరికా దాడులను చైనా పత్రికలు పెద్దగా హైలైట్ చేయలేదు. మూడు అణుస్థావరాలపై దాడి చేసినట్లు ట్రంప్ చెప్పారన్న ఒక్కవార్తతో చైనా ప్రభుత్వపత్రిక ముగించింది. ''ఇరాన్‌తో యుద్ధంలోకి ప్రవేశించిన అమెరికా'' అని న్యూయార్క్ టైమ్స్ పత్రిక బెబ్‌సైట్ భారీ శీర్షికతో అనేక అంశాలను ప్రస్తావించింది. అమెరికా సైన్యాలు మరోసారి మధ్యప్రాచ్యంలో యుద్ధంలోకి ప్రవేశించాయని ఆ పత్రిక పేర్కొంది. ఇరాన్‌పై పెంటగాన్ ప్రతీకార చర్యలకు సిద్ధపడుతోందన్న సంకేతాలు వెలువడుతున్నప్పటికీ, ఇంకా రెండు వారాలు గడువు ఉందన్న ప్రకటనల మధ్య ఈ అసాధారణ దాడులు జరిగాయని పత్రిక పేర్కొంది. ఇజ్రాయెల్ ఇక ఎవ్వరూ సవాలు చేయడానికి సాధ్యంకానంత అతిపెద్ద సైనికశక్తిగా ఎదిగిందని ''వాషింగ్టన్ పోస్ట్'' పత్రిక వ్యాఖ్యానించింది. ''ఇరాన్ బలహీన పడింది, కానీ ఓడిపోలేదు'' అని వాషింగ్టన్ పోస్ట్ వ్యాఖ్యానించింది. ''ఇరాన్ అణు సుసంపన్నతగల కేంద్రాలను పూర్తిగా అమెరికా ధ్వంసం చేసింది'' అని ఇది అమెరికా సైన్యం ఘన విజయం'' అని ట్రంప్ చేసిన ప్రకటనచుట్టూ అమెరికా పత్రికావార్తాలన్నీ తిరుగాడాయి. ''ఇక ఇరాన్ దిగి రాకతప్పదు, లేకపోతే మరిన్ని లక్ష్యాలపై దాడిచేస్తాం'' అని ట్రంప్ చేసిన హెచ్చరికను కూడా అమెరికా పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి.

## పెను ఘర్షణకు ట్రంప్ ఆజ్యం:యుఎన్‌ఒ



**జెనీవా:** మధ్యప్రాచ్యంలో తీవ్ర ఘర్షణకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆజ్యం పోశారని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రెస్ విమర్శించారు. ఇప్పటికే మధ్యప్రాచ్యంలో అంతంతమాత్రంగా ఉన్న శాంతి, సుస్థిరతలు అమెరికా దా డులతో అడుగంటిపోయాయని అన్నారు. ఈ పరిస్థితులు వేరే ఇతర పరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.ఊహించని రీతిలో ఇరాన్‌పై దాడులు చేసి ప్రపంచ దేశాలను ట్రంప్ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేశారని విమర్శించారు.

## భారత్ పిలుపు

**(మొదటి పేజీ తరువాయి)**

ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా మోదీ ఒక పోస్టింగ్ పెట్టారు. ''మధ్యప్రాచ్యంలో పరిస్థితుల గురించి మేం ఇద్దరం చర్చించాం, ఈ ప్రాంతంలో ఇటీవల సంభవిస్తున్న పరిణామాలపట్ల భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తక్షణం శాంతి చర్చలు ప్రారంభించాలి, ప్రాంతీయ శాంతి, భద్రతల పునరుద్ధరణకు, స్థిరత్వాన్ని సాధించడానికి తక్షనం ఉద్రిక్తతలు సడలింపజేయాలి. ఉద్రిక్తతలు సడలిపోవాలంటే చర్చలు ఒక్కటే మార్గం, దౌత్యకోసం మేం ఇద్దరం పిలుపు ఇచ్చాం'' అని మోదీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు.

**మధ్యవర్తిత్వానికి చైనా–రష్యా సిద్ధం**

ఇజ్రాయెల్–అమెరికా దేశాలు ఎడతెగని దాడులు చేస్తున్న నేపథ్యంలో యుద్ధ నివారణకు మధ్యవర్తిత్వం చేసేందుకు రష్యా–చైనా దేశాలు సుముఖత వ్యక్తం చేశాయి. ఇరాన్‌పై బలప్రయోగం చేయడం యుద్ధ నివారణకు ఎంతమాత్రం ఉపయోగపడదని చైనా స్పష్టం చేసింది. మధ్యప్రాచ్యంలో శాంతి,సుస్థిరతలను నెలకొల్పేందుకు నిర్మాణాత్మక పాత్ర వహించేందుకు చైనా సిద్ధంగా ఉందని తెలిపింది. బలప్రయోగం చేయడం సరైన మార్గం కాదనీ, దీనివల్ల ఉద్రిక్తతలు మరింతగా పెరుగుతాయని హెచ్చరించింది. ఈ విధమైన దాడులు అంతర్జాతీయంగా ఏ దేశానికీ ప్రయోజనకరం కాదని చైనా విదేశీ మంత్రిత్వశాఖ ప్రతినిధి గువో జియాకున్ చెప్పారు.శాంతియుత ప్రయోజనాలకోసం, పౌర అవసరాల నిమిత్తం అణుపదార్థాలను తయారు చేసేకునేహక్కు ఇరాన్‌కు ఉందని అందువల్ల యుద్ధాన్ని నివారించేందుకు మధ్యవర్తిత్వం చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని ఆ దేశ అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే సంసిద్ధిత వ్యక్తం చేయగా, చైనా కూడా అందుకు సుముఖంగా ఉన్నట్లు ప్రకటించింది. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ యుద్ధ నివారణ చర్యల్లో భాగంగా ఇప్పటికే నాలుగు అంశాలతో కూడిన ప్రతిపాదన చేశారని గువో జియాకున్ చెప్పారు. యుద్ధ నివారణకు రష్యా సంసిద్ధత వ్యక్తం చేసిందనీ, మరి చైనా సంగతేమిటని పాత్రికేయులు ప్రశ్నించగా, ఇజ్రాయెల్ దాడులు ప్రారంభించిన తర్వాత పది రోజులుగా సంబంధిత దేశాలతో చైనా అధ్యక్షుడు దౌత్యపరమైన సంప్రదిపులు ప్రారంభించారని, ఉద్రిక్తతలు సడలించేందుకు తెరవెనుక కృషి చేస్తున్నారని చెప్పారు. కాల్పుల విరమణకు, యుద్ధాన్ని ముగించేందుకు కలిసి పనిచేయడం ఒక్కటే తక్షణ ప్రాధాన్యతాంశమని అన్నారు.

## బనకచర్లపై వెనక్కి తగ్గం

**(మొదటి పేజీ తరువాయి)**

దాంతో పాటు నాసిరకం పనులు చేశారని ఆరోపించారు. నిజామాబాద్‌కు శ్రీరాంసాగర్ ద్వారానే సాగునీరందుతుందని, కాళేశ్వరం నుంచి నీరందలేదన్నారు. నాయకులు, పారిశ్రామికవేత్తలు, జడ్జీలు, సినీతారలు, బడానాయకుల ఫోన్‌లు 650 మందివి ట్యాప్ చేసిన నీచమైన చరిత్ర బిఆర్‌ఎస్ పార్టీదన్నారు. 650 మంది వాళ్ల పేర్లు బహిర్గతం చేయాలని మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. ట్యాప్ అయిన వాళ్లంతా స్వచ్ఛందంగా విచారణకు హాజరు కావలని సూచించారు. కేసీఆర్, కేటీఆర్ ప్రమేయంతోనే ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు భావిస్తున్నామన్నారు. దేశ చరిత్రలోనే అతి పెద్ద నేరం ఫోన్ ట్యాపింగ్ అని అందులో భాగం పంచుకున్న ప్రతిఒక్కరూ జైలుకు వెళ్లటం ఖాయమని పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. సిట్ విచారణపై నమ్మకం లేదన్న బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలన్నారు. కేంద్ర మంత్రి హోదాలో చట్టాలపై నమ్మకం లేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ లేకుండా ప్రభాకర్ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి ఉండకపోవచ్చన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సీటు విచారణపై నమ్మకం లేదన్న వ్యాఖ్యలపై బండి సంజయ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే జిల్లాను అభివృద్ధి చేశామని సాగునీరు కోసం ఎత్తిపోతల పథకాలు తీసుకవచ్చామన్నారు. సమావేశంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, పంచరెడ్డి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ఓ ఎటిఎం

**(మొదటి పేజీ తరువాయి)**

కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ మాట్లాడారు. కాళేశ్వరంపై బిజెపి స్టాండ్ మారిందని, బిఆర్‌ఎస్‌తో కుమ్మక్కైందని కొంత మంది విష ప్రచారం చేయడాన్ని తప్పుపట్టారు. కాళేశ్వరంపై బిజెపి స్టాండ్‌కు భిన్నంగా మా పార్టీ నాయకులు ఎవరు మాట్లాడినా తప్పే.. వాళ్ల విషయం హైకమాండ్ చూసుకుంటుందన్నారు. కాళేశ్వరం ముమ్మాటికీ పూర్తిగా అవినీతిమయమైన ప్రాజెక్ట్ అన్నారు. 38 వేల కోట్ల ప్రాజెక్టును 1.2 లక్షల కోట్ల అంచనాలు పెంచి కెసిఆర్ దోచుకున్నది ముమ్మాటికీ నిజం అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో పనిచేసిన అధికారులే వందల కోట్లు సంపాదించారంటే ఇక కేసిఆర్ కుటుంబం ఏ స్థాయిలో అవినీతికి పాల్పడిందో అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కెసిఆర్ కుటుంబాన్ని వదిలేసి కొందరు అధికారులనే బలి చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. కెసిఆర్ అవినీతికి పాల్పడ్డారని ఆధారాలున్నా ఎందుకు అరెస్టు చేయడం లేదని ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాళేశ్వరంపై సిబిఐ విచారణ జరపాలని రాహుల్‌గాంధీ చెప్పినప్పటికీ అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలన్నారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విచారణతో తమకు నమ్మకం లేదన్నారు. సిబిఐ విచారణ జరపాలన్నదే ప్రధాన డిమాండ్ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ బిఆర్‌ఎస్ పార్టీలు సంయుక్తంగా ప్రభుత్వాన్ని నడుపుతున్నాయన్నారు. ఈ రెండు పార్టీలు నాణేనికి బొమ్మాబొరులాంటివేనన్నారు. కెసిఆర్‌కు రేవంత్ రెడ్డి రక్షణ కవచంగా మారారని, అందుకే కెసిఆర్‌పై ఎన్ని అవినీతి ఆరోపణలున్నా, కేసులు పెట్టినా ఆయనను మాత్రం అరెస్టు చేయకుండా కాపాడుతున్నారన్నారు. నేషనల్ సేఫ్టీ అథారిటీ డ్యాం(ఎన్డీఎస్‌ఏ) అంటే కెసిఆర్ లెక్క తాగి ఏది పడితే అది రాసే సంస్థ కాదని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 246 ప్రకారం పార్లమెంటు ఆమోదించి ఏర్పాటు చేసిన అథారిటీ అని తెలిపారు. ఎన్డీఎస్ స్వతంత్రంపైనే బురద చల్లుతారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం వల్ల వచ్చిన లాభమేమీ లేదన్నారు. తమకు అధికారం ఉంటే ఈ పాటికే కెసిఆర్‌ను, అవినీతిపరులను ఎప్పుడో జైల్లో వేసేవాళ్లమన్నారు. కేంద్రమే నేరుగా సిబిఐతో విచారణ చేయించే అవకాశముంటే కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఈ పాటికే వాళ్లను బొక్కలో వేసేవాళ్లమన్నారు.

బిజెపి కుటుంబ పార్టీలకు ముమ్మాటికీ వ్యతిరేకమన్నారు. బిఆర్‌ఎస్ లాంటి అవినీతి, కుటుంబ పార్టీని దరిదాపుల్లోకి రానివ్వమన్నారు. కరీంనగర్‌లో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలివ్వాల్సిందేనన్నారు.

## చట్టాల ఉల్లంఘన

**(మొదటి పేజీ తరువాయి)**

ధోరణి ప్రపంచంలో ఉద్రిక్తతలను రేకెత్తించడమేనని, పశ్చిమాసియాను పూర్తిగా అస్థిరపరిచి,అణిచివేసే కుట్రలో భాగమని 5 వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఈ ఐదు వామపక్ష పార్టీలు ఆదివారం ఇక్కడ ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధానకార్యదర్శి డి.రాజా, సిపిఐ(ఎం) ప్రధానకార్యదర్శి ఎం.బేబి, సిపిఐ(మార్క్సిస్టులెనినిస్ట్) లిబరేషన్ ప్రధానకార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి) ప్రధానకార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఎఐఎఫ్‌బి) ప్రధానకార్యదర్శి జి.దేవరాజన్ పేర్లతో కూడిన ఒక సంయుక్త ప్రకటనను వారు విడుదల చేశారు.

ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసే దశలో ఉందని అమెరికాఇజ్రాయెల్ తమ దాడులను సమర్థించుకుంటున్నారని, అయితే ఈ దశలో ఇంటర్నేషనల్ ఆటమిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐ.ఏ.ఇ.ఏ) డెరెక్టర్ జనరల్ రాఫెల్ గ్రోసీ జూన్ 19న వివరించినది ముఖ్యమైనదిగా భావించాలని ఆయన పేరొన్నది వామపక్షపార్టీలు ప్రత్యేకంగా ప్రస్తావించాయి. 'అణ్వాయుధాల కోసం ఇరాన్ క్రమబద్ధీకరించబడిన ప్రయత్నం దిశగా అడుగులు వేస్తుందనడానికి మా వద్ద ఎలాంటి ఆధారాలు లేవు' అని అన్నారని వామపక్ష పార్టీల అగ్రనేతలు గుర్తుచేశారు. ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేస్తోందని సూచించే నిశ్చయాత్మక ఆధారాలు తమ వద్ద లేవని అమెరికా నిఘా (ఇంటెలిజెన్స్) సంస్థలు కూడా అంగీకరించాయని, అంతేకాకుండా అణ్వాయుధ వ్యాప్తినిరోధక ఒప్పందం( నాన్ ప్రొలిఫరేషన్ ట్రీటీఎన్‌పిటి)పై ఇరాన్ కూడా సంతకందారుగా ఉందన్నారు. ఈ వాస్తవాలు ఉన్నప్పటికీ ఇరాన్‌అమెరికా మధ్య ఉన్న సంభావ్య చర్చలను దెబ్బతీసేందుకు జూన్ 12న ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడిచేసిందని, ఇప్పుడు అమెరికా కూడా దురాక్రమణ చర్యల్లో భాగంగా ఇజ్రాయెల్‌తో జతకట్టి నేరుగా ఇరాన్‌పై బాంబులదాడికి దిగిందన్నారు. ట్రంప్ చర్చలకు రెండు వారాల సమయం ఇచ్చినప్పటికీ అమెరికాఇజ్రాయెల్ యాక్సిస్ వారి సొంత నిఘా అంచనాలను లేదా ఏదైనా దౌత్య ప్రక్రియను పెద్దగా పట్టించుకోలేదని, వారి ఉద్దేశం ఇరాన్‌పై, యావత్ పశ్చిమాసియాపై యుద్ధం కొనసాగించాలన్న దురాక్రమణవాదంతో ఉందని వామపక్ష పార్టీల అగ్రనేతలు మండిపడ్డారు. ప్రపంచ వనరుల ప్రవాహాన్ని నియంత్రించడం ద్వారా పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని సాధించాలనే దురుద్దేశం, కుట్ర దాగిఉందని నిప్పులుచెరిగారు. ఈ దాడి ఉద్దేశం సైనిక, పారిశ్రామిక సముదాయం ప్రయోజనాలను తీర్చడం, అంతర్జాతీయ మూలధనం దీర్ఘకాలిక సంక్షోభం నుంచి బయటపడటానికి దాని మార్గాన్ని రూపొందించుకోవడమేనన్నారు. ఇప్పటికైనా భారత ప్రభుత్వం అమెరికా అనుకూల, ఇజ్రాయెల్ అనుకూల విదేశీ ఆలోచనా విధానాన్ని విడనాడాలని, యుద్ధాన్ని నివారించేందుకు ప్రపంచస్థాయి ప్రయత్నాలు సాగించాలన్నారు. మన దేశంలోని శాంతికాముకులంతా ఐక్యమై అమెరికా దాడులను ఖండించాలని, సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని వామపక్ష పార్టీలు ముక్తకంఠంతో పిలుపునిస్తున్నట్లు ప్రకటించాయి.

## ప్రత్యక్ష దాడి

**(మొదటి పేజీ తరువాయి)**

రెండింటిని ధ్వంసం చేయగల 13,500 కిలోగ్రాముల బంకర్ బస్టర్ బాంబులను అమెరికా ప్రయోగించింది. దాడుల తర్వాత అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జాతిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇరాన్‌లో ఉన్న ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అనే మూడు కీలక అణుస్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశామని ప్రకటించారు. ''అమెరికా, ఇజ్రాయెల్‌సహా ప్రపంచ దేశాలకు ఇదొక చరిత్రాత్మక ఘట్టం, యుద్ధం ఆపేందుకు ఇరాన్ ఇకనైనా అంగీకరించాలి,కృతజ్ఞతలు'' అని ప్రకటించారు. ఎంతో విజయవంతంగా ఈ దాడులను పూర్తిచేశామని ట్రంప్ చెప్పారు. ఇప్పటికైనా ఇరాన్ శాంతికి కట్టుబడాలని, లేకపోతే మరిన్ని దారుణమైన దాడులకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. బాంబు దాడుల తరువాత యుద్ధ విమానాలు సురక్షితంగా దేశానికి తిరిగి వచ్చాయని చెప్పారు. రెండు వారాల తర్వాతగానీ దాడుల విషయం తేలే అవకాశం లేదని చెప్పిన ట్రంప్ మెరుపు దాడులకు దిగారు. ఇరాన్ అణుకేంద్రాలే లక్ష్యంగా దాడులు చేసినట్లు రక్షణశాఖ ప్రతినిధులు కూడా ధృవీకరించారు.''ఆపరేషన్ మిడ్‌నైట్ హ్యామర్'' పేరుతో దాడులు జరిగాయి.

''ఇరాన్ అణు కార్యక్రమాన్ని సంపూర్ణంగా నాశనం చేశాం'' అని అమెరికా రక్షణ మంత్రి పీటర్ హెగ్సెత్ ప్రకటించారు. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని మార్చే ఉద్దేశంతో ఈ దాడులు చేయలేదని, ఇరాన్‌లో అణుస్థావరాలను ధ్వంసం చేయడమే లక్ష్యంగా దాడులు చేశామని ప్రకటించారు. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండకూడదని గడచిన పది సంవత్సరాలుగా ట్రంప్ చెబుతూ వస్తున్నారని హెగ్సెత్ గుర్తుచేశారు. ఇరాన్‌ను ఇప్పటికీ చర్చలకు ఆహ్వానిస్తున్నాని, అందుకు తలుపుతు తెరచే ఉన్నాయని చెప్పారు. దాడి చేయాలని ఎప్పుడు నిర్ణయం తీసుకున్నారని ప్రశ్నించగా, ట్రంప్ ఎప్పుడూ శాంతికే కట్టుబడ్డారని, ఇరాన్‌కు అనేక అవకాశాలు ఇచ్చారని అన్నారు.

గురిచూసి లక్ష్యాలను ధ్వంసం చేయగల 75 గైడెడ్ ఆయుధాలను ఇరాన్ అణుకేంద్రాలపై ఉపయోగించామని పెంటగాన్ జాయింట్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జనరల్ డాన్ కైన్ చెప్పారు. ఈ ఆయుధాల్లో సామూహిక విధ్వంసాన్ని సృష్టించే 14 శక్తిమంతమైన ఆయుధాలు కూడా ఉన్నాయని చెప్పారు. అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఎన్‌బిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, ఇరాన్‌తో తాము యుద్ధం చేయడం లేదన్నారు. కేవలం ఆ దేశంలో ఉన్న అక్రమ అణుస్థావరాలను మాత్రమే గురిచూసి పూర్తిగా ధ్వంసం చేశామని చెప్పారు.

టెహ్రాన్‌కు 100 కి.మీ దూరంలో ఉన్న పర్వతశ్రేణుల్లోని భూగర్భంలో ఉన్న ఫోర్డో అణుకేంద్రంసహా మరో రెండు అణుస్థావరాలపై అమెరికా బాంబర్లు ఆయుధ దాడులు చేశాయి. ఇరాన్‌పై దాడులు చేశామని అమెరికా భారీ ప్రచారం చేస్తున్నప్పటికీ సాక్ష్యాధారాలు మాత్రం బలహీనంగా ఉన్నాయని విశ్లేషకులు విమర్శించారు. యుద్ధ దాడులకు సంబంధించిన సమీక్షలు అమెరికా ప్రభుత్వంలో ఇంకా కొనసాగుతున్నాయి. అమెరికా–ఇరాన్ మధ్య గడచిన 45 సంవత్సరాలుగా కొనసాగుతున్న సంఘర్షణలో ఈ ఘట్టం అత్యంత కీలకమైనదని విశ్లేషకులు చెప్పారు.

అమెరికా దాడుల తర్వాత ఇరాన్ ఒక ప్రకటన చేస్తూ, ట్రంప్ ద్రోహానికి పాల్పడ్డారనీ, అపరిమితమైన పరిణామాలను అమెరికా ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. తమ అణుస్థావరాలకు పెద్దగా నష్టం జరగలేదని ప్రకటించింది. ఇరాన్ జాతీయ అణుభద్రతా వ్యవస్థ కేంద్రాన్ని ఉటంకిస్తూ ఆ దేశ ప్రభుత్వ మీడియా ఒక ప్రకటన చేసింది. రేడియేషన్ రియాక్టర్స్ నుండి ఎలాంటి కాలుష్యం విడుదల కాలేదని ప్రకటించింది. అందువల్ల ఇరాన్‌లో నివాసితులకు ఎలాంటి భయాలు అవసరం లేదని, అమెరికా దాడుల తర్వాత అణుకాలుష్యం జాడలు ఎక్కడా లేవని తెలియజేసింది.

### 40 క్షిపణులతో ఇరాన్ దాడి

అమెరికా దాడుల అనంతరం 40 క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో 80 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ ప్రభుత్వం ప్రకటించింది. దాడులు జరిగిన ఘటనాస్థలతాలను సందర్శించకుండా విదేశీ మీడియాపై ఇజ్రాయెల్ ఆంక్షలు విధించింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ భారీఎత్తున దాడులు చేసింది. కానీ దాడిచేసిన సమాచారాన్ని పూర్తిగా తెలుసుకోనివ్వకుండా ఇజ్రాయెల్ ప్రభుత్వంలో ఇద్దరు మంత్రులు పత్రికా విలేకరులకు అడ్డుపడుతున్నారని ఫ్రాన్స్ పత్రిక తెలిపింది. ఇజ్రాయెల్‌లో దాడులు జరిగిన ఘటనా ప్రదేశాలకు విదేశీమీడియాను వెళ్ళనివ్వకుండా మంత్రులు అడ్డుపడుతున్నారని పేర్కొంది. ఇరాన్‌లో ఇతర లక్ష్యాలను కూడా తాము చావుదెబ్బ తీస్తామని, ఆ కార్యాచరణ కొనసాగుతుందని ఇజ్రాయెల్ ఆర్మీ అధికార ప్రతినిధి ఎఫీ డెఫ్రిన్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ప్రకటించింది. ఇరాన్ అణుస్థావరాలపై అమెరికా దాడులు చేసిన తర్వాత ఇజ్రాయెల్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశ గగనతలాన్ని మూసేస్తున్నట్లు ఇజ్రాయెల్ ఏర్‌పోర్ట్ అథారిటీ ఒక ప్రకటన చేసింది. దేశంలోకి వచ్చే విమానాలకు, దేశంలోంచి వెళ్ళే విమానాలకు ఎలాంటి అనుమతి లేదని పేర్కొంది.

### నాటో నౌకాస్థావరాలపై దాడికి సిద్ధం : షరియత్‌మదారి

అణుకేంద్రాలపై అమెరికా దాడిచేసిన కొద్ది గంటలకు ఇరాన్ సర్వాధినేత ఆయొతుల్లా అలీ ఖమేని సన్నిహితుడు, ఆయన ప్రతినిధి హుస్సేన్ షరియత్‌మదారి ఒక ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యం పరిసర సముద్ర జలాల్లో ఉన్న అమెరికా నౌకాదళంపై దాడులు చేస్తామని హెచ్చరించారు. ''ఇప్పుడు ఇక మా వంతు వచ్చింది, ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా బహ్రైన్‌లో ఉన్న అమెరికా నావికాదళంపై దాడులు చేస్తాం'' అని హెచ్చరించారు. టెహ్రాన్ నుండి ప్రచురితమయ్యే పర్షియన్ భాషావార్తాపత్రిక ''కయ్‌హాన్''కు షరియత్ మదారి మేనేజింగ్ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ఖమేనీకి ఆయన అత్యంత సన్నిహిత విశ్వసనీయుడు. బహ్రైన్‌లో ఉన్న అమెరికా నావికాదళంతోపాటు హోర్మోజ్‌కు సమీపంలో ఉన్న బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ నౌకలపై ఒకేసారి దాడులు చేస్తామని ఆయన హెచ్చరిక చేశారు. కాగా ఈ ప్రకటన వెలువడకముందే ఖతార్ ప్రభుత్వానికి ఇరాన్ ఈ దాడుల హెచ్చరిక చేసింది. ఒకవేళ అమెరికా గనుక తమ అణుస్థావరాలపై దాడి చేస్తే పర్షియన్ గల్ఫ్‌లో ఉన్న అమెరికా నౌకాస్థావరాలపై దాడులు చేస్తామని ఖతార్‌ను ముందే 'కయ్‌హాన్' పత్రిక ద్వారా హెచ్చరించింది. అమెరికా సైనిక స్థావరాలపైనా, దౌత్యకార్యాలయాలపైనా దాడులు చేస్తామని ప్రభుత్వం చెప్పినట్లు పత్రిక పేర్కొంది. ఇదిలా ఉండగా అమెరికా, ఇతర ఇజ్రాయెల్ మిత్రదేశాల నౌకాస్థావరాలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్న కువైత్, బహ్రైన్‌లు ఇరాన్ దాడులనుండి కాపాడుకోవడానికి సన్నాహాలు చేసుకుంటున్నాయి. జాతీయ రహదారులపై వాహనాల రాకపోకలను పర్యవేక్షిస్తున్నాయి. డ్రైవర్లకు తగిన సూచనలు ఇస్తూ, సాధ్యమైనంతవరకూ హైవేలపైకి రావొద్దని హెచ్చరికలు జారీ చేశాయి.

### ఖమేనీపై దాడికి యత్నిస్తే పరిమితిలేని పరిణామాలు

తమ సుప్రీం లీడర్ ఆయొతుల్లా అలీ ఖమేనీపై దాడికి ప్రయత్నాలు చేస్తే అంతులేని పరిణామాలు సంభవిస్తాయని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు ప్రకటించారు. ఇక ఏ దేశంతోనూ, ఎవ్వరితోనూ సంప్రదింపులుగానీ, ఒప్పందాలుగానీ ఇరాన్ చేసుకునే అవకాశం ఉండబోదని, పరిమితిలేని ప్రతిస్పందన ఇరాన్ నుండి శత్రుదేశాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు. ''అలాంటి దాడి జరిగితే అది అన్ని హద్దులను, ఎర్రగీతలనూ దాటేసి వచ్చినట్టే, ఇక అప్పుడు ఇరాన్ స్పందనకు ఎలాంటి పరిమితులూ ఉండవు, ఏదైనా జరగవచ్చు'' అని ఆయన అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి సర్కార్ కృషి అభినందనీయం

డాక్టర్ నోరి దత్తాత్రేయుడు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిని ప్రముఖ అంకాలజిస్ట్, పద్మశ్రీ డాక్టర్ నోరి దత్తాత్రేయుడు అభినందించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని డాక్టర్ నోరి దత్తాత్రేయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో క్యాన్సర్ కేర్ సిస్టం అభివృద్ధికి ప్రభుత్వానికి అన్నివిధాలుగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నామని సిఎంకు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు ఈ సందర్భంగా చెప్పారు.



# ఎర్రజెండాలన్నీ ఏకం కావాలి

సిపిఐ మంచిర్యాల జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు




**ప్రజాపక్షం/మంచిర్యాల :** సామ్రాజ్యవాదానికి ప్రత్యామ్నాయంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మావోయిస్టు పార్టీ సభ్యులు జనజీవన స్రవంతిలోకి వచ్చి సిపిఐ, సిపిఎం పార్టీలు కలిసి ఒకే ఎర్రజెండా కింద ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆదివారం భారత కమ్యూనిస్టు మంచిర్యాల జిల్లా నాల్గవ మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మొదట మహాసభలు నిర్వహిస్తున్న సభాప్రాంగణం ముందు అమరవీరుల స్తూపంకు నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యంకు ముందే కమ్యూనిస్టు పార్టీలు పోరాడి రజాకార్ల నుండి హైదరాబాద్ రాష్ట్రం విముక్తి కోసం పోరాడి ఎంతో మంది అసువులు బాసారని, ఆ తర్వాత స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నో పోరాటాలలో పాల్గొన్నారని, ఆ తర్వాత తెలంగాణ సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిందని గుర్తుచేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ నుండి ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటానికి పెద్ద తమ్ముళ్ళుగా సిపిఐ(ఎం) తుపాకి పట్టి ప్రజలపక్షాన పోరాటానికి, చిన్న తమ్ముళ్ళుగా మావోయిస్టులు విడిపోయారని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో మావోయిస్టులను ఏరివేయాలని కేంద్ర ప్రభుత్వం కాల్చి చంపడం సరికాదని ఖండించారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపి, వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావాల్సిన ప్రభుత్వం ఇందుకు వ్యతిరేకంగా ఏరివేత పేరుతో మావోయిస్టులను చిన్నపిల్లలను, మహిళలను పాశవికంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో అప్పటి నుండి ఇప్పటి వరకు కార్మికులు, కర్షకులు, రైతుల, ప్రజల పక్షాన నిలబడి పోరాడే కమ్యూనిస్టుల పోరాటం ఫలితంగా ప్రభుత్వాలు ప్రజలకు మేలుచేస్తున్నాయని అన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం మతోన్మాద విధానాలను ఎదుర్కోవడానికి కమ్యూనిస్టుల పాత్ర ఎంతో ఉందని, ప్రశ్నించే గొంతుకగా కమ్యూనిస్టులు ఉన్నారనే భయంతోనే ప్రజల పక్షాన జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. అదేవిధంగా అమెరికా సామ్రాజ్యవాదం వల్ల మోదీ ఎందుకు లొంగిపోయి వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధం సమయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబితే యుద్ధం ఆపేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ యుద్ధం పేరుతో మోదీ ఒక్క టెర్రరిస్టునైనా అరెస్టు చేశారా? అని ప్రశ్నించారు. కేవలం సామ్రాజ్యవాద అమెరికాకు మోకరిల్లి పనిచేయడం దేశానికి మంచిది కాదన్నారు. ప్రపంచంలో అమెరికా పెద్దన్న పాత్ర పోషిస్తు తన గుప్పిట్లో అన్నిదేశాలను పెట్టుకోవాలని ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ప్రజల పక్షాన ఆనాటి నుండి ఈనాటి వరకు మనిషి బతికి ఉన్నంత కాలం కమ్యూనిస్టులు ప్రజల పక్షానే ఉంటారని స్పష్టం చేశారు. ఈ మహాసభల్లో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర సమితి సభ్యుడు మిట్టపల్లి వెంకటస్వామి, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, కె.వీరభద్రయ్య, బొల్లం పూర్ణిమ, జోగుల మల్లయ్య, ముస్కె సమ్మయ్య, జిల్లా సమితి సభ్యుడు కలీందర్ ఆలీ ఖాన్, ప్రధాన కార్యదర్శి రామగుడు లక్ష్మణ్‌తో పాటు జిల్లాలోని పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు వెంటనే నిధులు విడుదల చేయండి

మంత్రి సీతక్కకు మాజీ మంత్రి హరీశ్‌రావు లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామ పంచాయతీలకు సంబంధించిన నిధులను వెంటనే విడుదల చేయాలని, ఇప్పటివరకు గ్రామాల్లో చేసిన పనులకుగాను మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లులను చెల్లించాలని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)కు హరీష్‌రావు ఆదివారం లేఖ రాశారు. అభయహస్తం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులను, జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో స్పెషల్ డ్రైవులు నిర్వహించి, పారిశుద్ధ్యం పెంపొందించాలని ఆ లేఖలో పేర్కొన్నారు. గత మూడు నెలలుగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వారికి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతేడాది నవంబర్‌లో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లకు కూడా ఇప్పటివరకు వేతనాలు చెల్లించకపోవడం శోచనీయమని, వారికి వేతనాలను విడుదల చేయాలని మంత్రికి రాసిన లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు.

ప్రభుత్వం నిధులను విడుదలచేయకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎక్కడికక్కడే నిలిచిపోయిందని, పారిశుద్ధ్యం పడకేసిందని, వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో ఉంటున్నాయని హరీశ్‌రావు తెలిపారు.

# రాబోయే మూడేండ్లలో.. 20లక్షల ఇందిరమ్మ ఇండ్లు

మంత్రి పొంగులేటి

నకిరేకల్‌లో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ



**ప్రజాపక్షం/చిట్యాల :** తెలంగాణ రాష్ట్రంలోని పేదవర్గాల ప్రజలకు రాబోయే మూడు సంవత్సరాలలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇస్తామని రాష్ట్ర గృహనిర్మాణ, రెవిన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ్యుడు వేముల వీరేశం అధ్యక్షతన ఆదివారం జరిగిన ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొదటి విడతలో నాలుగున్నర లక్షల ఇండ్లు నిర్మిస్తున్నామని, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున రానున్న కాలంలో నిర్మించనున్నామని అన్నారు. అర్హులైన ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేరేలా చూస్తామని అన్నారు. భూభారతి అమలులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన రెవిన్యూ సదస్సులలో 8 లక్షల 60వేల దరఖాస్తులు వచ్చాయని, వాటిని ఆగష్టు 15వ తేదిలోపు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాపాలన ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి ఉచిత విద్యుత్, రూ. 500 గ్యాస్ సిలిండర్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10లక్షలకు పెంపు, రేషన్ దుకాణాల ద్వారా పేద ప్రజలకు సన్న బియ్యం ఇలా అనేక పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, భూభారతి, రైతు భరోసా ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని, ఎకరాకు రూ.12వేలు పెంచామని, 9 రోజుల్లో రూ. 9వేల కోట్లు రైతుల ఖాతాలలో జమ అయ్యాయని అన్నారు. గత ప్రభుత్వం నల్లగొండ జిల్లాలోని ఇరిగేషన్ ప్రాజెక్టుల గురించి ఏ మాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. ఎస్‌ఎల్‌బిసి, బ్రాహ్మణవెల్లంల ఉదయ సముద్రం లాంటి ప్రాజెక్టులను చిత్తశుద్ధితో పూర్తిచేయనున్నామని అన్నారు. నియోజకవర్గంలోని రామన్నపేట, నకిరేకల్ మండలాలకు కావల్సిన తహసీల్దార్ కార్యాలయాల భవనాల కోసం త్వరలోనే నిధులను మంజూరు చేస్తామని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శాసనమండలి చైర్మన గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ ధరణి స్థానంలో భూభారతి పథకం తేవడం వల్ల రైతులకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ చిత్తశుద్ధితో ప్రభుత్వం అమలు చేస్తుందని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంఎల్‌సి శంకర్‌నాయక్, ఎంఎల్‌ఎలు బత్తుల లక్ష్మారెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి, మందుల సామేల్ తదితరులు హాజరయ్యారు.


### ఇండ్ల నిర్మాణంలో ఆంక్షలు వద్దు : ఎమ్మెల్సీ సత్యం

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కొలతల పేరుతో ఆంక్షలు వద్దని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 10 ఏళ్లు పరిపాలన ఉన్న కెసిఆర్ ప్రభుత్వం నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి ఏ ఒక్కరికీ ఇల్లు ఇవ్వలేదని ఆరోపించారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారిని ఎంపిక చేయడంలో ఇందిరమ్మ కమిటీల ద్వారా కాకుండా గ్రామ సభల ద్వారా ఎంపిక చేస్తే ఇంకా పారదర్శకంగా ఉండేదని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదేవిధంగా గత ప్రభుత్వం జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులలో పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఎస్‌ఎల్‌బిసి పిల్లాయిపల్లి ధర్మారెడ్డి ఉదయ సముద్రం బ్రాహ్మణవెల్లం ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం ఎలాంటి తప్పులు చేయకుండా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని కోరారు.

## 25న బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 25న హైదరాబాదులోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు, ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లాల్లో బిసి హక్కుల సాధన సమితి బలోపేతానికి తీసుకోవాల్సిన కార్యాచరణ, సభ్యత్వ సేకరణ అన్ని జిల్లాల మహాసభలతో పాటు రాష్ట్ర మహాసభలు నిర్వహణ, స్థానిక సంస్థల ఎన్నికలు, బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన తదితర అంశాలపై చర్చించనున్నట్లు వారు వెల్లడించారు. కార్యవర్గ సభ్యులందరూ హాజరై జయప్రదం చేయాని కోరారు.

## ‘విధ్వంసం నుంచి వికాసం వైపు’ 24న పుస్తకావిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర ప్రజాపాలనను పూర్తిచేసుకున్న సందర్భంగా గత పదేళ్ల బిఆర్‌ఎస్ విధ్వంస పాలనను విశ్లేషిస్తూ వివిధ పత్రికలలో టిపిసిసి అధ్యక్షుడు, ఎంఎల్‌సి బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ రాసిన వ్యాసాల సంకలనం ‘విధ్వంసం నుంచి వికాసం వైపు’ అనే పుస్తకావిష్కరణ మంగళవారం జరగనుంది. హైదరాబాద్ గాంధీభవన్‌లో జరగనున్న టిపిసిసి నూతన కార్యవర్గం మొదటి సమావేశంలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకుల సమక్షంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నట్లు టిపిసిసి ఒక ప్రకటనలో తెలియజేసింది. మొత్తం 260 పేజీలు ఉన్న ఈ పుస్తకంలో విధ్వంసం నుంచి వికాసం సంకలనంలో మహేష్ కుమార్ గౌడ్ వివిధ పత్రికల్లో రాసిన 36 వ్యాసాలను పొందుపరిచారు. ‘ఇందిరమ్మ రాజ్యం’ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేందుకు ఈ వ్యాసాలు ఉపయోగపడతాయని టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో విధ్వంసంపాలైన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ నినాదంతో వికాసం దిశగా తీసుకెళ్తున్న ప్రగతిని ఈ వ్యాసాలు ప్రతిబింబిస్తున్నాయన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలుచేయాలి

ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్ఠం చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**ప్రజాపక్షం/హనుమకొండ :** పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారుల తనిఖీలు శూన్యమని, ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు నియంత్రించాలని అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ డిమాండ్ చేసింది.

బాలసముద్రంలోని జిల్లా కార్యాలయంలో ఎఐఎస్‌ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఊట్కూరి ప్రణీత్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో అనేకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం అధికారులు శ్రీకారం చుట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తలెత్తుతున్నాయని, వచ్చేది వర్షాకాలం చాలా బిల్డింగ్స్ శిథిలావస్థలో ఉన్నాయని, వాటిని కూల్చి నూతన భవనాలు కట్టవలసిన పరిస్థితి ఉందని కానీ ప్రభుత్వం మొద్దు నిద్రలో ఉందని, ఇప్పటికే ఉన్న అనేక రకాల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలని, బెస్ట్ అవైలబుల్ పాఠశాలలకు రీయింబర్స్‌మెంట్ రాక ఐదు సంవత్సరాలు అవుతున్న కారణంగా వాటి యాజమాన్యాలు చేతులెత్తేశారని, విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వాటికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, పాఠశాలలోనే పుస్తకాలు, యూనిఫామ్ అమ్ముతూ అక్రమంగా లక్షల రూపాయలను దోచుకుంటున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలుకు తీసుకురావాలని విద్యాలయాలను వ్యాపార సంస్థలుగా మార్చుకున్న స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులకు ఫీజులో 25 శాతం రాయితీని కల్పించాలని, జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజులో రాయితీ కల్పించాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, జిల్లా విద్యాశాఖ అధికారులు కార్పొరేట్ ప్రవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టకపోతే అఖిలభారత విద్యార్థి సమాఖ్య ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బాషా బోయిన సంతోష్, జిల్లా ఉపాధ్యక్షులు కుక్కల కుమార్, జక్కుల భాను ప్రసాద్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కసర బోయిన రవితేజ, జిల్లా సమితి సభ్యులు శ్రీపతి వినయ్, బొజ్జు జ్యోతి పాల్గొన్నారు.

## నవ వరుడు తేజేశ్వర్ దారుణ హత్య

నంద్యాల జిల్లా పాణ్యం సమీపంలో మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల గంట వీధికి చెందిన తేజేశ్వర్ (33) దారుణ హత్యకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 17వ తేదీన మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాడన్నారు. బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో గద్వాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. తేజేశ్వర్ వివాహానికి ముందు నిశ్చితార్థం అయిన కొద్దిరోజులకే వారిద్దరి మధ్య మనస్పర్థలు నెలకొన్నాయి. అయినా కొద్ది రోజులకు మాటలు కలవడంతో గత నెల 17న బీచుపల్లి పుణ్యక్షేత్రంలో అమ్మాయి బంధువులు, అబ్బాయి తల్లిదండ్రులు సమక్షంలో వివాహ చేసుకున్నారు. నెలక్రితమే వివాహమైందని, ఇంతలోనే ఈ ఘాతుకం చోటుచేసుకుంటుందని ఊహించలేదన్నారు. పెళ్లికి ముందు ఈ సంబంధం వద్దని వారించామని కుటుంబ సభ్యులు వాపోతున్నారు. సహస్ర ఐశ్వర్య పెళ్లికి ముందే వేరే వారితో సాన్నిహిత్యం ఉందని మృతుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివాహమైన నెల రోజుల తర్వాత పథకం ప్రకారం భూమి సర్వే చేయాలని గుర్తు తెలియని వ్యక్తులు కారులో ఎక్కించుకొని తీసుకెళ్లి హత్య చేశారని బంధువులు ఆరోపిస్తున్నారు. తేజేశ్వర్ లైసెన్సుడు సర్వేయర్ కావడంతో పథకం ప్రకారం భూమి సర్వే చేయాలంటూ కారులో ఎక్కించుకొని కావడ వెళ్లి నంద్యాల జిల్లా పాణ్యం సమీపంలో కత్తులతో చంపి మృతదేహాన్ని అక్కడ పారేసి వెళ్లడంతో అక్కడి పోలీసులు వారి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో కన్నీరుమున్నీరయ్యారు. సహస్ర (ఐశ్వర్య) కు పెళ్లి ఇష్టం లేకనే ఈ కుట్రకు పాల్పడిందని సహస్ర, ఆమె తల్లి, ఒక బ్యాంకు ఉద్యోగి మా తమ్ముడి మృతికి కారకులని మృతుడి అన్న తెలిపాడు. కేసు విచారణలో భాగంగా గద్వాల సిఐ టంగుటూరె శ్రీను, ఎస్ఐ కల్యాణ కుమార్ కర్నూల్ చేరుకొని ఇరు కుటుంబాల వారిని విచారిస్తున్నారు. సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తూ సమాజంలో హుందాగా బతుకుతున్న తేజేశ్వర్ ఇష్టపడ్డ అమ్మాయిని వివాహం చేసుకొని నూతనంగా ప్రారంభించి ఇలా అకస్మాత్తుగా హత్యకు గురి కావడంతో స్నేహితులు, బంధువులు శోకసముద్రంలో మునిగిపోయారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

కలెక్టర్లు క్షేత్రస్థాయిలో సంక్షేమ అభివృద్ధిపై దృష్టిసారించాలి

వివిధ శాఖలపై సమీక్షించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** విద్యాశాఖ పట్ల కలెక్టర్లు శ్రద్ధవహించాలని, ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్య అందాలని, ప్రభుత్వ బడులలో విద్యార్థుల నమోదు పెంచాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శిథిలావస్థలో పాఠశాలలు ఉంటే వెంటనే అక్కడి నుంచి తరలించాలని, వర్షాకాలంలో ఎట్టిపరిస్థితుల్లో కొనసాగించవద్దన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్‌లోని ఆడిటోరియం హాలులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో వ్యవసాయ శాఖ, విద్యాశాఖ, హౌజింగ్ తదితర శాఖల పనితీరుపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ గత ఏడాదిన్న కాలంగా గత పాలకుల హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అస్తవ్యస్థ పరిస్థితులను సరిచేస్తూ ఆర్థిక పరమైన వెసులుబాటు చేసుకుని పాలన కొనసాగిస్తున్నామన్నారు. జులై వరకు అవసరమైన విత్తనాలు, ఎరువులు స్టాక్ జిల్లాలో అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఆయిల్ ఫామ్ సాగుపై మరింత శ్రద్ధవహించాలన్నారు. ప్రతి జిల్లాకు కేటాయించిన లక్ష్యాలకు మించి ఆయిల్‌ఫామ్ విస్తరణ చేపట్టాలన్నారు. ఆయిల్ ఫామ్ పంట చేతికి వచ్చిన రైతుల అనుభవాలను విస్తృతంగా ప్రచారం చేస్తూ వీలైనంత ఎక్కువ విస్తీర్ణంలో ఆయిల్‌ఫామ్ సాగు విస్తరణ చేయాలన్నారు. హార్టికల్చర్ అధికారులతో పాటు వ్యవసాయశాఖలోని ఎఇవో, ఎవోలు లక్ష్యాలు నిర్దేశించుకుని సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాబోయే మూడున్నరేళ్ల వ్యవధిలో సాచురేషన్ పద్ధతిలో నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేస్తామని అన్నారు. ఎమ్మెల్యేల దృష్టిలో ఉన్న నిరుపేదల జాబితాను కలెక్టర్లకు అందిస్తే ఇందిరమ్మ కమిటీలో ద్వారా స్క్రూటినీ చేయించి అర్హులైన నిరుపేదలకు పార్టీలకతీతంగా మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరికంటే రెండింతల ఆదాయం వచ్చే పంటలను రైతులకు సూచించాలన్నారు. కల్తీ విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రైతులు పూర్తి స్థాయిలో కాకపోయినా తమకు ఉన్న పొలంలో కొంతమేర వరి నుంచి ఆయిల్‌ఫామ్ వంటి పంటలకు విస్తరించాలని కోరారు. మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటల ద్వారా ఆదాయం వస్తుందని, పెద్ద రైతులను గుర్తించి వారిచే ముందు ఆయిల్‌ఫామ్ సాగును ప్రోత్సహించాలన్నారు. పారదర్శకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, అనర్హులకు ఇండ్లు రావద్దని అన్నారు. పేదలకు మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణాలు అందించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభమయ్యేలా చూస్తున్నామని అన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ వేములవాడలో సూరమ్మ ప్రాజెక్ట్, శ్రీపాద, నారాయణపురం ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ చేసేందుకు నిధులు విడుదల చేయాలన్నారు. కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ప్రతి రైతుకు వరి పంట సాగు చేయడం ద్వారా యేడాదికి ఎంత ఆదాయం వస్తుంది? ఆయిల్ ఫామ్ పంటతో ఎంత ఆదాయం వస్తుందో స్పష్టంగా తేడా తెలిసేలా అధికారులు అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు.

## శాసనసభ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి

తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలేఫ్రంట్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని శాసనసభ చేసిన తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ సంయుక్తంగా జూలై 17న చేపట్టనున్న ‘రైల్ రోకో’కు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య మద్దతు నిచ్చారు. బిసిల రిజర్వేషన్ల విషయంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత చేపట్టే ప్రతి కార్యక్రమానికి తాము అండగా నిలుస్తామని వెల్లడించారు.

జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్యను ఎమ్మెల్సీ కవిత ఆదివారం ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిసి రిజ్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేస్తూ జూలై 17న చేపట్టనున్న ‘రైల్ రోకో’కు మద్దతు ఇవ్వాలని కోరారు. దీనిపైన ఆర్.కృష్ణయ్య స్పందిస్తూ బిసి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. బిసిల విషయంలో కవిత చేపట్టే ప్రతి కార్యక్రమానికి బిసిలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. సమావేశనంతరం కల్వకుంట్ల కవిత మీడియాతో మాట్లాడుతూ రాజ్యాంగంలోని 243(డి) ప్రకారం ఒక జిఓ ద్వారా 42 శాతం రిజర్వేషన్లు కల్పించే ఆస్కారం ఉన్నప్పటికీ, ప్రభుత్వం ఆ పనిచేయకుండా, బిసిల రిజర్వేషన్ అంశాన్ని మొత్తంగా రాష్ట్రపతిపై తోసేసి, రిజర్వేషన్లు ఇవ్వకుండానే ఎన్నికల్లోకి వెళ్లేందుకు ప్రణాళిక రచిస్తోందన్నారు. కేబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని లీకులు వస్తున్న నేపథ్యంలో ప్రజావ్యతిరేక విధానానికి అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉన్నదని కవిత అభిప్రాయపడ్డారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తరతరాలుగా బిసి ఉద్యమాన్ని బిసిలు భుజాన ఎత్తుకోకపోతే భవిష్యత్తు లేదన్నారు. బిసిలకు రిజర్వేషన్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, వెంటనే జిఒను జారీచేయాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# సాహితీ విహారి

# 'కోజికోడ్'లో సాహిత్య తరంగాలు

భారతదేశానికి సంబంధించి మొట్టమొదట యునెస్కో సాహిత్య గుర్తింపు పొందిన నగరం కేరళలోని కోజికోడ్ (కోళికోడ్)కు ఆ గౌరవం ఆషామాషీగా దక్కలేదు. అక్కడ సాహిత్య వారసత్వాన్ని ముందుకు తీసుకెళుతున్న ఎన్నో ప్రముఖ గ్రంథాలయాలు ఉన్నాయి. కాలికట్ విశ్వవిద్యాలయం పరిధిలోని సిహెచ్ మొహమ్మద్ కోయా లైబ్రరీ సాహిత్యంలో ప్రత్యేకత కలిగిన పరిశోధనా కేంద్రంకా విరాజిల్లుతున్నది. ఇక్కడి లైబ్రరీలు ఎక్కువగా మహిళలు, బలహీన వర్గాల కోసం అధునాతన పఠనంపై దృష్టి పెడతాయి. అబుస్సాబా లైబ్రరీ అనేగానే బ్రెయిలీ లిపి గుర్తుకొస్తుంది. అక్కడ కనీసం బ్రెయిలీలో 150కి పైగా పుస్తకాలు ఉన్నాయి. షెడ్యూల్డ్ కులాలు, తెగల అభ్యున్నతికి అంకితమైన కెఐఆర్‌టిఎడి పరిశోధనా సంస్థ కృషి చేస్తున్నది. ఈ ప్రాంతానికి చెందిన వైకోమ్ మహమ్మద్ బషీర్ (1908–1994), ఎస్‌కె పొటెక్కట్, ఎంటి వాసుదేవన్ నాయర్, ఉరూబ్, తిక్కోడియన్ వంటి ఎంతో మంది ప్రముఖ సాహితీవేత్తలు మలయాళ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. 'బైపోర్ సుల్తాన్' అని అభిమానులు పిలుచుకునే వైకోమ్ రచనలు సరళమైన భాషలో ఉంటాయి. కానీ, లోతైన భావాలను ప్రకటిస్తాయి. మలయాళ సాహిత్యంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. తన విశేష సేవలకుగాను 1982లో ఆయనకు పద్మశ్రీ అవార్డు లభించింది. కేరళ సాహిత్య ఉత్సవం మన దేశంలోని అతి గొప్ప వార్షిక సాహిత్య ఉత్సవాల్లో ఒకటి. కోజికోడ్ బీచ్‌లో జరిగే ఈ ఉత్సవాలకు మూడు లక్షలకుపైగా సాహితీ ప్రియులు హాజరవుతారు. 'బషీర్ ఫెస్ట్', 'విద్యారంభ', 'మలబార్‌మహోత్సవం'వంటి సభలు మలయాళ సాహిత్య సంపదను విశ్వవ్యాప్తం చేస్తున్నాయి. డిసి బుక్స్, మాతృభూమి వంటి ప్రముఖ ప్రచురణ సంస్థలు పుస్తక ప్రదర్శనలు, ఉత్సవాలు నిర్వహిస్తుంటాయి. వైకోమ్ జయంతిని పురస్కరించుకొని బేపోర్ ఆర్ట్, క్రాఫ్ట్, టూరిజంతోపాటు లిటరేచర్ ఫెస్టివల్‌ను 40 రోజులు నిర్వహిస్తారు. నగరంలోని అనకుళం కల్చరల్ సెంటర్ సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలకు కేంద్రంగా విరాజిల్లుతున్నది. నిజానికి కోజికోడ్‌కు భారతదేశ చరిత్రలో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ ముఖ్యమైన సముద్రతీర నగరమే 1498లో వాస్కోడగామా తొలిసారిగా భారత తీరానికి వచ్చినప్పుడు అతని అడుగుజాడలకు నిలయమైంది. అనంతర కాలంలో వివిధ దేశాల సాహిత్య, సాంస్కృతిక మార్పిడి కేంద్రంగా మారింది. మలయాళ సాహిత్యంలో గౌరవనీయమైన స్థానం కలిగి ఉండి, అనేక ప్రముఖ రచయితల, కవుల, సంపాదకుల జన్మస్థలంగా, కార్యస్థలంగా పేరు పొందింది. కోజికోడ్‌లో మలయాళ భాష ప్రధానంగా ఉంది. మలయాళంలో కథలు, కవితలు, నవలలు, జీవచరిత్రలు, సామాజిక



(కోజికోడ్ సాహితీ నగర దినోత్సవం జూన్ 23)

వ్యాఖ్యానాలు, పద్య గీతాలు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ అరబిక్–మలయాళం (అరబిక్ అక్షరాల్లో మలయాళం రచన) వాడకం కూడా రివాజు. ఈ ఆనవాయితీ అరబిక్ దేశాలతో కేరళకు ఉన్న వాణిజ్య చరిత్రను ప్రతిబింబిస్తుంది. ఎస్‌కె పొట్టెక్కాట్ రచించిన 'ఒరుదేశథిన్తే కథ' (ఒక దేశం కథ) వంటి రచనలు ప్రజల హృదయాల్లో నిలిచిపోయాయి. సమకాలీన మలయాళ సాహిత్యంపై విశేష ప్రతిభ చూపిన వైకె నారాయణన్, చారిత్రక, సాంఘిక నేపథ్య రచనల్లో ప్రసిద్ధి పొందిన ఎంటి వాసుదేవ నాయర్ రచనలు కీర్తిప్రతిష్టలను ఆర్జించాయి. ఉల్లూర్ ఎస్. పరమేశ్వర అయ్యర్ పద్య రచనలకు విశేష గుర్తింపు పొందారు. కోజికోడ్‌లో స్థాపించిన 'మాతృభూమి వారపత్రిక' భారత దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన మలయాళ సాహిత్య పత్రిక. దీనిలో ప్రచురించబడే కథలు, పద్యాలు, విమర్శలు మలయాళ రచయితలకు గొప్ప వేదికగా నిలిచాయి. కోజికోడ్ జిల్లాలో విద్యార్థుల్ని చిన్ననాటి నుంచే కథలు చదివించడంలో, కవిత్వం పఠనంలో పాల్గొనేలా ప్రోత్సహించడంలో విశేషంగా కృషి చేస్తున్న పెద్దపెద్ద సాహిత్య వేదికలు ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా బుక్ క్లబ్‌లు, సాహిత్య వేదికలు, యువ రచయితల వర్క్‌షాపులు నిర్వహిస్తుంటారు. పబ్లిక్ లైబ్రరీల సంఖ్య అధికంగా ఉండడమేగాక, తరచు జరిగే పుస్తక ప్రదర్శనలు, పాఠక చర్చలు వంటి కార్యక్రమాలు ప్రజల్లో, ముఖ్యంగా యువతీయువకుల్లో పఠనాభిరుచిని పెంపొందిస్తున్నాయి. కోజికోడ్ పబ్లిక్ లైబ్రరీ, చిల్డ్రన్స్ బుక్ ట్రస్ట్ లైబ్రరీ వేలాది పుస్తకాలతో విజ్ఞానాన్ని పెంచుతున్నాయి. సాహిత్యం పట్ల ఆసక్తిని కలిగిస్తున్నాయి. యునెస్కో సాహిత్య నగరంగా గుర్తించినప్పటి నుంచి కోజికోడ్‌లో సాహిత్యాన్ని ఆధారంగా చేసుకుని అనేక పథకాలు అమలవుతున్నాయి. డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్‌ఫోన్లలో డిజిటల్ మలయాళ రచనలు విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. బహుభాషా అనువాద ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా, మలయాళం నుండి ఇతర భాషలకూ, ఇతర భాషల నుండి మలయాళానికీ అనువాదాలు పెరుగుతున్నాయి. పాఠశాలల్లో సాహిత్య పాఠ్య పథకాల ద్వారా విద్యార్థులకు ప్రాచీన, ఆధునిక రచనలు పరిచయం చేస్తున్నారు. పిల్లల్ని పెద్దలు తమ సమక్షంలో కూర్చోబెట్టుకొని కథలు వినిపించే సాంప్రదాయం పునరుజ్జీవితమవుతున్నది. ప్రజా పార్కుల్లో పుస్తకాల మేళాలు... బహిరంగ వేదికలలో కవితా పఠనాలు మలయాళ సాహిత్యానికి కొత్త సొబగులు అద్దుతున్నాయి. యునెస్కో సాహిత్య నగరంగా కోజికోడ్ మారడం భారతీయ భాషల సంస్కృతికి దక్కిన ఒక గొప్ప గౌరవం. ఇది కేవలం అంతర్జాతీయ గుర్తింపు మాత్రమే కాదు భవిష్యత తరాలకి భాష, సంస్కృతి, అభివృద్ధి మధ్య ఉన్న సంబంధాన్ని వివరించే ఒక జీవమయమైన పాఠం.

## సాహిత్య పండుగ..

అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'లిటరరీ ఫెస్టివల్'కు కోజికోడ్ ముస్తాబైంది. ఈ సాహితీ పండుగ మలయాళం భాషా పరంపర, భారతీయ సాహిత్యం, ప్రపంచ సాహిత్యంతో మిళితమైన వేదిక. ఈ ఏడాది జనవరి 23 నుంచి 26 వరకు, నాలుగు రోజులుపాటు ఈ ఫెస్టివల్‌కు కనీసం ఐదు లక్షల మంది హాజరయ్యారు. మొత్తం 300 సెషన్స్‌లో సుమారు 500 మంది సాహితీ ప్రముఖులు ప్రసంగించారు. రచయితలు, పాఠకుల మధ్య అనుసంధానం కల్పించడం, భిన్న భాషల సాహిత్యాలకు వేదికను అందించడం, యువ రచయితల ప్రతిభను ప్రోత్సహించడం, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక అంశాలపై చర్చలు జరపడం ఈ సాహిత్య వేదిక ప్రధాన లక్ష్యాలుగా ఈ ఫెస్టివల్ కొనసాగింది. మలయాళం, ఇంగ్లీష్, తమిళం, హిందీ తదితర భాషా రచయితలు పాల్గొన్నారు. కథ, కవితా, విమర్శా సాహిత్యం, నాటకాలు, చలనచిత్రాలు, పత్రికా రచన, ఇతర కళా రూపాలు ఇందులో చర్చలకు కేంద్ర బిందువులయ్యాయి. బాల సాహిత్యం, రచయిత్రుల పాత్ర, డిజిటల్ యుగంలో సాహిత్యం, పర్యావరణ సాహిత్యం వంటి ప్రత్యేక అంశాలపై సెషన్లు జరిగాయి. ఇందులో భాగంగానే పుస్తకావిష్కరణలు, రచయితలతో ముఖాముఖి, పాఠకులతో చర్చలు, పుస్తక ప్రదర్శనలు, కవి సమ్మేళనాలు, లిటరరీ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. కాగా, కోజికోడ్ లిటరరీ ఫెస్టివల్ ద్వారా ప్రజల్లో చదవాలన్న అభిరుచి పెరుగుతోంది. ఇది కేవలం సాహిత్య ప్రదర్శన కాదు, సాహిత్యాన్ని జీవన విధానంగా మలచే ఉద్యమం. పల్లెటూర్ల పాఠశాలల విద్యార్థుల నుంచి అంతర్జాతీయ రచయితల వరకు అందరినీ కలిపే వేదికగా వెలుగుతున్నది.

**– సత్యశ్రీ**

## తొలి సిటీ ఎడిన్‌బర్గ్..


యునెస్కో నుంచి మొట్టమొదట సాహిత్య నగరంలో గుర్తింపు పొందిన ఘనత స్కాట్‌లాండ్ రాజధాని ఎడిన్‌బర్గ్‌కు దక్కుతుంది. 2004లో, ఈ నగరాన్ని యునెస్కో ఎంపిక చేసింది. ఆర్థర్ కోనన్ డోయల్ (షెర్లాక్ హోమ్స్), వాల్టర్ స్కాట్ (వేవర్లీ), జెకె రౌలింగ్ (హ్యారీ పాటర్) వంటి ప్రపంచ ప్రఖ్యాత రచయితలు, కవులు, నాటక రచయితలకు జన్మస్థలం ఎడిన్‌బర్గ్. కాగా, ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం 53 యునెస్కో సాహిత్య నగరాలు ఉన్నాయి. సాహిత్యం పట్ల అంకితభావం, స్థానికంగానేగాక, జాతీయ, అంతర్జాతీయంగా సాహిత్య కార్యకలాపాలను ప్రోత్సహించడంలో నిబద్ధతకు గుర్తింపుగా యునెస్కో సాహిత్య నగరాలను ఎంపిక చేస్తుంది. యునెస్కో యొక్క సిటీ ఆఫ్ లిటరేచర్ ప్రోగ్రామ్‌లో ఇది ఒక భాగం. యునెస్కో సాహిత్య రంగంలోనేగాక, హస్తకళలు, జానపద కళలు, డిజైన్లు, సినిమాలు, గ్యాస్ట్రోనమీ, సంగీతం వంటి వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన నగరాలకు కూడా గుర్తింపునిస్తున్నది. యునెస్కో సృజనాత్మక నగరాల నెట్‌వర్క్‌లో



'సిటీ ఆఫ్ లిటరేచర్'కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ గుర్తింపు కోసం నగరాలు దరఖాస్తు చేసుకుంటాయి. సాహిత్యంలో విశిష్టమైన వారసత్వం, ప్రచురణలు, సాహిత్య కార్యక్రమాలు, పాఠశాలలు, గ్రంథాలయాలు, సాహిత్య ఉత్సవాలు వంటి అంశాలను ఆధారంగా తీసుకుని ఈ గుర్తింపు ఇస్తారు. యునెస్కో సాహిత్య నగరాలు సాహిత్యాన్ని, పఠనాన్ని, ప్రచురణలను, సాహిత్య ఉత్సవాలను ప్రోత్సహించడంలో ముందుంటాయి. ఈ గుర్తింపు నగరానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు, సాహిత్య, సాంస్కృతిక మార్పిడులకు వేదికను కల్పిస్తుంది.

## మలయాళ సాహితీ వైభవం

మలయాళం భాష ద్రావిడ భాషా కుటుంబానికి చెందినది. ఇది తమిళ భాష నుంచి విడిపోయిన ఒక ప్రత్యేక భాషగా 9వ శతాబ్దం నుంచి చరిత్రలో గుర్తింపు పొందిందని అంటారు. కేరళ రాష్ట్రంతోపాటు లక్షద్వీప్, మహారాష్ట్ర కొంకణ్ వంటి ప్రాంతాల్లోనూ మలయాళం మాట్లాడతారు. ఈ భాష సాహిత్యం ప్రాథమిక దశ (9వ – 13వ శతాబ్దం) దశలో మతపరమైన, తాత్వికమైన రచనలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మధ్యయుగ సాహిత్యం (14వ – 18వ శతాబ్దం)లో కావ్యాలు, పురాణ కథలు, వ్యంగ్య రచనలు, నాటకాల రూపంలో సాహిత్యం అభివృద్ధి చెందింది. ఆధునిక పూర్వదశ (19వ శతాబ్దం)లో దశలో మిషనరీ ప్రభావం, ప్రింటింగ్ ప్రెస్ ప్రాబల్యం, సామాజిక సంస్కరణల ప్రభావం పెరిగింది. నూతన కవి త్వ ధోరణులు, కథన పద్ధతులు పుట్టుకొచ్చాయి. ఆధునిక దశ (20వ శతాబ్దం)లో మలయాళ సాహిత్యం విప్లవాత్మక మార్పులను చవిచూసింది. నవలలు, నాటకాలు, కథలు, కవితలు సామాజిక బాధ్యతతో కూడిన కొత్త రూపాల్లో ప్రత్యక్షమయ్యాయి. వైకోమ్ హాస్యంతో కూడిన సామాజిక విప్లవాత్మక కథలతో ప్రసిద్ధి చెందగా, తకళి శివశంకర్ పిళ్లై సామూహిక వర్గ సమస్యలపై రచనలు చేశాడు. ఒఎన్‌వి కురుప్ ప్రజాస్వామ్యం, ప్రేమ, ప్రజల జీవితాలపై ఆధారిత కవిత్వాన్ని





అందించాడు. జ్ఞానపీఠ అవార్డుగ్రహీత సుగతా కుమారి స్త్రీవాదం, ప్రకృతి ప్రేమతో కూడిన కవిత్వంతో పేరు ప్రఖ్యాతులు ఆర్జించింది. కాగా, ఆధునిక కాలం లేదా 21వ శతాబ్ద మలయాళ సాహిత్యం ఆధునిక జీవితానుభూతుల్ని ప్రతిబింబించే విధంగా మారింది. మహిళా రచయితలు, దళిత రచయితలు, నిర్లక్ష్యానికి గురై న వర్గాల గొంతుకలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. జానపద సాహిత్యం, బహుళ సాంస్కృతిక కథనాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. అనేక యూరోపియన్ రచనల అనువాదాలు మలయాళంలో వచ్చాయి. అదేవిధంగా మలయాళం రచనలు అనేకం ఇతర భాషల్లోకి అనువాదమవుతున్నాయి. మలయాళ సాహిత్యానికి విలువైన రచనలు అందించిన ఒఎన్‌వి కురుప ఎంటి వాసుదేవన్ నాయర్, తకళి శివశంకర్ పిళ్లై ప్రతిష్టాత్మగ జ్ఞాన్‌పీఠ్ అవార్డు అందుకున్నారు.

## ముక్కుసూటి మనిషి 'కొంపెల్ల'



ప్రముఖ భావకవి, నాటక రచయిత కొంపెల్ల జనార్ధనరావు ముక్కుసూటి మనిషి. అందుకే, చాలా మంది సమకాలీన సాహితీవేత్తలకు విరోధి. అయితేనేం... మహాకవి శ్రీశ్రీ తన 'మహాప్రస్థానం' కవితా సంపుటాన్ని అంకితం ఇచ్చేలా అతనిని ప్రభావితం చేశాడు. లక్షలాది మందికి శ్రీశ్రీ స్ఫూర్తిదాయకుడైతే, ఆ కవితాశిఖరానికి మార్గదర్శకుడు కొంపెల్ల. కేవలం 32 ఏళ్ల వయసులోనే ఏదో ముఖ్యమైన పని ఉన్నట్టు, 1937, జూన్ 23న ఈలోకాన్ని విడిచివెళ్లాడు. తెలుగు సాహిత్యం బతికి ఉన్నంతకాలం, నిరంతరం తలచుకునే శ్రీశ్రీని గొప్ప కవిగా మనకు అందించాడు. 1906 ఏప్రిల్ 15న జన్మించిన కొంపెల్ల 20 ఏళ్ల యవసులోనే, అప్పట్లో తెలుగు సాహిత్యానికి బాసటగా నిలిచిన 'భారతి' పత్రికలో ఉపసంపాదకుడిగా చేరాడు. అక్కడే శ్రీశ్రీతో పరిచయం... సాహచర్యం. కవి వైనందుకు కాళ్లకు డెక్కలు... నెత్తికి కొమ్ములు అక్కరలేదని నిష్కర్షగా చెప్పాడు. నికార్సయిన కవిత్వాన్ని అందించాలని సూచించాడు. తన కవితలను ప్రచురణకు తీసుకోవాలంటూ 'భారతి' కార్యాలయం చుట్టూ తిరిగే శ్రీశ్రీకి దొరికిన అపూర్వ భాండాగారం కొంపెల్ల. శ్రీశ్రీ కవిత 'ప్రభవ'పై పదునైన విమర్శలు చేశాడు. సుదీర్ఘ సమాసాలు ఉన్నాయని, సంస్కృత వాడకం చాలా ఎక్కువగా ఉందని తూర్పారపట్టాడు. ప్రజలకు అర్థమై, వారితో మమేకమయ్యేదే నిజమైన కవిత్వమని తేల్చిచెప్పాడు. 'భారతి'లో భావసాహిత్యానికి పెద్దపీట వేయడం, కొత్తకొత్త కవితా రీతుల్ని ఆదరించకపోవడం వంటి విధానాలు కొంపెల్లకు నచ్చలేదు. అందులో నుంచి బయటకు వచ్చి 'ఉదయిని' అనే ద్వైమాసిక పత్రికను వెలువరించడం ప్రారంభించాడు. 'తాన్‌సేన్', 'తెలుగు' తదితర నాటికలు రచించారు. 'మహాప్రస్థానం' కవితా సంపుటికి తొలి అడుగుగా 'జయభేరి' గీతాన్ని పేర్కొంటారు. దానిని తొలుత అచ్చువేసిన ఘనత కొంపెల్లదే. 'ఉదయిని'లో వచ్చిన ఈ కవితలో..

**'నేను సైతం ప్రపంచాగ్నికి**
**సమిధనొక్కటి ఆహుతిచ్చాను**
**నేను సైతం విశ్వసృష్టికి**
**అశ్రువొక్కటి ధారపోశాను**
**నేను సైతం భువన ఘోషకు**
**వెర్రిగొంతుకనిచ్చి మోశాను'**

అంటూ తెలుగు సాహిత్యాన్ని శ్రీశ్రీ కొత్తపుంతలు తొక్కించాడు. శ్రీశ్రీని నిలబెట్టిన కొంపెల్ల, తాను మాత్రం 'ఉదయిని'ని రక్షించుకోలేకపోయాడు. సాహిత్యానికి ప్రజాభిమానం సంపాదించాలన్న గొప్ప ఆశయంతో అహర్నిశలు పనిచేసి పత్రికను కొనమని వాడవాడలా బిచ్చమెత్తాడు. రచనలు పంపమంటూ ప్రాధేయపడ్డాడు. క్షయ వ్యాధితో ఆరోగ్యం దెబ్బతిన్నది. దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తూ కొంపెల్ల కన్నుమూశాడు. శ్రీశ్రీకి, కొంపెల్లకు ఏ రకమైన భావసారూప్యత లేకున్నా వారి మధ్య స్నేహం మాత్రం చాలా చక్కగా కలిసిపోవడం విశేషం. పైగా మహాప్రస్థాన కావ్యానికి ఏ మాత్రం సంబంధం లేని భావాలు కలిగిన కొంపెల్ల మరణం, అందులోనూ సాహిత్య పత్రికలు వర్థిల్లాలన్న మహదాశయంతో తనువుచాలించడం వంటివి శ్రీశ్రీని కదిలించాయి. ఆ విషయాలనే మహాప్రస్థానం కవితా సంపుటిని 'అంకితం' ఇస్తూ రాసిన కవితలో శ్రీశ్రీ ప్రస్తావించడమేకాదు... నాడు కొంపెల్లను నిరాదరించిన వారి పై తీవ్రస్థాయిలో విమర్శలు కురిపించాడు.

**'తలవంచుకు వెళ్లిపోయావా**
**నేస్తం!**
**సెలవంటూ ఈ లోకాన్ని వదిలి...**
**తలపోసిన వేవీ కొనసాగకపోగా,**
**పరివేదన బరువు బరువు కాగా,**
**అటు చూస్తే, ఇటు చూస్తే ఎవరూ**
**చిరునవ్వూ, చేయూతా ఇవ్వక–**
**మురికితనం కరకుతనం నీ**
**సుకుమారపు హృదయానికి**
**గాయం చేస్తే–**
**అటుపోతే, ఇటుపోతే అంతా**
**అనాదరణతో, అలక్ష్యంతో చూసి**
**ఒక్కణ్ణి చేసి వేధించారని, బాధించారని,**
**వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్లిపోయావా,**
**నేస్తం!'** అంటూ బాధపడ్డాడు.

**'దొంగలంజకొడుకు లసలే మెసలే**
**ఈ ధూర్తలోకంలో నిలబడజాలక**
**తలవంచుకునే వెళ్లిపోయావా,**
**నేస్తం!'** అంటూ కొంపెల్ల ఎదుర్కొన్న మానసిక క్షోభకు కారణమైన వారిపై నిప్పులు కురిపించాడు.

**'నీ సాహసం ఒక ఉదాహరణ!**
**నీ జీవితమే ఒరవడి!**
**నిన్న వదిలిన పోరాటం**
**నేడు అందుకొనక తప్పదు!**
**కావున ఈ నిరాశామయలోకంలో**
**కదనశంఖం పూరిస్తున్నాను!**
**ఇక్కడ నిలబడి నిన్ను**
**ఇవాళ ఆవాహనం చేస్తున్నాను!**
**అందుకో ఈ చాచిన హస్తం!**
**ఆవేశించు నాలో!**
**ఇలా చూడు నీ కోసం**
**ఇదే నా మహాప్రస్థానం!'** అంటూ కొంపెల్ల స్ఫూర్తిగా దృఢదీక్షబూనాడు. తెలుగు సాహిత్యంలో 'ఈ శతాబ్దం నాది... ఇది శ్రీశ్రీ శతాబ్దం' అని గర్వంగా చెప్పుకోగల స్థాయికి ఎదిగాడు. కొంపెల్లపై రాసిన పంక్తులు చాలు.. శ్రీశ్రీని కొంపెల్ల ఎంతగా ప్రభావితం చేశాడో చెప్పడానికి. కొంపెల్లను పరిచయం చేయడానికి శ్రీశ్రీని మించిన అర్హత ఇంకెవరికి ఉంటుంది?

## ప్రగతిశీల సాహితీ మకుటం 'మహాస్వప్న'

**(జూన్ 25న వర్ధంతి)**



దిగంబర కవుల్లో ఒకడు... ప్రగతిశీల సాహిత్యంలో మునిగితేలిన అక్షర ఉద్యమకారుడు 'మహాస్వప్న' భౌతికంగా మనల్ని విడిచి ఈనెల 25వ తేదీనాటికి ఆరేళ్లు పూర్తవుతాయి. కమ్మిశెట్టి వెంకటేశ్వరరావు అంటే చాలామందికి తెలియకపోవచ్చుగానీ, 'మహాస్వప్న' అంటే అభ్యుదయ భావాలున్న సాహిత్య ప్రేమికులు ఇట్టే గుర్తుపడతారు. కమ్మిశెట్టి వెంకయ్య, నారాయణమ్మ కుమారుడైన మహాస్వప్న ఆజీవన బ్రహ్మచారి. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పాఠశాల, ఇంటర్మీడియట్ చదువు పూర్తి చేసుకొని, ఉన్నత విద్యకోసం హైదరాబాద్ చేరుకున్న ఆయనకు, వివేకవర్ధని కాలేజీలో బిఎ చదువుతున్నప్పుడే అభ్యుదయ సాహిత్యంతో పరిచయం ఏర్పడింది. కేవలం 18 సంవత్సరాల వయసులోనే 'చందమామ' పేరుతో బాల కవితా సంపుటిని వెలువరించాడు. నిఖిలేశ్వర్ (యాదవ రెడ్డి), చెరబండరాజు (బద్దం భాస్కరరెడ్డి), నగ్నముని (మానేపల్లి హృషీకేశవరావు), జ్వాలాముఖి (వీరరాఘవాచార్యులు), భైరవయ్య (మన్మోహన్ సహాయ్)తో కలిసి దిగంబర కవితోద్యమాన్ని ప్రారంభించి, చురుకైన పాత్ర పోషించాడు. ఈ ఉద్యమం మూడు సంవత్సరాల్లోనే ముగిసినప్పటికీ, 'మహాస్వప్న' కవితా ఝరి కొనసాగింది. భైరవయ్యతో కలిసి అభ్యుదయరచయితల సంఘం (అరసం)లో చేరిన ఆయన, 2019 జూన్ 25న తుదిశ్వాస విడిచే వరకూ ప్రగతిశీల సాహిత్యానికి కట్టుబడే ఉన్నాడు. సూటిగా, ఘాటుగా, పాఠకులను లోతుగా ఆలోచింపచేసేవిగా ఉండే ఆయన రచనలు ఎంతో మందిలో సామాజిక స్పృహను సృష్టించింది. వివిధ పత్రికల్లో, సంపుటాల్లో వచ్చిన ఆయన కవిత్వం సాహిత్యలోకాన్నే కాక సమాజంలోని వివిధ వర్గాలను ఉలిక్కిపడేలా చేసింది. ప్రగతిశీల సాహిత్యం ఉన్నంత వరకూ 'మహాస్వప్న'కు మరణం లేదు. ఆయన ఆశయాలకు తెరపడదు.

## వందేమాతరం సృష్టికర్త

ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర ఛటర్జీ అగ్రగణ్యుడు. ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాకుండా.. భారతీయ సాహిత్యాలను ఆయన ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేశారు. ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం ప్రజలను ఉత్తేజపరిచి, ఉద్యమింపచేసిన సంఘటన భారతదేశ స్వతత్ర్యోద్యమంలో తప్ప మరో చోట ఎక్కడా సంభవించలేదు. భారతదేశ స్వతంత్ర ఉద్యమం చైతన్యవంతమవుతున్నప్పుడు వందేమాతరం గీతం వేగాన్ని మరింత పెంచింది. ఈ గీతం ఆయన రచించిన ఆనంద్ మఠ్ అనే నవల నుండి గ్రహించబడింది. ఆయన సృష్టించిన పాత్రలు కాల్పనిక సాహిత్యానికి చెందినవే అయినా.. సృజనాత్మక సంవేదనలలో ఆయనకాయనే సాటి అని ఆ సాహిత్య విమర్శకుల అభిప్రాయం. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యానరచనలో బంకిం చంద్రఛటర్జీ సాహిత్యంలో కొత్త ఒరవడి సృష్టించారు. బంకించంద్ర చటోపాధ్యాయ జూన్ 26, 1838న నైహతిలోని కంఠల్‌పురా గ్రామంలో జాదబ్ చంద్ర చటోపాధ్యాయ మరియు దుర్గాదేవి దంపతులకు ముగ్గురు సోదరులలో చిన్నవానిగా జన్మించారు. బంకించంద్రచటర్జీ రచించిన వందేమాతర గీతం స్వాతంత్ర్య పోరాటంలో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చింది. వందేమాతర ఉద్యమం బెంగాల్‌కు పరిమితం కాకుండా దేశవ్యాప్తమైంది. మొదట్లో ఈ ఉద్యమం సురేంద్రనాథ్ బెనర్జీ వంటి మితవాదుల నేతృత్వంలో జరిగినా క్రమంగా అతివాద, తీవ్రవాద నాయకత్వానికి మరలింది. ఈ ఉద్యమాన్ని బెంగాల్ నుంచి దేశవాప్తంగా ప్రచారం చేయడంలో బిపిన్ చంద్రపాల్ ప్రముఖ పాత్ర పోషించారు. మద్రాస్, ఆంధ్ర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ ఉద్యమకాలంలోనే ట్యుటికోరిన్‌లో స్వదేశీ స్టీమ్ నేవిగేషన్ కంపెనీని స్థాపించారు. అక్కడ ఈ ఉద్యమాన్ని సుబ్రమణ్యఅయ్యర్, చిదంబర పిళ్లై విస్తృతం చేశారు. ఆంధ్ర ప్రాంతంలో కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు నేతృత్వం వహించారు. పంజాబ్‌లో భగత్‌సింగ్ మేనమామ అజిత్ సింగ్ అంజుమాన్ మొహబత్ వాటన్ అనే సంస్థను, భారతమాత అనే పత్రికను నడిపి ఉద్యమాన్ని విస్తరించారు. బంకిమ్ 'భారతదేశంలో ఆధునిక నవల పితామహుడు'గా పరిగణించబడ్డారు. అతను బెంగాలీలో చారిత్రక మరియు సామాజిక నవలలు వ్రాసిన మొదటి వ్యక్తి కాదు, కానీ అతను నవలని భారతదేశంలో ఒక ప్రధాన సాహిత్య శైలిగా స్థాపించారు. ఆయన 1894 ఏప్రిల్ 8న తుదిశ్వాస విడిచారు.

**(జూన్ 26–బంకిమ్ చంద్ర చటర్జీ జయంతి)**

**– యం.రాంప్రదీప్**

## ఆధిపత్య ధోరణిపై మార్లే సమర శంఖారావం

మార్లే డయాస్... అమెరికన్ సాహిత్యంలో కనబడుతున్న తెల్లజాతి ఆధిపత్య ధోరణిపై సమర శంఖారావాన్ని పూరించి, ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. '1000 బ్లాక్ గర్ల్ బుక్స్' ఉద్యమంతో సామాజిక న్యాయం కోసం నినదించింది. కేవలం 2015లో, 11 సంవత్సరాల వయసులోనే ఒక సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టి, సమర్థంగా నిర్వహించడం మార్లే వంటి అరుదైన వ్యక్తులకే సాధ్యమవుతుంది. తాను చదువుతున్న ప్రతి పుస్తకంలోనూ శ్వేతజాతీయులే కథానాయకులు, నాయికలుగా ఉండడాన్ని గమనించింది. నల్ల జాతీయులు, ప్రత్యేకించి మహిళలు అందుకున్న లక్ష్యాలు, సాధించిన విజయాలను ఎక్కడా ప్రస్తావించకపోవడాన్ని ప్రశ్నించింది. నల్ల జాతీయులు ప్రధాన పాత్రల్లో ఉండే కథలు లేదా వాస్తవ జీవితాలతో కూడిన పుస్తకాలను సేకరించి, వాటిని పంచడం ద్వారా మార్పును తీసుకురావాలని నిర్ణయించింది. ఈ క్రమంలో బుక్‌డ్రైవ్‌ను ప్రారంభించి, 11,000 కంటే ఎక్కువ పుస్తకాలు సేకరించింది. నల్ల జాతీయులకు కూడా గుర్తింపునివ్వాలన్న తన ఉద్యమాన్ని విస్తరించింది. 'మార్లే డయాస్ గెట్స్ ఇట్ డన్: అండ్ సో కెన్ యు' (మార్లే డయాస్ సాధించింది... మీరు కూడా సాధించగలుగుతారు) అనే పేరుతో పుస్తకాన్ని రచించింది. క్రియాశీలత ద్వారా





మాత్రమే సానుకూల మార్పు సాధ్యమని నమ్మిన ఆమె, ఆ బాటలోనే నడుస్తున్నది. ఫిలడెల్ఫియాలో జన్మించి, న్యూజెర్సీలోని వెస్ట్ ఆరెంజ్‌లో పెరిగిన మార్లే, ప్రస్తుతం హార్వర్డ్ యూనివర్సిటీలో చదుతున్నది. 'నేను కోరుకున్నది చదవడానికి నాకు నిజంగా స్వేచ్ఛ లేదు' అని ఎలుగెత్తి చాటుతూ, అమెరికన్ సాహిత్యంలో మార్పును కోరుకుంటున్న ఆమె, తన ప్రయత్నంలో ఎన్నో మైలురాళ్లు అధిగమించింది. నల్లజాతి బాలికలు, మహిళలు ప్రధాన పాత్రలు పోషించే రచనలకు ప్రచారం తీసుకురావడం ద్వారా, కొత్త ఒరవడిని ప్రవేశపెట్టింది. పిల్లల సాహిత్యంలో వైవిధ్యం లేకపోవడాన్ని నిలదీయడంతో, ఇప్పుడు అమెరికన్ రచనల్లో ఈ కోణం ప్రముఖంగా కనిపిస్తున్నది. 'నల్లజాతి సాహిత్యం'తోపాటు నల్లజాతి బాలికలకు పెద్దపీట వేసే సాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్న మార్లే ఆన్‌లైన్ మ్యాగజైన్ 'జైన్, మార్లే మాగ్' ఎడిటర్ హోదాలో, Elle.com కోసం మిస్టీ కోప్లాండ, అవాడువెర్నే, హిల్లరీ క్లింటన్ వంటి ప్రముఖులను ఇంటర్వ్యూ చేసింది. వారి సందేశాలు కూడా అమెరికా సాహిత్య రంగంలో నూతన విధానాలకు మార్గం సుగమనం చేస్తున్నాయి. మొత్తం మీద మార్లే ఉద్యమం ఇప్పుడు అమెరికన్ సాహిత్యాన్ని సరికొత్త మార్గంలో నడిపిస్తున్నది.

## ఈ వారం కవితలు

### వానలు పడాలే

దండిగా వానలు పడాలే
ధరణి మురవాలే
వానలు పడాలే
వాగు వంకలు నిండాలే!!

పచ్చని పైరు పంటలు పండాలే
చెరువులు నిండాలే
చేపలు దండిగా ఉండాలే
బావులు నిండాలే
బాగా పంటలు పండాలే!!

కర్షకుని కష్టాలు తీరాలే
కర్షకుడు కడుపు నిండా తినాలే
ధరణిలో దండిగా పంటలు పండాలే
అవనిలో అందరూ మురవాలే!!

పల్లెలు పచ్చగా ఉండాలే
పశువుల గాసం దొరకాలే
బాగా వానలు పడాలే
బంగారు పంటలు పండాలి
వానతో వ్యవసాయం ముందుకు సాగాలి
ధరణిలో జనమంతా సంతోషంగాఉండాలే !!

**– దేవులపల్లి రమేశ్**

### మాటల తోట



ఈ ప్రపంచం మాటల తోట
మనిషి చుట్టూ అందమైన కోట
అన్య జీవికి లేని వరముల మూట
మాటలతో సాగు బ్రతుకు వేట!

నోటి కొలనులో ఊరిన ఊటలు
పెదాల వెంట రాలే మాటల ముత్యాలు
పెదవి దాటి జగమంతా వ్యాపించి
మనిషి ఔన్నత్యం పెంచే నిత్యాలు!

మనంబున నాటిన మాటల విత్తనములు
శాఖోపశాఖల అక్షర పదములై
మనసులను రంజింపజేయు గానాలై
వెదజల్లు నానా చతురత పరిమళాలు!

మాటిచ్చి జవదాటని వారు జగతినెందరో
అభయమిచ్చి ఆదుకున్న వారెందరో
రాజ్యాలను తృణప్రాయంగా త్యజించిరెందరో
అవనిపై ఆడి తప్పని హరిశ్చంద్రులెందరో!

మాట పుట్టి పెరిగిన నాటి నుండి
మాట్లాడిన రాసిన మాటల రాశుల
మెట్లుగా కూర్చి పేర్చిన
నక్షత్ర లోకమునకు కొత్త బాటలగు!

రూపం లేని మాటలకు
యుతి ప్రాసలయల లేపనం రాసి
శ్రవణానందకరం చేసిన
ఎదురుగా నిలిచే బొమ్మ కట్టు!

**– పట్లొళ్ళ బక్కారెడ్డి**

### రావమ్మా వేగిరం

అరుదెంచ నుంది ఆషాడమాసం
మోసుకొస్తుంది అమ్మకు బోనం
కానున్నది లష్కర్ కోలాహలం
కొలువవుతుంది జనంతో అవనీ తలం
ప్రకృతిలో ఏదో నూతనోత్తేజం
వికృతిలోన అగుపించే భయకంపితం
దురాలోచనలకిక భూస్తాపితం
అందునకై సాక్షమే అమ్మ వీక్షణం
పసిడి రంగులతో విలసిల్లు మందిరం
మాత గంభీరవదనారవిందం....

లోక కల్యాణానికే ఆదేవి సమరం
క్షుద్ర శక్తుల అంతమే ఆశయం

శోభాయమానమై వెలుగు భాగ్యనగరం
కలల వారధి హుస్సేన్ సాగరం
జన హృదయాలు ఉత్తుంగ తరంగితం
ప్రతి వత్సరం అంబరమంత సంబరం
అమ్మ మనసార మీకు మా వందనం
కొమ్మ చేకొను కైమోడ్పుల నందనం
కొనుమా కడుపార మాప్రియ చందనం
భవిత బాగుకై రావమ్మా వేగిరం

**– నమిలకొండ నాగేశ్వర్ రావు**

# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రైలు ప్రయాణికుల భద్రతపై దృష్టి పెట్టండి
### ఆర్‌పిఎఫ్ డిజి మనోజ్‌యాదవ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రైల్వేలపై నేర నియంత్రణ, ప్రయాణికుల భద్రతపై దృష్టి సారించాలని ఆర్‌పిఎఫ్ డిజి మనోజ్‌యాదవ్ అన్నారు. న్యూఢిల్లీలో ఆదివారం 6వ అఖిల భారత ప్రభుత్వ రైల్వే పోలీసు అధిపతుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన మనోజ్‌యాదవ్ మాట్లాడుతూ..ప్రతిరోజూ ప్రయాణించే లక్షలాది మంది రైల్వే ప్రయాణికుల భద్రత, భద్రతను నిర్ధారించడానికి సమిష్టి యంత్రాంగాలను బలోపేతం చేయడానికి ఈ ముఖ్యమైన సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. విస్తారమైన రైల్వే నెట్‌వర్క్‌ను దోపిడీ చేస్తున్న నేరస్థులపై నిఘా పెంచడంతో పాటు ఉమ్మడి కార్యాచరణ వ్యూహాలను రూపొందించుకోవాలన్నారు.ప్రయాణీకుల ఆస్తి దొంగతనం ఫిర్యాదులను అధికారిక ఎఫ్ఐఆర్‌లుగా మార్చడం ద్వారా నేరాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఈ సమావేశం తీర్మానించింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో వివిధ రాష్ట్రాలు , కేంద్రపాలిత ప్రాంతాల జిఆర్‌పి నుండి డిజిపిలు, ఎడిజిపిలు, సీనియర్ అధికారులు, రైల్వే మంత్రిత్వ శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పహల్గామ్ ఉగ్రవాదులకు ఆశ్రయమిచ్చిన ఇద్దరి అరెస్టు

**శ్రీనగర్ :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఇటీవల పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడితో దేశం మొత్తం దిగ్భ్రాంతికి గురైన సంగతి తెలిసిందే. ఈ దాడులకు తెగబడిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరు వ్యక్తులను జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అరెస్టు చేసింది. ఈ మేరకు ఎన్ఐఎ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఎన్ఐఎ తెలిపిన వివరాల ప్రకారం.. పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడికి కారణమైన ముగ్గురు ముష్కరులకు ఆశ్రయం కల్పించిన పర్వేజ్, బషీర్‌ను అరెస్టు చేశాం. వారిని ప్రశ్నించగా.. ఉగ్రవాదుల పేర్లను బయటపెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి పాల్పడిన వారు పాక్ దేశీయులు. దాడి చేసినవారికి లష్కరే తొయ్యిబాతో సంబంధాలు ఉన్నాయని వెల్లడించారు. దాడికి ముందు ఉగ్రవాదులని తెలిసే ఆశ్రయం కల్పించారు. వారికి ఆహారం, ఆశ్రయంతో పాటు రవాణా సదుపాయం కూడా కల్పించారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతుంది అని ఎన్ఐఎ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని ప్రముఖ ప్రాంతమైన బైసరన్ లోయలో పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతీకారంగా ఉగ్రవాదుల పీచమణిచేందుకు భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రమయ్యాయి. భారత్ దాడులకు వణికిపోయిన పాక్.. చివరకు కాళ్లబేరానికి వచ్చింది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేయాలనే లక్ష్యం నెరవేరడంతో కాల్పుల విరమణకు భారత సైతం అంగీకరించింది.

## ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు..
### రియాద్‌కు దారి మళ్లింపు

**న్యూఢిల్లీ :** బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు కాల్ వచ్చింది. దాంతో విమానాన్ని రియాద్‌కు దారి మళ్లించారు. రియాద్ విమానాశ్రయంలో దిగిన అనంతరం ప్రయాణికులను సేఫ్‌గా బయటికి తీసుకెళ్లారు. ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది తనిఖీ చేసి బాంబు లేదని తేల్చడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఎఐ 114 నెంబర్ గల ఎయిరిండియా విమానం శనివారం రాత్రి 8.26 గంటలకు బర్మింగ్‌హామ్ నుంచి ఢిల్లీకి బయలుదేరింది. ఆ తర్వాత విమానంలో బాంబు పెట్టినట్లు కాల్ రావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ విమానాన్ని అత్యవసరంగా రియాద్‌కు దారి మళ్లించారు. రియాద్ విమానాశ్రయంలో విమానం ల్యాండ్ కాగానే ప్రయాణికులను సురక్షితంగా బయటికి తీసుకెళ్లారు. విమానంలో బాంబు కోసం భద్రతా సిబ్బంది తనిఖీ చేశారు. కానీ అందులో ఎలాంటి బాంబు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రయాణికులకు రియాద్‌లోని ఓ హోటల్‌లో వసతి ఏర్పాటు చేశారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం విమానం రియాద్‌లోని కింగ్ ఖాలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉంది.

## ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణ
### యోచనలో ఎన్నికల సంఘం

**న్యూఢిల్లీ :** ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఇంటింటికి వెళ్లి తనిఖీ చేయాలని ఎన్నికల సంఘం ఆలోచిస్తోంది. ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడం లేదా తొలగించడంపై వివిధ పౌర సంఘాలు, రాజకీయ పార్టీలు, ఇతరులు నిరంతరం ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారని అధికారులు పేర్కొన్నారు. బిజెపికి సహాయం చేయడానికి పోల్ అథారిటీ డేటాను మోసగించిందని కాంగ్రెస్‌తో సహా అనేక పార్టీలు ఆరోపించాయి. పూర్తి పారదర్శకతతో, రాజకీయ పార్టీల నిరంతర పరిశీలనలో ఉండాల్సిన ఇసి ఏకపక్షంగా ఓటర్ల జాబితాను పెంచిందని తరచుగా ఆరోపణలు వస్తున్నాయని అధికారులు విచారం వ్యక్తం చేశారు. వ్యవస్థను పటిష్టంగా, ఎలాంటి లోపాలు లేకుండా చేయడానికి, బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఇంటింటికి వెళ్లి తనిఖీ చేయాలని పోల్ ప్యానెల్ ఆలోచిస్తోందని వర్గాలు తెలిపాయి. గతంలో కూడా ఇంత తీవ్రంగా, కఠినంగా ఓటర్ల జాబితా సవరణ జరిగిందని, చివరిసారిగా 2004లో ఇలాంటి ప్రక్రియ జరిగిందని వారు ఎత్తి చూపారు. సాధారణ ఎన్నికలు లేదా ఉప ఎన్నికలు నిర్వహించే ముందు దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితా సవరణను ప్రతి సంవత్సరం ఇసి చేపడుతుంది. ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హత, అనర్హతకు సంబంధించిన నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950లోని సెక్షన్ 16లో స్పష్టంగా పేర్కొనబడ్డాయి. కొత్త ఓటర్ల మరణాలు, చేరిక కారణంగా ఓటర్ల జాబితాను క్రమం తప్పకుండా సవరిస్తారు.

## ఇద్దరిని కాల్చి చంపిన నక్సల్స్



**బిజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఇద్దరు గ్రామస్తులను నక్సలైట్లు హత్య చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. పమేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెంద్రాబోర్, ఏమ్పూర్ గ్రామాల్లో ఇద్దరు అమాయక గ్రామస్తులను నక్సలైట్లు దారుణంగా హత్య చేసినట్లు తమకు సమాచారం అందిందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. హత్యలకు గల కారణం, నేరం ఎప్పుడు జరిగిందో పేర్కొనకుండా పోలీసులు సమాచారాన్ని ధృవీకరిస్తూ ప్రకటనను విడుదల చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఛత్తీస్‌గఢ్ పర్యటనకు ముందు ఈ ఘటన జరిగింది. షా రెండు రోజుల పర్యటన కోసం ఆదివారం మధ్యాహ్నం రాయ్‌పూర్ విచ్చేశారు. ఈనెల 17న, బీజాపూర్ జిల్లాలోని పెద్దకోర్మ బీజాపూర్ గ్రామంలో 13 ఏళ్ల బాలుడితో సహా ముగ్గురు గ్రామస్తులను నక్సలైట్లు తాడుతో గొంతు కోసి చంపారు. మరణించిన ముగ్గురిలో ఇద్దరు సీనియర్ మావోయిస్టు కేడర్ దినేష్ మోడియం బంధువులు ఈ ఏడాది మార్చిలో పోలీసుల ముందు లొంగిపోయారని ఒక అధికారి గతంలో తెలిపారు.

### స్కూల్ వంటమనిషిగా మావోయిస్టు

ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లాలో ఈ నెల ప్రారంభంలో జరిగిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో మరణించిన ఏడుగురు నక్సలైట్లలో ఒకరు ప్ర భుత్వ పాఠశాలలో వంటవాడిగా పనిచేస్తున్నారని పోలీసులు తెలిపారు. ఈ వ్యక్తిని ఫర్సేగఢ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇర్పగుట్ట గ్రా మానికి చెందిన మహేష్ కోడియంగా గుర్తించినట్లు వారు తెలిపారు. ఈనెల 4–7 తేదీల మధ్య బీజాపూర్‌లోని ఇంద్రావతి నేషనల్ పార్క్ ప్రాంతంలో జరిగిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా సిబ్బంది సంయుక్త బృందం ఎదురు కాల్పుల్లో ఏడుగురు నక్సలైట్లను హతమార్చింది. ఛత్తీస్‌గఢ్‌లో తన తలపై రూ. 40 లక్షల రివార్డు ఉన్న మావోయిస్టుల కేంద్ర కమిటీ సభ్యుడు నరసింహ చలం అలియాస్ సుధాకర్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణలో తన తలపై రూ. 45 లక్షల రివార్డును ఉన్న తెలంగాణ రాష్ట్ర మావోయిస్టుల కమిటీ ప్రత్యేక జోనల్ కమిటీ సభ్యుడు భాస్కర్ అలియాస్ మైలారపు అడెల్లు మరణించిన కేడర్లలో ఉన్నారు. మిగిలిన ఐదుగురు కార్యకర్తలలో ఒకరిని పోలీసులు మహేష్ కుడియంగా గుర్తించి, అతను మావోయిస్టుల జాతీయ ఉద్యానవన ప్రాంత కమిటీలో పార్టీ సభ్యుడిగా క్రియాశీలకంగా ఉన్నాడని, అతని తలపై రూ. లక్ష రివార్డు ఉందని చెప్పారు. అయితే కుడియం ఇర్పగుట్ట గ్రామంలోని ఒక ప్రాథమిక పాఠశాలలో వంట సహాయకుడిగా పనిచేస్తున్నాడని వెలుగులోకి వచ్చింది. అతన్ని గ్రామ పాఠశాల నిర్వహణ కమిటీ నియమించింది. ఈ పాత్రకు గానూ అతనికి మార్చి 2025 వరకు వేతనం చెల్లిస్తున్నట్లు వెలుగులోకి వచ్చిందని బీజాపూర్ పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. సుధాకర్, భాస్కర్ వంటి సీనియర్ మావోయిస్టు నాయకులతో కోడియం సంబంధాలు ఏర్పరచుకున్న పరిస్థితులపై ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని, కేసును అన్ని కోణాల్లో సమగ్రమైన, నిష్పాక్షికమైన, వృత్తిపరమైన విచారణ జరుగుతోందని పోలీసులు పేర్కొన్నారు. నిషేధిత సిపిఐ (మావోయిస్ట్) సంస్థతో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న వ్యక్తులు వెంటనే అటువం టి సంబంధాలన్నింటినీ తెంచుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఈ తీవ్రవాద సంస్థతో నిరంతర సంబం ధం ప్రజా భద్రత, ప్రాంతీయ శాంతికి మాత్రమే కాకుం డా, పాల్గొ న్న వారి జీవితాలకు, భవిష్యత్తుకు కూడా తీవ్రమైన ము ప్పు కలిగిస్తుందన్నారు. అయితే ఇర్పగుట్టకు చెందిన కొంత మంది గ్రామస్తులు ఒక మీడియా ప్రతినిధితో మా ట్లాడుతూ, కోడియంకు మావోయిస్టు సంస్థతో సం బంధం లేదని, మధ్యాహ్న భోజనం వండడానికి ఒక గ్రామంలోని పాఠశాలలో వంటవాడిగా పనిచేస్తున్నాడని, దానికి తన బ్యాంకు ఖాతాలో జీతం పొం దుతున్నాడని పేర్కొన్నారు. కోడియం కు టుంబంలో అతని భార్య, ఏడుగురు పిల్లలు ఉన్నారని గ్రామస్తులు తెలిపారు.

## మావోయిస్టులకు కంటిమీద కునుకులేకుండా చేస్తాం
### వర్షాకాలమైనా గాలింపు చర్యలు ఆగవు
### తేల్చి చెప్పిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**రాయ్‌పూర్ :** దేశంలో నక్సలైట్లను నిర్మూలించే కార్యక్రమం కొనసాగుతుందని, ఈ వర్షాకాలంలో గాలింపు చర్యలకు ఎలాంటి విరామం ఉండబోదని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రకటించారు. చర్చలకు ఎలాంటి అవకాశం లేదని, వారు లొంగిపోయి జనజీవన స్రవంతిలో చేరాలని కోరారు. వర్షాలు పడినాసరే నక్సలైట్లకోసం గాలింపు చర్యలు కొనసాగుతాయని, వారికి ఎలాంటి ఉపశమనం లభించబోదని చెప్పారు. జాతీయ వేలిముద్రల విజ్ఞానశాస్త్ర విశ్వవిద్యాలయ (ఎన్ఎఫ్ఎస్‌యు) క్యాంపస్ నిర్మాణానికి, కేంద్రీయ వేలిముద్రల విజ్ఞానశాస్త్ర ప్రయోగశాల భవంతుల నిర్మాణానికి ఆదివారంనాడు ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్ అతల్ నగర్‌లో పునాదిరాయి వేసి పూజలు చేసిన సందర్భంగా జరిగిన సభలో అమిత్ షా ప్రసంగించారు. గత ఏడాది జనవరి నెల నుండి ఇప్పటి వరకూ దేశంలో జరిగిన వేరు వేరు ఎదురుకాల్పుల్లో 400 మంది మావోయిస్టు తీవ్రవాదులను భద్రతా దళాలు కాల్చి చంపాయని ఆయన చెప్పారు. పేరుమోసిన మావోయిస్టు నాయకుడు, మావోయిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ్‌రావు అలియాస్ బసవ రాజు (70)ను మే 21వ తేదీన బస్తర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో కాల్చి చంపినట్లు చెప్పారు.

''ప్రతి ఏడాదీ వర్షాకాలంలో నదులు,వరదలు సృష్టించే ఆటంకాలవల్ల దట్టమైన అడవుల్లో గాలింపు చర్యలకు ఆటంకాలు కలుగుతాయి, అందువల్ల నక్సలైట్లు విశ్రాంతి తీసుకుంటారు, కానీ ఈసారి మాత్రం అలా కుదరదు, వారికి కంటిమీద కునుకు లేకుండా చేస్తాం, 2026 మార్చి 31వ తేదీ నాటికి దేశంలో పూర్తిగా నక్సలైట్లను నిర్మూలించాలనే లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు భద్రతా దళాలు ఎలాంటి విరామ తీసుకోకుండా గాలింపు చర్యలు కొనసాగిస్తాయి'' అని చెప్పారు. మావోయిస్టులు పోలీసులకు లొంగిపోవాలని, జనజీవన ప్రధాన స్రవంతిలో చేరిపోవాలని కోరారు. ''ఆయుధాలు వదిలిపెట్టేసిన మావోయిస్టుల కు నేను మనస్ఫూర్తిగా ఆహ్వానం పలుకుతు న్నా, దేశ జనజీవన స్రవంతిలోకి వచ్చి చేరం డి, చర్చలకు ఎలాంటి అవకాశం లేదు, లభిం చే ప్రయోజనాలను ఉపయోగించుకోండి, ఛత్తీస్‌గఢ్‌లో ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం వారికి చేసిన వాగ్దానాలన్నింటినీ నెరవేరుస్తాం, అంతకుమించినస్థాయిలో లొంగిపోయినవారికి సహాయం చేసేందుకు కృషి చేస్తాం'' అని భరోసా ఇచ్చారు.

దేశంలో కొత్తగా పోలీసు చట్టాల్లో మార్పులు తీసుకువచ్చామని, భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలు మూడు దేశంలో నేరస్తులను శిక్షించి అమాయకులను రక్షించడానికి తగినవిధంగా న్యాయ వ్యవస్థలో చాలా ఆధునికంగా మార్పులు తీసుకువచ్చామని, దీనివల్ల కేసుల పరిష్కారానికి చాలా శాస్త్రీయ పద్ధతులలో వేగం పుంజుకుంటుందని చెప్పారు. ''నేరప్రపంచంలో సాక్ష్యాల ఆధారంగా న్యాయం చేసేందుకు వీలుగా దేశం ఒక కొత్త శకంలోకి ప్రవేశించింది, పూర్తి స్థాయిలో మూడు క్రిమినల్ చట్టాలూ అమలులోకి వచ్చిన తర్వాత దేశంలో ఏ మూల ఎఫ్ఐఆర్ నమోదైనాగానీ, ఫిర్యాదు చేసిన వారికి, బాధితులకు మూడు సంవత్సరాలోపే న్యాయం చేసేందుకు వీలు కల్పించే భరోసా వస్తుంది'' అన్నారు. మూడుసంవత్సరాలకు మించి ఏ కేసూ ఇక కోర్టుల్లో పెండింగ్‌లో ఉండకుండా సత్వర న్యాయం లభిస్తుందని అమిత్ షా చెప్పారు.

నవరాయ్‌పూర్‌లో రూ.145 కోట్లతో వేలిముద్రల విశ్వవిద్యాలయాన్ని, ప్రయోగశాలను రూ.132 కోట్లతో నిర్మిస్తున్నట్లు ఆయన చెప్పారు. మూడు సంత్సరాల్లో ఇవన్నీఅందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎన్ఎఫ్ఎస్‌యులో గ్రాడ్యుయేషన్ పూర్తిచేస్తే ఉద్యోగ భరోసా ఉంటుందన్నారు. రాబోయే సంవత్సరాలలో 32000 ఫోరెన్సిక్ నిపుణుల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో భారతదేశం స్వావలంబన సాధిస్తుందన్నారు.

## నేడు నీలంబూర్ ఉప ఎన్నిక ఫలితాలు
### పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ



**మళప్పురం :** కేరళలోని నీలంబూర్ నియోజకవర్గానికి జరిగిన అసెంబ్లీ ఉప ఎన్నికల ఫలితాలు మరికొన్ని గంటల్లో వెలువడనున్నాయి. పరిస్థితులను రాష్ట్రంలోని అధికార ఎల్‌డిఎఫ్, ప్రతిపక్ష యుడిఎఫ్, ఎన్‌డిఎలు నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఈ ఫలితం 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయ మానసిక స్థితికి కీలక సూచికగా పరిగణించబడనున్నాయి. తీవ్రమైన చతుర్ముఖ పోరు జరిగిన నియోజకవర్గంలో ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపు సోమవారం జరగనుంది. కాంగ్రెస్–యుడిఎఫ్ నీలంబూర్ మునిసిపాలిటీ మాజీ చైర్మన్ ఆర్యదాన్ షౌకత్‌ను నిలబెట్టగా, సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ సీనియర్ నాయకుడు, రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యుడు ఎం. స్వరాజ్‌కు మద్దతు ఇచ్చింది. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ న్యాయవాది, రాజకీయ నాయకుడు మోహన్ జార్జ్‌ను నిలబెట్టింది. ఎల్‌డిఎఫ్ స్వతంత్ర అభ్యర్థిగా రెండుసార్లు ఈ నియోజకవర్గం నుండి గెలిచిన తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర కన్వీనర్ పి.వి. అన్వర్ ఆశ్చర్యకరమైన ఎంట్రీతో ప్రచారానికి మరింత ఊపు వచ్చింది. కాగా, వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ నీలంబూర్‌లో జరిగిన ఉప ఎన్నికలో 75.87 శాతం ఓటర్లు ఓటు వేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. మొత్తం 2,32,057 మంది ఓటర్లలో 1,74,667 మంది ఓటర్లు వివిధ బూత్‌లలో తమ ఓటు హక్కును వినియోగించుకోగా, 1402 మంది పోస్టల్ బ్యాలెట్ల ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొంది. అయితే ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అన్ని పార్టీలూ తామే విజయం సాధిస్తామన్న విశ్వాసంతో ఉన్నాయి. మైనారిటీ వర్గాల మద్దతు ఉన్నందున యుడిఎఫ్ నాయకుడు షౌకత్‌కు అనుకూలంగా కనీసం 15,000 ఓట్ల ఆధిక్యత ఉంటుందని యుడిఎఫ్ నాయకులు అంచనా వేస్తున్నారు. అయితే, మంత్రులు, ఎమ్మెల్యేల నేతృత్వం గ్రామస్థాయి ప్రచారం, ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రసంగించిన ర్యాలీలను సూచిస్తూ, స్వరాజ్ 10,000 ఓట్ల కంటే తక్కువ కాకుండా గెలుస్తారని ఎల్‌డిఎఫ్ వర్గాలు తెలిపాయి. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ నియోజకవర్గంలో అంతర్లీనంగా ఉన్న రాజకీయ అవకతవకలు తమకు అనుకూలంగా ఉంటాయన్న ధీమాను ప్రదర్శిస్తోంది. అయితే, సాంప్రదాయ పార్టీల వాదనలను అన్వర్ త్రోసిపుచ్చారు. నీలంబూర్ స్థానంలో 25,000 ఓట్ల ఆధిక్యతతో వరుసగా మూడోసారి విజయం వైపు వెళ్తున్నానని ఉద్ఘాటించారు. ఎల్‌డిఎఫ్ మద్దతుగల స్వతంత్ర ఎమ్మెల్యే పివి అన్వర్, అధికార సిపిఐ(ఎం) మధ్య విభేదాల కారణంగా ఈ ఉప ఎన్నిక అనివార్యమైంది. పినరయి విజయన్ ప్రభుత్వం తన రెండవ పదవీకాలం ముగిసే సమయానికి, నీలంబూర్‌లో ఉప ఎన్నిక పాలక సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌ల, కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ రెండింటికీ ప్రతిష్టాత్మకమైన యుద్ధంగా మారింది. ఇతర నియోజకవర్గాల మాదిరిగా కాకుండా, మానవజంతు ఘర్షణలు, సంక్షేమ పెన్షన్లు వంటి సామాన్యుల ఆందోళనల నుండి ఇజ్రాయెల్‌పాలస్తీనా వివాదం, జమాతే–ఇ–ఇస్లామీతో కాంగ్రెస్‌కు ఉన్న సంబంధం వంటి అంతర్జాతీయ అంశాల వరకు ఉప ఎన్నికల ప్రచారంలో తీవ్ర చర్చనీయాంశమైంది. నీలంబూర్‌లో అనేక ఎన్నికల ర్యాలీలకు హాజరైన ముఖ్యమంత్రి పినరయి విజయన్, పార్టీ అభ్యర్థి స్వరాజ్ తరపున ప్రచారం చేస్తూ, ఎన్నికల్లో గెలవడానికి కాంగ్రెస్ నాయకత్వం మతపరమైన కార్డులు ప్లే చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించింది. ముస్లింలు అధికంగా ఉన్న నియోజకవర్గంలో ఓట్లను సేకరించడానికి ఎల్‌డిఎఫ్ శిబిరమే ప్రయత్నించిందని ప్రతిఘటించింది. ముస్లింలు అధికంగా నివసించే మళప్పురం జిల్లాకు సంబంధించి విజయన్ గతంలో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను కూడా ప్రతిపక్షం లేవనెత్తింది. అయితే, ఉప ఎన్నిక సందర్భంగా సంక్షేమ పెన్షన్ బకాయిల పంపిణీకి సంబంధించి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ చేసిన 'లంచం' వ్యాఖ్యలను హైలైట్ చేయడం ద్వారా పాలక వర్గం ఈ కథనాన్ని తిప్పికొట్టడానికి ప్రయత్నించింది.

## భారత నావికాదళంలోకి...
## 'ఐఎన్ఎస్ తమల్' ప్రవేశం
### రష్యా తీరప్రాంత నగరం కాలినిన్‌గ్రాడ్ వద్ద ప్రారంభం

**న్యూఢిల్లీ :** భారత నావికాదళంలో రష్యా తయారీ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ క్షిపణుల శ్రేణిని మోసుకెళ్లే ఐఎన్ఎస్ తమల్‌లో నిఘావ్యవస్థలను జూలై 1న రష్యా తీరప్రాంత నగరం కాలినిన్‌గ్రాడ్ వద్ద దళంలోకి ప్రవేశపెట్టనున్నారు. సముద్రం, భూమిని రెండింటినీ లక్ష్యంగా చేసుకునే బ్రహ్మోస్ లాంగ్‌రేంజ్ క్రూయిజ్ మిస్సైల్ సహా ఈ నౌకలో 26శాతం స్వదేశీ పరికరాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. 125 మీటర్ల పొడవు, 3,900 టన్నుల బరువున్న ఈ యుద్ధనౌక భారతదేశ, రష్యా అధునాతన సాంకేతికలు, యుద్ధనౌక నిర్మాణంలో ఉత్తమ పద్ధతుల అద్భుత మిశ్రమాన్ని కలిగి ఉన్నదని భారత నావికాదళం ఆదివారం వెల్లడించింది. ప్రారంభించబడిన వెంటనే తమల్ భారత నావికాదళం, వెస్టర్న్ ఫ్లీట్ 'కత్తి ఆయుధాల(స్వార్డ్ ఆర్మ్) పొదిలోకి చేరుతుంది. అది కేవలం భారత నావికాదళం పెరుగుతున్న సామర్థ్యాలకు ప్రతీకగా మాత్రమే కాకుండా భారత్‌రష్యాదేశాల భాగస్వామ్య సహకార బలానికి ఒక ఉదాహరణగా నిలుస్తుందని భారత నావికాదళ అధికార ప్రతినిధి వివేక్ మధ్వాల్ చెప్పారు. గత రెండు దశాబ్దాలలో రష్యానుంచి చేర్చబడిన 8వ క్రివాక్ క్లాస్ ఫ్రిగేట్లుగా ఐఎన్ఎస్ తమల్ చేర్చబడుతుంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం వెస్టర్న్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండి ంగ్ఇన్‌చీఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ జె.సింగ్ అధ్యక్షతన జరుగనుంది. భారతదేశం, రష్యాకు చెందిన పలువురు రక్షణ అధికారులు ఈ కార్య క్రమంలో పాల్గొననున్నారని అధికారులు తెలియజేశారు. ఐఎన్ఎల్ తమల్ అనేది తుషిల్ క్లాస్‌కు చెందిన రెండవ నౌక అని, ఇది గోవాలో ట్రిపుల్ క్లాస్ అని పిలువబడే ఐఎన్ఎస్ ట్రిపుల్ క్లాస్ అని పిలువబడే రెండు సారూప్య యుద్ధ నౌకలను నిర్మించడానికి విస్తృత ఒప్పందంలో భాగంగా వాటికి పూర్వమున్న తల్వార్, టెగ్‌క్లాసెస్ భారతదేశం అప్‌గ్రేడెడ్ వెర్షన్‌లతో రూపొందించబడింది.

## పొత్తుపై ఉద్ధవ్, రాజ్‌థాక్రేలదే నిర్ణయం
### శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్



**ముంబయి :** శివసేన (యుబిటి), ఎంఎన్ఎస్ మధ్య పొత్తుపై నిర్ణయం ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రే తీసుకుంటారని, ఈ అంశంపై మరెవరైనా వ్యాఖ్యలు చేయడం అనవసరమని శివసేన (యుబిటి) ఎంపి సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) నాయకులు రాజ్ థాక్రేకు భావోద్వేగాలను పంపుతున్నప్పటికీ, మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు ఇటీవల ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను ముంబయిలోని ఒక హోటల్‌లో కలిశారు. ఇది ఆయన తదుపరి రాజకీయ ఎత్తుగడ గురించి ఊహాగానాలకు దారితీసింది. ప్రధాని నరేంద్ర మోదీ మద్దతుదారుడిగా ఉన్న థాక్రే ఒక్కసారిగా విమర్శకుడిగా మారారు. అయితే ఆయన 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నేతృత్వంలోని మహాయుతికి మద్దతు ప్రకటించారు. కాగా, ఆదివారం రౌత్ మీడియాతో మాట్లాడుతూ కూటమిపై నిర్ణయం తీసుకునేది ఉద్ధవ్, రాజ్ మాత్రమే అని అన్నారు. 'ఎంఎన్ఎస్ నుండి కూటమికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారు ఆలస్యంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఇతరులు చెప్పే దానికి విలువ లేదు. నేను చాలా సంవత్సరాలుగా థాక్రే సోదరులను దగ్గరగా చూశాను. ఏమి జరుగుతుందో, ఏమి జరగదో నాకు తెలుసు. నా కంటే ఎవరికీ బాగా తెలియదు' అని రౌత్ పేర్కొన్నారు. శివసేన (యుబిటి)పై ఎంఎన్ఎస్ నాయకుడు సందీప్ దేశ్‌పాండే చేసిన విమర్శలపై అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 'కూటమిపై నాయకులు, సోదరులుగా రాజ్ థాక్రే, ఉద్ధవ్ థాక్రే నిర్ణయం తీసుకుంటారని రౌత్ నొక్కి చెప్పారు. ఈ సంవత్సరం చివర్లో జరగనున్న మున్సిపల్ ఎన్నికలకు ముందు థాక్రే సోదరుల మధ్య సయోధ్య కుదిరే అవకాశం ఉందని ఊహాగానాలు వస్తున్నాయి. విడిపోయిన థాక్రే దాయాదులు చిన్న చిన్న విషయాలను విస్మరించి దాదాపు రెండు దశాబ్దాల తర్వాత చేతులు కలపవచ్చని వారు ఇటీవల కాలంగా చేస్తున్న ప్రకటనలు సూచిస్తున్నాయి. 'మరాఠీ మనూస్' (మరాఠీ మాట్లాడే ప్రజలు) ప్రయోజనాల కోసం ఐక్యంగా ఉండటం కష్టం కాదని రాజ్ థాక్రే చెప్పినప్పటికీ, మహారాష్ట్ర ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేసే వారికి లబ్ధి చేకూర్చకపోతే, తాను చిన్న చిన్న పోరాటాలను పక్కన పెట్టడానికి సిద్ధంగా ఉన్నానని ఉద్ధవ్ పేర్కొన్నారు. ఈనెల 12న, ముఖ్యమంత్రి ఫడ్నవీస్ ముంబయిలోని ఒక లగ్జరీ హోటల్‌లో రాజ్ థాక్రేను కలిశారు. వీరి భేటీ రాష్ట్రంలో పురపాలక ఎన్నికలకు ముందు అధికార బిజెపి, ఎంఎన్ఎస్ మధ్య పొత్తు ఉంటుందనే ఊహాగానాలకు ఆజ్యం పోసింది.

## జీవించే హక్కును అందించడంలో..
# బసవతారకం ముందంజ
### రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జీవించే హక్కును అందించడంలో బసవతారకం ఆస్పత్రి ముందంజలో ఉందని తనకు తెలిసిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని బసవతారకం ఆస్పత్రి 25 ఏళ్ల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సంస్థ ఏడాది పాటు పలు ప్రత్యేక కార్యక్రమాలకు స్వీకారం చుట్టారు. ఈ కార్యక్రమాలలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన భారీ పైలాన్‌ను ఆస్పత్రి చైర్మన్, సినినటుడులు నందమూరి బాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, బసవతారకం ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు సభ్యులు భరత్ మతుకుమల్లి, జెఎస్ఆర్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ బాలకృష్ణ తనను కలవడానికి వచ్చినపుడు ఒక గ్లామరస్ హీరో తన వద్దకు వస్తున్నాడని భావించానని, కానీ ఆయనను కలిసి మాట్లాడిన తర్వాత తన అభిప్రాయాన్ని మార్చుకొని, బాలకృష్ణ గ్రేట్ హీరో విత్ ఏ మిషన్ అని తెలిసిందన్నారు. తాను లిఫ్టులో వస్తున్నపుడు ఆ లిఫ్టును ఒక దివ్యాంగుడైన వ్యక్తి నిర్వహించడం చూసి సంతోషించినట్లు తెలిపారు. ఇలాంటి రీతిలో ప్రభుత్వ ఆస్పత్రులలో దివ్యాంగులకు ఉపాధి కలిపించవచ్చేనే ఆలోచన చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహకు గవర్నర్ సూచించారు. క్యాన్సర్ వ్యాధితో భాదపడుతున్న వారికి స్వాంతన చేకూర్చడం ద్వారా బసవతారకం ముందుకు సాగుతోందన్నారు.

**తెలంగాణలో ప్రతి ఏటా 50 నుంచి 55 వేల మందికి క్యాన్సర్ : మంత్రి దామోదర రాజనర్సింహ**

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ లక్షలాది మంది పేద రోగులకు వారి జీవితంపై ఆశ, నమ్మకాన్ని బసవతారకం ఆస్పత్రి కలిగిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా క్యాన్సర్ సమస్య పెరుగుతోందన్నారు. తెలంగాణలో ప్రతి ఏటా 50 నుంచి 55 వేల మందికి కొత్తగా క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. ఇవి కేవలం నెంబర్లు కాదని, రోగుల జీవితాలను, వారి కుటుంబాలను తీవ్రంగా ప్రభావితం చేసే ప్రమాదకర వ్యాధి ఇదని చెప్పారు. మొదటి దశలోనే గుర్తిస్తేనే ఈ వ్యాధిని నయం చేయగలమన్నారు.

**అన్ని జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లను ప్రారంభిస్తాం..**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్లను ప్రారంభించబోతున్నామని మంత్రి తెలిపారు. ప్రతి జిల్లాల్లో క్యాన్సర్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. త్వరలోనే వీటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్, డయాగ్నొసిస్, డే కేర్ కీమోథెరపి, పాలియేటివ్ కేర్ వంటి సేవలన్ని ఈ కేంద్రాలలో అందిస్తామన్నారు. ఇంకా ఆధునిక వైద్య సేవలు అందించేలా రీజనల్ కేన్సర్ కేర్ సెంటర్లను అందుబాటులోకి తీసుకురాబోతున్నామని వెల్లడించారు. పేద పేషెంట్లకు సేవలు అందిస్తున్న బసవతారకం వంటి హాస్పిటళ్లకు ప్రభుత్వం తరపున అవసరమైన సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. ఎన్‌టిఆర్ స్థాపించిన ఈ ఆస్పత్రి ద్వారా పేదలకు సేవలు అందిస్తున్న బాలకృష్ణకు మంత్రి అభినందనలు తెలిపారు.

**దేశంలోనే అత్యున్నత ఆస్పత్రిగా బసవతారకం క్యాన్సర్ హస్పిటల్ : నందమూరి బాలకృష్ణ**

ఈ ఆస్పత్రిని డబ్బులు, లాభాల కోసం ఏర్పాటు చేసింది కాదని బాలకృష్ణ అన్నారు. వ్యక్తిగత నష్టం వల్ల కలిగిన ఆలోచన నుంచి పుట్టిందన్నారు. తన తల్లి క్యాన్సర్‌తో చనిపోయిందని, దీంతో అందరికి క్యాన్సర్ చికిత్స అందించాలనే లక్ష్యంతో తన తండ్రి ఎన్‌టిఆర్ ఈ ఆస్పత్రిని ఏర్పాటు చేశారని బాలకృష్ణ తెలిపారు. స్టేట్ ఆఫ్ ఆర్ట్ పరికరాలతో దేశంలోనే అత్యున్నత ఆస్పత్రుల్లో ఒకటిగా నిలిచిందన్నారు. తమకు పూర్తి సహకారం అందిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి, మంత్రి దామోదర రాజనర్సింహకు బాలకృష్ణ కృతజ్ఞతలు చెప్పారు. వెయ్యి బెడ్స్‌తో త్వరలో అమరావతిలో ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దామోదర రాజనర్సింహ పేరుతో సినిమా తెరకెక్కించాలని భావిస్తున్నట్లు బాలకృష్ణ వెల్లడించారు. అయితే ఆ చిత్రానికి దామోదర రాజనర్సింహ టైటిల్ కాకుండా దబిడి దిబిడి రాజనర్సింహ అని టైటిల్ పెట్టాలనుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బసవతారకం ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## లారీ డ్రైవర్లకు డ్రగ్స్‌పై అవగాహన



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ అన్నారు. ఆదివారం పట్టణంలో గల లారీ అసోసియేషన్ కార్యాలయంలో వద్ద లారీ డ్రైవర్లకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా ఎస్‌పి అదేశాల మేరకు డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు తమ వంతు సహకారం అందించాలని, ఎక్కడైనా గంజాయిలాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్న, విని యోగిస్తున్న అలాంటి వారి సమాచారాన్ని పోలీసులకు అందించి నివారించడంలో సహకరించాలని కోరారు. సుదూర ప్రాంతాలకు వాహనాలు నడుపుతూ అలసి పోయి ఉంటారు ఈ క్రమంలో డ్రగ్స్‌కు ఎవరైనా అలవాటు పడితే తాత్కలిక సుఖం వచ్చిన ఆరోగ్యం క్షిణిస్తుందని అన్నారు. లారీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలు పంపిణీ



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** మండలం పరిధిలోని తొండ్లాయి గ్రామస్తులకు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులను గ్రామ మాజీ సర్పంచ్ బింగి కొండయ్య యువజన నాయకుడు బి. మహేష్ యాదవ్‌తో కలిసి పంపిణి చేశారు. ఆదివారం గ్రామంలోని 18 మంది లబ్ధిదారులకు మం జూరు కావడంతో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం ఆదేశాల మేరకు ఉత్తర్వుల కాపీలను అందజేశారు. మంజూరు పత్రాలను అందుకున్న లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. శివశంకర్, స్టాలిన్, విజయ్ , సునీల్, రమేష్ పాల్గొన్నారు.



## చెర్వుగట్టు క్షేత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** నల్లగొండ జిల్లా లో మహిమానిత్వ పుణ్యక్షేత్రం, కోరిన కోర్కెలు తీర్చే పరమశివుని చెర్వుగట్టు క్షేత్రమును దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతమని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల అయిలయ్య అన్నారు. ఆదివారం మండలం పరిధిలోని చెర్వుగట్టు శ్రీపార్వతి జడల రామలింగేశ్వర స్వామి వారిని కుటుంబ సభ్యులతో కలిసి ఆయన దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఘనంగా స్వాగతం పలికి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అయిలయ్య కుటుంబసభ్యులకు అందజేశారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఎమ్మెల్యే గుట్ట ప్రాంగణంలోని అన్ని దేవాలయాలను దర్శించుకున్నారు. చెర్వుగట్టు క్షేత్రంలో అతిప్రాముఖ్యతను సంతరించుకున్న మూడుగుండ్ల దేవున్ని కూడా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయ సిబ్బంది ఇంద్రసేనారెడ్డి దేవాస్థానం నుండి సకల మర్యాదలు చేసి ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యువజన జిల్లా నాయకులు వడ్డే భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వర దేవాలయ 50 నవరాత్రి వార్షికోత్సవ వేడుకల లోగో ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని గణేష్ మార్కెట్‌లోని విఘ్నేశ్వర దేవాలయ 50 నవరాత్రి వార్షికోత్సవ వేడుకల లోగోను ఆదివారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లో ప్రారంభించిన గణేష్ నవరాత్రి వేడుకలను 50 సంవత్సరాలు నిరాటంకంగా కొనసాగిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 5వరకు జరిగే 50వ వార్షికోత్సవ వేడుకలను భక్తులు విజయవంతం చేయాలని , వార్షికోత్సవానికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని అన్నారు. దాతలు, భక్తుల సహకారంతో ప్రతి ఏటా వినూత్నమైన భారీ సెట్టింగ్‌లతో పట్టణంలోనే ఎత్తైన గణేష్ ప్రతిమను ప్రతిష్టిస్తూ తమ ప్రత్యేకతను చాటుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, ఉత్సవ కమిటీ సభ్యుడు పొలిశెట్టి యాదగిరి, అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్కూటీని లారీ ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని ఎఫ్‌సీఐ రోడ్డు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ వన్‌టౌన్ సీఐ సీహెచ్.మోతీరాం తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన గంధం అరుణ్(25), రామకృష్ణలు ఆదివారం మిర్యాలగూడ నుంచి హాలియా వైపు స్కూటీపై వెళ్తుండగా అదే సమయంలో ధాన్యం లోడ్‌తో వెళ్తున్న లారీ వెనుక నుంచి స్కూటీని ఢీకొట్టడంతో వెనుక కూర్చొన్న అరుణ్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ప్రమాదంలో స్కూటీ నడుపుతున్న రామకృష్ణకు గాయాలు కావడంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు మృతుని కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లను రద్దు చేయాలి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** జిల్లా వ్యాప్తంగా కొంతమంది ఉపాధ్యాయులు రాజకీయ నాయకుల అండదండలతో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిప్యూటేషన్లతో వెళుతున్నారని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం రాజశేఖర్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బక్క శ్రీనివాస్ చారి అధ్యక్షతన ఆఫీస్ బేరర్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ముఖ్యఅతిథిగా రాజశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ జిల్లాలో ని పీఏ పల్లి, అడవిదేవులపల్లి, చందూరు, గుడిపల్లి లాంటి మండలాల నుండి హైవే ప్రాంతాలైన కట్టంగూరు, నకిరేకల్, కేతపల్లి మండలాలకు అక్రమంగా డిప్యూటేషన్ పై రావటం జరుగుతుందన్నారు. ఈ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేయాలని లేనట్లయితే జిల్లా విద్యాశాఖ కార్యాలయం ముందు పోరాట కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పిల్లల అవసరాలు చూడకుండా ఇలా అక్రమ డిప్రెషన్ ఇవ్వడం ఎంతవరకు న్యాయమని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి జి నాగమణి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ళ వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు బి అరుణ, నర్రా శేఖర్ రెడ్డి, కోశాధికారి వడిత్య రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, సిహెచ్ .అరుణ, జిల్లా కార్యదర్శులు సిహెచ్ రామలింగయ్య, గేర నరసింహ, ఎం శ్రీనివాసరెడ్డి, నలపరాజు వెంకన్న, పగిళ్ల సైదులు, కొమరాజు సైదులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పథకాలకు ఆ రైతులు అనర్హులుగా మిగిలిపోతారా!

### చందంపేట మండల రైతుల కల నెరవేరేది ఎప్పుడు?



**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి, చిత్రియాల, రేకులగడ్డ, పొగిళ్ల, అచ్చందపేట పట్టి, బొల్లారం పట్టి రెవెన్యూ గ్రామాలలో రైతులకు ఎంతో ఇబ్బందికరంగా భూమి సమస్య ఉన్నదని కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ పథకాలకు ఆ గ్రామాల రైతులు అనర్హులుగా మిగిలిపోతున్నారని, కుటుంబంలో తండ్రి పేరు నుండి కొడుకు భూమి పట్టా చేసుకుందామంటే కావడంలేదని కుటుంబ ఇబ్బంది కలిగిన అత్యవసర పరిస్థితుల్లో భూమి అమ్ముకుందామంటే అనేక ఇబ్బందులు పడుతున్నామని, గత ప్రభుత్వం అనేక సార్లు గ్రామాలలో మండలాలలో భూముల పై మీటింగ్‌లు పెట్టి చెప్పిన ఇప్పటికి ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో చందంపేట మండలం మొత్తం రెవెన్యూ లో 1500 వరకు దరఖాస్తులు వచ్చాయని అత్యధికంగా చిత్రియాల, కంబాలపల్లి, పొగిళ్ళ రెవెన్యూలో రైతులు ఎంతో ఆందోళనలో ఉన్నారని, రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు వేస్తున్నప్పటికి కనీసం ఆ రైతులకు రాకపోవడంతో అధికారుల చుట్టు తిరగడం తప్ప మరొక దారి లేకపోలేదని, గత ప్రభుత్వం ఎన్నో ఆందోళనలు చేసినప్పటికి న్యాయం జరగలేదని ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలోని రైతులందరికి ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఇప్పటికి వారి కల నేరవేరలేదని అన్నారు. గత నెలలో రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండలంలోని ప్రతి రైతుకు న్యాయం జరుగుతుందని చెప్పినప్పటికి రైతులు ఎదురుచూపులే తప్ప న్యాయం ఎక్కడ జరగలేదని అన్నారు. చందంపేట మండలం అంటేనే వెనుకబడిన మండలంలాగానే చూస్తున్నారే తప్ప జిల్లా అధికారులు వచ్చి ఏ ఒక్కరోజు హామీ కూడా ఇవ్వలేదని ఎన్ని ధర్నాలు చేపట్టిన మండల కార్యాలయం, జిల్లా కార్యాలయంలో ఎన్ని సార్లు విన్నవించుకున్నా రాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి కూడా రెండు సంవత్సరాలు కావస్తున్న నేటికి రైతులు పరిస్థితి మారలేదని, ఆడబిడ్డ పెళ్ళిళ్లకు భూమి అమ్ముదామన్న కొనే పరిస్థితులు లేవని, కొన్ని గ్రామాలకు డీ ఫామ్ పట్టాలు ఇచ్చినప్పటికి ఫలితం లేదని, రాష్ట్ర ప్రభుత్వం మారిన రైతులు పరిస్థితి అప్పటి లానే ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా చందంపేట మండల రెవెన్యూ గ్రామంలో ఉన్న ఇబ్బందులను దేవరకొండ ఎంఎల్ఏ బాలునాయక్ జిల్లా అధికారులు వెంటనే స్పందించి రెవెన్యూ సదస్సులో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

## ఉచిత వసతి సౌకర్యం కోసం దరఖాస్తులు

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** ఇదారే ఇకామత్ ఖానా బహదూర్ ఖాన్ పట్టణంలోని మన్యం చల్క వారి ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులకు ఉచిత భోజ న వసతి సౌకర్యంకొరకు అప్లికేషన్లు ఆహ్వానించడం జరుగుతుందని అధ్యక్షుడు షాహిద్ అహ్మద్ పేర్కొన్నారు.వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డిగ్రీ,పీజీ, ఇంటర్మీ డియట్ పాలిటెక్నిక్ టెక్నికల్ ట్రైనింగ్ కోర్సులు, పారా మెడికల్ చదువుతున్న గ్రామీణ ఇతర జిల్లాలల మైనారిటీ విద్యార్థుల నుండి 23 నుండి అప్లికేషన్లు ఆహ్వానించడం జరుగుతుందని తెలిపారు.

## పుల్లెంల పాల సంఘం చైర్మన్‌గా యాదయ్య

**ప్రజాపక్షం/చండూరుః** నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల పాల సంఘం చైర్మన్ గా కామ్రేడ్ పెసర్ల యాదయ్య శనివారం జరిగిన సంఘం ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్బంగా నూతన చైర్మన్ పెసర్ల యాదయ్య మాట్లాడుతూ పుల్లెంల పాల సంఘం అభివృద్ధి కోసం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన సిపిఐ, కాంగ్రెస్ , టిఆర్ఎస్ పార్టీ నాయకులకు , సంఘం డైరెక్టర్లకు చైర్మన్ పెసర్ల యాదయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే అవసరం

### మార్షల్ ఆర్ట్స్‌ను ప్రోత్సహించాలి
### సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్



**ప్రజాపక్షం/సూర్యాపేట:** మనదేశంలో పుట్టి, ఇతర దేశాల్లో అభివృద్ధి చెందిన మార్షల్ ఆర్ట్స్ కరాటేను మనదేశంలో ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూర్యాపేట పట్టణ డిఎస్‌పి ప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విద్యానగర్ బేబీమూన్ ఉన్నత పాఠశాలలో సుమన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే దు అకాడమి మాస్టర్ జెవి రమణ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థిని, విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు ప్రధానం చేసి మాట్లాడారు. తమను తాము రక్షించుకునేందుకు కరాటే ఎంతో దోహదపడుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో బాలికలకు కరాటే శిక్షణ ఎంతో అవసరమని, పట్టణంలోని ప్రతి సెంటర్‌లో కరాటే శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసి కరాటే విద్యను నేర్పించాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కరాటే తో యువత మద్యపానం, డ్రగ్స్ లాంటి చెడు అలవాట్ల బారిన పడకుండా దృష్టిని మరల్చవచ్చని అన్నారు. స్పోర్ట్స్‌లో ప్రతిభ కనబర్చితే ఉద్యోగాల్లో కూడా అవకాశాలు ఉంటాయన్నారు. నోటిఫికేషన్ సమయంలో తమ విద్య సర్టిఫికెట్లతో పాటు స్పోర్ట్స్ సర్టిఫికెట్లు కూడా సమర్పిస్తే ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్టిఫికెట్లకు ఉద్యగాల్లో ఏడుశాతం రాయితీ ఉంటుందన్నారు. మార్షల్ ఆర్ట్స్ శిక్షణతో శరీరం ఫిట్టుగా ఉండటంతో పాటు సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. కరాటేను ప్రోత్సహిస్తూ ఎంతో మంది విద్యార్థిని, విద్యార్థులకు కరాటే శిక్షణను అందిస్తున్న మాస్టర్ జెవి రమణను అభినందించారు. అనంతరం కరాటే విద్యార్థిని, విద్యార్థులకు ఎల్లో బెల్టులు30, గ్రీన్ బెల్టులు 20, ఆరెంట్ బెల్టులు 10, బ్లాక్ 1తో పాటు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎజిపి షఫిఉల్లా, కరాటే మాస్టర్లు జెవి రమణ, సంతోష్, సాయికిరణ్, రిషి, చైతన్య పాల్గొన్నారు.



## శ్రీనివాస టౌన్‌షిప్ బాధితులకు న్యాయం చేయాలి

**ప్రజాపక్షం/చిట్యాలః** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని శ్రీనివాస టౌన్ షిప్‌లో ప్లాట్ కొనుగోలు చేసి మోసానికి గురవుతున్న వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని ప్లాట్ కొనుగోలు దారులు ఆదివారం రోజున స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో శ్రీనివాస టౌన్ షిప్ పేరుతో డిటిసిపి ఆమోదం పొంది ఓపెన్ ప్లాట్లు అమ్మకాల కోసం బొబ్బలి జితేందర్‌రెడ్డి, అర్థ వెంకట్‌రెడ్డి, పాకాల తిరుపతి రెడ్డి పేర్లతో కరపత్రాలు విడుదల చేశారని అన్నారు. అందులో ఇంటి నిర్మాణం చేపట్టాలని తామంతా అడ్వాన్స్ రూపంలో నగదును చెల్లించి డెవలపర్స్‌తో అగ్రిమెంట్ చేసుకున్నామని పేర్కొన్నారు. అగ్రిమెంట్ చేసుకున్న ప్లాట్లను వెంచర్ యజమానులు అధిక ధరలకు ఇతరులకు ప్లాట్‌లను అమ్మి రిజిస్ట్రేషన్ చేసి తమను మోసం చేశారని ఆరోపించారు. ఈ విషయంపై వెంచర్ యజమానులను అడిగితే దాటవేసే ప్రయత్నం చేస్తున్నారని, సుమారు రూ. 4 కోట్ల మేర అడ్వాన్స్ రూపంలో డబ్బులు వసూలు చేసి ముఖం చాటేస్తున్నారని అన్నారు. ఇట్టి విషయంపై తమకు న్యాయం చేయాలని వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

## సాగుకు రైతన్న సిద్ధం

**ప్రజాపక్షం/గుండాల:** గత నెలలో కురిసిన అకాల వర్షాలకు భూమి తడవడంతో బావులు, బోర్లు ఉన్న రైతులు విత్తనాలు విత్తుకొని సాగుకు సిద్ధమయ్యారు. ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులు ఎక్కువ మొత్తంలో పత్తి, మొక్కలు వేయదంలో ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో సమయానికంటే ముందుగానే వర్షాలు పడి తీర విత్తుకుందామనే తరుణంలో వర్షాలు కురవపోవడంతో రైతన్నలు కొత్త ఆందోళన చెందుకున్న పరిస్థితి. జూన్ నెలలో సంపూర్ణంగా వర్షాలు కురిస్తే ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు విత్తుకునేందుకు రైతన్న సిద్దం అయిన నేపథ్యంలో ద్రోణి ప్రభావంతో కొద్దిపాటి వర్షానికి రైతులు విత్తుకున్న విత్తనాలు మొలకెత్తకపోవడంతో మరళ వర్షాలు కురిస్తే విత్తనాలు విత్తుకునేందుకు రైతులు సిద్దంగా ఉన్నారు. జూన్ చివరి వారంలో వర్షాలు కురిస్తే రైతులు ఖరీఫ్ సాగుకు సిద్దంగా ఉన్నారని వర్షాల కోసం గ్రామాలలో రైతులు దేవుళ్ళకు నీరు పోసే కార్యక్రమాలను చేపడుతున్నారని ఏది ఏమైనప్పటికి కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి రైతు బంధు డబ్బులు రైతులు ఖాతాలలో ముందుగానే జమ చేసిన రైతన్నకు వర్షాలు పడకపోవడంతో విత్తనాలు విత్తుకునేందుకు కొంత సమయం పట్టే విధంగా ఉందని ఇప్పటికైనా సంవృద్దిగా వర్షాలు కురిస్తే రైతన్నకు ఎటువంటి ఇబ్బందులు ఉండవని అన్నారు.



## ఉద్యోగుల నూతన వేతన సవరణ నివేదికను ప్రకటించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** తెలంగాణ రాష్ట్రంలోనిఉద్యోగ, ఉపాధ్యాయుల వేతన సవరణ నివేదికను వెంటనే ప్రకటించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ (టిఎస్‌యూటిఎఫ్) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టిఎస్ యూటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎస్, సోమయ్య అధ్యక్షతన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పిఆర్‌సి కమిటి ఏర్పాటు చేసి రెండు సంవత్సరాల కాలం పూర్తయిన కూడా ఇంత వరకు పిఆర్‌సి రిపోర్టును ప్రభుత్వం విడుదల చేయలేదని, దాని వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆర్థికంగా నష్టపోతున్నారని, కావున వెంటనే సవరణ రిపోర్టును ప్రకటించి అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో మన ఊరు మన బడి పథకంలో మంజూరై మధ్యలో నిలిచిపోయిన పెండింగ్ పనులను పూర్తి చేయాలని, రెండు జతల ఏకరూప దుస్తులను వెంటనే అందించాలని, నూతన విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యార్థులకు అన్ని రకాల టైటిల్స్ పాఠ్యపుస్తకాలను వెంటనే అందించాలని, ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతల ప్రక్రీయను చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న సప్లమెంటరీ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ జిల్లా కమిటి సమావేశంలో టిఎస్ యూటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాస రెడ్డి, కె. అరుణ భారతి, జిల్లా కోశాధికారి వెంకటయ్య, జిల్లా కార్యదర్శులు నాగేశ్వరరావు, బిఆడం, వెలుగు రమేష్, సోమయ్య, చిలక రమేష్, డిలాలు, పాండురంగచారి, బాలసైదిరెడ్డి, సాంబయ్య, శ్రీనివాసచారి పాల్గొన్నారు.



## మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరం

**ప్రజాపక్షం/కోదాడ:** మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి హానికరమని కోదాడ పట్టణ ఎస్ఐ సుధీర్ అన్నారు. ఆదివారం మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు, యువతకు అవగాహన కల్పించేందుకు పట్టణంలోని రహదారిపై ర్యాలీనిర్వహించి, అనంతరం బస్టాండ్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లకు, హమాలీ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు, ఆర్థికపరమన సమస్యలు ఎదురవుతాయని, కు టుంబాలు చిన్నభిన్నం, పిల్లలపై ప్రభావం చూపుతుందని అన్నారు. రోజువారి కూలీ జీవనం గడుపుతున్న మీరు డ్రగ్స్ మత్తుకు అలవాటు పడితే ఆర్థికంగా నష్టపోయి అనారోగ్యం పాలవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆటో డ్రైవర్లు, హమాలీలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ ప్రమాదకరమైన మత్తు పదార్థం

**ప్రజాపక్షం/సూర్యాపేటరూరల్:** డ్రగ్స్ అనేవి ప్రమాదకరమైన మత్తు పదార్థమని, దీనిని ఉపయోగించడం వల్ల శరీరశక్తి నిశిస్తుందని సూర్యాపేట రూరల్ సిఐ రాజశేఖర్ అన్నారు. ఆదివారం మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో రూరల్ ఎస్ఐ బాలునాయక్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా సిఐ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నిర్మూలించాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని, గ్రామంలోకి ఇలాంటి వాటిని రానివ్వకుండా గ్రామస్తులు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## 50శాతం వెయిటేజీ ఇవ్వాలి



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రభుత్వ బడిలో చదువుకున్న విద్యార్థులకు ఎన్ఐటి, ఐఐఎమ్, ఎఐఐఎమ్ఎస్ ఉన్నత విద్యతో 50శాతం వెయిటేజీ ఇవ్వాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బడుగుల సైదులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సంపన్న పిల్లలతో సామాన్య పిల్లలు కూడా సమానంగా చదవాలంటే ప్రభుత్వ బడిలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నత విద్యలో ఉద్యోగ అవకాశాలలో వెయిటేజీ కల్పించాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. సమాజంలో ఉద్యోగులు, అధికారులు, నాయకుల పిల్లలు ప్రభుత్వ బడిలో చదివినప్పుడే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయన్నారు. ప్రభుత్వ బడులలో మౌలిక వసతులు, సౌకర్యాలు, నాణ్యమైన విద్య అందించడానికి కావాల్సిన నిధులు సమకూర్చాలన్నారు.

## తెలంగాణకు చంద్రబాబు నష్టం చేయరు

### టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కాని నర్సింహులు




**ప్రజాపక్షం/కోదాడ:** రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఎక్కడున్నా బాగుండాలనే చంద్రబాబు కోరుకుంటారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కాని నర్సింహులు అన్నారు. ఆదివారం కోదాడ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ మిత్రుడు జగనోమోహన్‌రెడ్డి ప్రగతిభవన్‌లో నాడు రాయలసీమను రతనాల సీమగా చేసేందుకు గోదావరి నీళ్లు అవసరమని అన్నాడని, నేడు అల్లుడు హరిష్‌రావు బనకచర్ల ప్రాజెక్టు పట్ల అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలు చంద్రబాబు నాయుడికి రెండు కళ్లు లాంటివని తెలంగాణకు అన్యాయం చేసే పని చంద్రబాబు నాయుడు చేయబోరని అన్నారు. 2014 రాష్ట్ర విభజన అనంతరం జరిగిన ఎన్నికల్లో కూడా 15 మంది టిడిపి ఎమ్మెల్యేలను గెలిపించి ప్రజలు ఆదరించారని ఆంధ్ర తెలంగాణ ప్రాంతీయ విభేదాల వల్ల ఆంధ్ర పార్టీని ముద్రవేయడం వల్ల పార్టీకి నష్టం జరిగిందన్నారు. ప్రాంతీయ విభేదాలు బలహీనపర్చిన ప్రజల్లో నేటికి పార్టీ పట్ల విశ్వాసం ఉందన్నారు. అన్న ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 200 మంది కార్యకర్తలు పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఓరుగంటి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జాతీయ క్రమశిక్షణ కమిటి సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, పార్లమెంట్ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్‌రెడ్డి, మాజీ రాష్ట్ర కార్యదర్శి ముత్తినేని సైదేశ్వరరావు, కోదాడ నియోజకవర్గ పరిశీలకులు నాతాల రామిరెడ్డి, భువనగిరి పార్లమెంట్ కన్వీనర్ కృష్ణమాచారి, గుండ్లపల్లి ఆనంద్, మండవ వెంకటేశ్వర్లు, వేమూరి సత్యనారాయణ, కోడె వాసు, కీసర నాగయ్య, చల్లా గురవయ్య పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కపై తప్పడు ఆరోపణలు చేస్తే ఊరుకోం

**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** హుజురాబాద్ ఎంఎల్‌ఏ పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని, మంత్రి సీతక్కపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. ఆదివారం ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఆదేశానుసారం గోవిందరావుపేట మండల కేంద్రంలో కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించగా ఈ సమావేశానికి ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ విచ్చేసి మాట్లాడుతూ పాడి కౌశిక్ రెడ్డి ఉద్యమకారుడిలా మాట్లాడడం హాస్యస్పదమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సూదిరెడ్డి జనార్ధన్ రెడ్డి, సూడి సత్తిరెడ్డి, తిరుపతిరెడ్డి, కుమార్, జనార్ధన్ రెడ్డి, రాజు, అశోక్, మూడు ప్రతాప్, రేవంత్, భరత్, ప్రభు, రామకృష్ణ, లక్కీ అనిల్, పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు

**ప్రజాపక్షం/నర్సంపేట :** నర్సంపేట పట్టణంలోని 1వ వార్డుకు చెందిన కందికట్ల వీరేష్ ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ, వివిధ పార్టీల నుండి సుమారుగా 30 కుటుంబాలు నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ ఫలాలు పట్టణ ప్రజలకు, గ్రామ ప్రజలకు అందించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలు ఉండి కనీసం పట్టణంలో, గ్రామాలలో ఎలాంటి అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో పట్టణ అభివృద్ధి, గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతున్నాయని ఇందిరమ్మ ఇళ్లు, 2 లక్షల రుణమాఫీ అనేక సంక్షేమ ఫలాలు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతుబంధు నిధులు ఉపయోగించుకోండి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ప్రభుత్వం సకాలంలో రైతు బంధు డబ్బులు వేస్తుందని, వాటిని రైతులు సాగు అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరు నాయక్ తెలిపారు. రైతు భరోసా కింద ఆదివారం వరకు జిల్లాలో 132,52,49,227 రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా వీరు నాయక్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు 1,14,011 మంది రైతుల ఖాతాల్లో మొత్తం 1,32,52,49,227 రూపాయలు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, సాగు అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయని ఆయన తెలిపారు. గతంలో రైతులు సాగు సమయం వచ్చే వరకు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించే వారిని, ఇప్పుడు ఆ అవసరం లేదని ప్రభుత్వమే రైతు కష్టాలను గుర్తించి సకాలంలో రైతులకు పెట్టుబడి సహాయం కింద నేరుగా రైతు ఖాతాలోనే జమ చేస్తుందని అన్నారు. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీరు నాయక్ సూచించారు.

# మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లిప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం నిర్మాణ మహాసభలు ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డి భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆమె తెలిపారు. జిల్లా అధ్యక్షురాలుగా ఉమ మహా ముత్తారం, జిల్లా సహాయ కార్యదర్శిగా సుగుణ గణ పురం, ఉపాధ్యక్షులుగా రాజేశ్వరి తాడిచర్ల, పద్మ రేగొండ లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేగొండ, పద్మ, భాగ్య,లక్ష్మి చిట్యాల, స్వరూపం, లక్ష్మి, మొగుళ్లపల్లి రాధా, సుగుణ, రజిత, భూపాలపల్లి మల్లమ్మ సుగుణ సమ్మక్క మల్లక్క, కాటారం పద్మా, స్వరూప, లావణ్య, మహా ముత్తారం పద్మ, ఉమా, లక్ష్మి మండలాల నుండి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పెన్షన్ ఇప్పిస్తామని నర్సంపేటలో ఘరానా మోసం...



**ప్రజాపక్షం/ నర్సంపేట :** పెన్షన్ ఇప్పిస్తానని వృద్ధురాలిని మోసం చేసిన సంఘటన నర్సంపేట పట్టణంలోని ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నర్సంపేట పట్టణంలోని మార్కండేయ కాలనీకి చెందిన మాటేటి సరోజన సర్వేశం వృద్ధ దంపతులు అంగడి సెంటర్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్లారు. ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆవృద్ధ దంపతులకు పెన్షన్ ఇప్పిస్తానంటూ మాయ మాటలు చెప్పి ఫోటో తీయాలంటూ మెడలో మూడు తులాల పుస్తెలతాడును తీయమని చెప్పి, తన చేతిలో పెట్టుకుని పెన్షన్ ఫారమ్స్ జిరాక్స్ తీసుకొని రమ్మని చెప్పి పరారయ్యాడు. దీంతో మోసాన్ని గ్రహించిన వృద్ధ దంపతులు లబోదిబోమని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.

# గుర్తు తెలియని వాహనం ఢీ: ఒకరు మృతి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం ఉదయం జనగామ మండలంలోని యశ్వంతాపూర్ గ్రామంలో జరిగింది. జనగామ ఎస్‌హెచ్‌ఓ దామోదర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వాహన ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన యశ్వంతాపూర్ గ్రామస్తులు తెలపడంతో సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించడం జరిగిందన్నారు. సుమారు 40 నుండి 50 సంవత్సరాలు గల గుర్తు తెలియని వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందినట్లు గుర్తించాలని ఒంటిపై నీలం తెలు, నలుపు, పసుపు రంగు గల రాక్‌స్టార్ కంనెనీకి చెందిన ఫుల్ షర్ట్, ట్విల్స్ కంపెనీకి చెందిన బ్లూ కలర్ జీన్స్ పాయింట్ బెల్లం కలర్ ఆఫ్ బనీన్ గల వ్యక్తి తలకు, రెండు కాళ్లకు, చేతులకు గాయాలై ఉన్నాడన్నారు. కుడిచేతిపై అమ్మానాన్న అని పచ్చబొట్లు కలదని, కుడి చేతిపై 07 పాత కత్తి కాట్లు ఉన్నాయని, హుడ్‌ల్యాండ్ కంఎపీ బెల్ట్, ఎరువు రంగు గల రెండు వరసల మొలతాడు పారాగాన్ కంపెనీ చెందిన బెల్లం కల్లర్ చెప్పులు ఉన్నాయన్నారు. పై ఆదారాలు ఉన్న వ్యక్తి శవం కోసం జనగామ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. పోన్ నెంబర్ 8712685202,8712685260, 8712685032 నెంబర్లకు కాల్ చేయాలని తెలిపారు.

# మృతదేహం వెలికి తీసిన ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం

**ప్రజాపక్షం/సంగెం:** మండలంలోని ఆశాలపల్లి గ్రామంలో నల్లకుంట చెరువులో శనివారం గల్లంతైన పశువుల కాపరి వెంకటయ్య మృతదేహాన్ని ఆదివారం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు గాలించి వెలికి తీసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఆశాలపల్లి గ్రామానికి చెందిన కొంగర వెంకటయ్య అదే గ్రామానికి చెందిన బొల్లెబోయిన స్వామికి పాలేరుగా పనిచేస్తున్నాడు. రోజు వారిలో భాగంగా పశువులను కొట్టుకొని మేపేందుకు గ్రామ శివారులోని ఆలకుంట చెరువు వద్దకు తీసుకపోయాడు. మధ్యాహ్న సమయంలో చెరువు ఒడ్డున చెప్పులు, టిఫిన్ బాక్స్, వాటర్ బాటిల్ ఉండటంతో ఆసామి బొల్లెబోయిన స్వామి వెంటనే వెంకటయ్య భార్యకు ఫోన్ చేయగా ఆమె వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సాయంత్రం కావటంతో చెరువులో మృతదేహం లభించకపోవడం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సమాచారం ఇవ్వడంతో వారు ఆదివారం చెరువులో గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. కాగా మృతుని భార్య కొంగర మల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

# పక్కా గృహాల నిర్మాణం కాంగ్రెస్‌తోనే సాధ్యం



**ప్రజాపక్షం/నెక్కొండ:** పేదవారికి పక్కా గృహాలు నిర్మించే దమ్ము స్తోమత కాంగ్రెస్ పార్టీకి ఉందని నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలోని చంద్రుగొండ లో ఆయన ఇందిరమ్మ గృహాలకు భూమి పూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పక్కా గృహాలు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి పక్కా గృహాలు మళ్లీ కాంగ్రెస్ పార్టీ ఇస్తున్నదని పేదవారికి పక్కా గృహం నిర్మాణం కల్పించే అవకాశం ప్రజలు మాకు ఇచ్చారని ఆయన అన్నారు. రైతులకు రైతు భరోసా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఇచ్చిందని కొందరు పిచ్చి కూతలు కోస్తున్నారని అది వారి అవివేకానికి వదిలేస్తున్నామని ఈ సంవత్సరం వర్షాలు రోహిణి కార్తేలు రావడంతో రైతులు ఎంతో ఆశతో ముందస్తుగా పత్తి గింజలు పెట్టారని కానీ వర్షాలు రావకపోవడంతో పత్తి గింజలు మరొక మళ్లీ పత్తి గింజలు పెట్టడం కోసం రైతులకు సరైన సమయంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా చెల్లించిందని నిజమైన రైతులు అంటుంటే అది జీనించుకోలేని కొందరు వ్యక్తులు తప్పుడు కూతలు కూస్తున్నారని, ఆయన ఘాటుగా విమర్శించారు. రైతు భరోసా వేసినా వేయకపోయినా ఎప్పుడు ఎన్నికలు పెట్టినా మా కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని మా దాటి తట్టుకోలేకనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్, నర్సంపేట నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ లు రావుల హరీష్ రెడ్డి, పాలాయి శ్రీనివాస్, నెక్కొండ మాజీ జెడ్పిటిసి బక్కి కవిత, నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ నర్సంపేట న్యాయ స్థాన ఏజిపి బండి శివకుమార్, నెక్కొండ మార్కెట్ డైరెక్టర్ లు రావుల మహిపాల్ రెడ్డి, మామిళ్ళ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయి కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు పోలిశెట్టి భాను, ఈదునూరి దిలీప్, యువజన నాయకులు బక్కి నరేష్, చంద్రుగొండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోక అనిల్, తంశెట్టి సాంబయ్య, మామిళ్ల చిన్న మల్లారెడ్డి, ఎర్ర విజయేందర్, కుమారస్వామి పాల్గొన్నారు.

# ఎంపి బలరాంనాయక్‌ను కలిసిన హౌసింగ్‌బోర్డు కమిటి

**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి:** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ కాలనీ కమిటి ఆదివారం ఎంపి పోరిక బలరాంనాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధికి సంబంధించి పనులపై కాలనీ కమిటి అధ్యక్షులు కట్ల వెంకన్న ఎంపితో మాట్లాడారు. ఈ సందర్భంగా సమస్యలపై ఎంపి పోరిక బలరాంనాయక్ సానుకూలంగా స్పందించి వారంరోజుల్లో తాను స్వయంగా కాలనీలో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్సీ తక్కళ్ళపల్లి రవీంర్‌రావును కూడా కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తానని కాలనీ కమిటికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలతో కాలనీ కమిటి ప్రధాన కార్యదర్శి జైపాల్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాబు, కాశీం, బాలునాయక్, మల్లారెడ్డి, నర్సిరెడ్డి, యాదగిరి, శ్రీనివాస్ రెడ్డి, అశోక్‌రెడ్డి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



# జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** జులై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని తీగారం గ్రామంలో తెలంగాణ రైతు సంఘం సమావేశం మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా సోమయ్య హాజరై మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే, యజమానులకు లాభం చేకూర్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక డిమాండ్లతో జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మిక, రైతాంగ, ఉద్యోగ సంఘాలు, ప్రజలందరు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నర్సింగ్, నాంపల్లి, కనకచారి, యాదమ్మ, మల్లయ్య, రాజు,యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకే ‘ఆపరేషన్ కగార్’



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** దేశ సంపదను కార్పొరేట్లకు అప్పగించేందుకు ఆపరేషన్ కగార్‌ను ఏర్పాటుచేసి, తక్షణమే ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ అన్నారు. ఆపరేషన్ కగార్ ను ఆపాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో జూన్ 23న ఛలో రాజ్ భవన్ కార్యక్రమం విజయవంతంచేయాలని కోరుతూ వరంగల్ పట్టణంలోని పోచమ్మైదానంలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్ మాట్లాడుతూ మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలన్నారు. అటవీ సంపద, ఖనిజాలు, వనరులు, భూమిలను అంబానీ, అదానీ వంటి బడా కార్పొరేట్లకు అప్పగించే కుట్రలో భాగమే ఆపరేషన్ కగార్ అని విమర్శించారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం జరిపిన క్రూర మావోయిస్టుల హత్యలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో నిష్పక్షపాత విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల సమస్యగా సృష్టించి బూటకపు ఎన్‌కౌంటర్లను చేస్తున్నదన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంస్కృతిక సమస్యగా పరిగణించి చర్చల ద్వారా పరిష్కరించాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యగా చూడటం సరైంది కాదన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు ప్రజలంతా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.మావోయిస్టులపై దాడుల పేరుతో ఆదివాసీలను చంపుతున్నారని విమర్శించారు. సంపదను బడాబాబులకు ఎలా కట్టబెట్టాలన్నదే మోదీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. మావోయిస్టులను సాకుగా చూపి దాడులు చేస్తున్నదన్నారు. మోదీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే మావోయిస్టులతో చర్చలెందుకు జరపడం లేదని ప్రశ్నించారు. చర్చలు జరపకుండా వారిని చంపడం ఫాసిస్టు ప్రభుత్వ లక్షణమని విమర్శించారు. ఈకార్యక్రమంలో నాయకులు, కార్యర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి

డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజారత్నం



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర (డిహెచ్‌పిఎస్) ఉపాధ్యక్షులు రాజ రత్నం డిమాండ్ చేశారు. ఆదివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని రావి నారాయణ రెడ్డి భవన్ లో దళిత హక్కుల పోరాట సమితి డిహెచ్‌పిఎస్ మూడవ జిల్లా మహాసభను ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ మహాసభకు డిహెచ్పిఎస్ జిల్లా నాయకురాలు పొన్నగంటి లావణ్య అధ్యక్షతన జరగగా ముఖ్యఅతిథిగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుకూరి రాజారత్నం హాజరయ్యారు. రాష్ట్రంలో ఉన్న దళిత కుటుంబాలను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తుందని, అట్లాంటి ప్రయత్నాలను మనమందరం తిప్పికొట్టాలని కోరారు. వివిధ మండలాల నుండి ప్రతినిధులు హాజరయ్యారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పైన చర్చించి భవిష్యత్ కార్యక్రమం రూపొందించుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి హెచ్ పి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసపల్లి భద్రయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు. ప్రవీణ్ కుమార్, నేరెళ్ల జోసెఫ్, మహేందర్, కమలాకర్, రవీందర్, రాజమౌళి, సంపత్, రమేష్, రాజేష్, పద్మ, బానమ్మ పాల్గొన్నారు.

# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** యువత డ్రగ్స్ ప్రమాదకర మత్తు పదార్థాలకు బానిస కావద్దని వాటికి దూరంగా ఉండాలని భూపాలపల్లి సిఐ నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా పోలీసు శాఖ తరపున భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ స్టేడియంలో డ్రగ్స్ వ్యసన వ్యతిరేక ప్రచార కార్యక్రమం నిర్వహించి డ్రగ్స్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఆకర్షితులు అవుతున్నారని, డ్రగ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. డ్రగ్స్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యువతరం అనేది దేశ భవిష్యత్తుకు పునాది లాంటిదని,వారు ఏ విధంగానైనా మత్తు పదార్థాలకు బానిసలైతే వారి వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా, సమాజాన్ని కూడా చిద్రం చేస్తుందని అన్నారు. మత్తు పదార్థాలు తాత్కాలిక తృప్తిని కలిగించినప్పటికీ, దీర్ఘకాలికంగా శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలను కలిగిస్తాయని తెలిపారు. యువత జీవిత ప్రయోజనాల్ని గుర్తించుకొని, ఇలాంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండాలని, చదువు, ఉద్యోగం, కుటుంబం వంటి జీవిత పునాదులను మత్తు పదార్థాలు నాశనం చేస్తాయని, డ్రగ్ నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యతగా మారాలి అని తెలిపారు. ఈ డ్రగ్స్ మహమ్మారి నిర్మూలనకు జిల్లా, పట్టణ ప్రజలు సహక రించాలని సీఐ కోరారు.




# జిల్లా స్థాయి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపికలు

జిల్లా క్రీడల శాఖ అధికారి సిహెచ్.రఘు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి:** ఈనెల 25న ఉదయం 8:00 గంటల నుండి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ లో జిల్లా స్థాయి క్రీడల పాఠశాలల ప్రవేశాలకు ఎంపికలు నిర్వహించబడునని జిల్లా యువ జన, క్రీడల శాఖ అధికారిసి హెచ్ రఘు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలో ఉత్తీర్ణత సాదించిన విద్యార్థిని, విద్యార్థు లు జిల్లా స్థాయి పోటీలకు అర్హులని కావున వారు మాత్రమే జిల్లా స్థాయిలో పాల్గొనాలని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలకు వచ్చే విద్యార్థిని విద్యార్థుల తమ వెంట పుట్టిన తేదీ సర్టిఫికేట్, కుల ధృవీకరణ, స్కూల్ కాండక్ట్ సర్టిఫికేట్, పాస్ ఫోటోస్ (5), ఆధార్ కార్డ్ తప్పనిసరిగా తీసుకురాగలరని తెలిపారు. ఇతర మరిన్ని వివరాలకు సిహెచ్. రఘు 9618011096, ఏం శివసాగర్ 8125113132లను సంప్రదించగలని కోరారు.

# ఆనందంలో రైతన్న



## 1.75లక్షల 563 మంది రైతులకు రూ.211.21కోట్ల రైతు బరోసా
## ఖరీఫ్ సాగుకు ముందే ఆర్థిక సహాయం
## రైతులు హర్షం

**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** కరువు నేల జనగామ రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. లక్షా 75వేల 563 మంది రైతుల ఖాతాల్లో 211.21 కోట్ల రూపాయల నిధులు జమ అయ్యాయి. ఖరీఫ్ సాగుకు ప్రారంభంలోనే రైతు బరోసా నిధులు ఖాతాల్లో జమ కావడంతో ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేస్తున్నారు. రుణమాఫీతో పాటు రైతు బరోసా సకాలంలో జమ కావడంలో సన్న, చిన్న కారు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జనగామ జిల్లా ఒకప్పుడు కరువుకు నిలయం. దేవాదుల పుణ్యమా అని ఇప్పుడు పాడి పంటలతో తులతూగుతుంది. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కువగా వరి సాగవుతుంది. జిల్లాలో 3లక్షల 50వేలకు పైగా వ్యవసాయ భూమి ఉండగా 2లక్షల 15వేల ఎకరాల్లో వరి, లక్షా 25వేల ఎకరాల్లో పత్తి, 3వేల 670 ఎకరాల్లో మొక్క జొన్న, 3వేల 500 ఎకరాల్లో కందులతో పాటు ఇతర పంటాలు సాగు చేస్తున్నారు. జనగామలో పత్తి విస్తారంగా దిగుబడి అవుతుండడంతో జిన్నింగ్ మిల్లుల సంఖ్య కూడా పెరిగింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే వరి ఎక్కువగా దిగుబడి అవుతుండడంతో కొనుగోళ్ల కోసం ఒకప్పుడు 99 కేంద్రాలు ఉండగా ఇప్పుడు 200లకు పైగా పెరిగాయి. హైదరాబాద్, భీవండి, సూరత్ తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు ఇప్పుడు ఊరూ బాట పట్టి తమకు ఉన్న కొద్దిపాటి భూమిని చదును చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు.

**211.21 కోట్ల రైతు బరోసా నిధులు జమ**


జిల్లాలో లక్షా 90వేల మందికి పైగా రైతులు ఉన్నారు. శనివారం నాటికి లక్షా 75వేల 563 మంది రైతులకు 211.21 కోట్ల రూపాయల రైతు బరోసా నిధులు వారి ఖాతాల్లో జమ అయ్యాయి. మండలాల వారిగా పరిశీలిస్తే స్టేషన్‌ఘనపూర్ మండలంలో 14వేల 85 మంది రైతులకు 15.57 కోట్లు, చిల్పూరు మండలంలో 12వేల 571 మంది రైతులకు 14.90 కోట్ల రూపాయలు, లింగాలఘనపురం మండలంలో 14వేల 386 మంది రైతులకు 18.08 కోట్లు, రఘునాథపల్లిలో 20వేల 77 మంది రైతులకు 24.76 కోట్ల రూపాయలు, జఫర్‌గడ్‌లో 14వేల 609 మంది రైతులకు 16.39 కోట్లు, బచ్చన్నపేటలో 17వేల 431 మంది రైతులకు 21.77 కోట్లు, జనగామ మండలంలో 15వేల 76 మంది రైతులకు 17.86 కోట్లు, నర్మెటలో 10వేల 430 మందికి 12.51 కోట్లు, తరిగొప్పులలో 8వేల 48 మంది రైతులకు 9.77 కోట్లు, దేవరుప్పులలో 16వేల 558 మంది రైతులకు 20.67 కోట్లు, కొడకండ్లలో 9వేల 792 మందికి 11.80 కోట్లు, పాలకుర్తిలో 22వేల 500 మంది రైతులకు 27.06 కోట్ల రూపాయల నిధులు వారి వారి ఖాతాల్లో జమ అయ్యాయి. ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభమై జులై చివరి మాసం, ఆగస్టు, సెప్టెంబర్ వరకు రైతు బరోసా నిధులు ఖాతాల్లో జమ అయ్యేవి. ఈ ఏడాది మాత్రం ముందస్తుగానే నిధులు ఖాతాల్లో జమ కావడంతో రైతులకు ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది లేకుండా పోయింది.

**ఎరువులు, విత్తనాలకు ఇబ్బంది లేదు : సింగిరెడ్డి సత్తయ్య**




ఈ ఏడాది ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది లేదని పాలకుర్తి మండలం ఎర్రవేను గ్రామానికి చెందీఇన సింగిరెడ్డి సత్తయ్య తెలిపారు. తనకు 5ఎకరాల 24 గుంటల భూమి ఉండగా 33వేల 600 రూపాయల రైతు బరోసా నిధులు తన ఖాతాలో జమ అయ్యాయన్నారు. వాటితోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ఇదే తరహాలో పంటల సాగుకు ముందు రైతు బరోసా నిధులు విడుదల చేస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు.

**సంతోషంగా ఉంది : గాండ్ల రంగయ్య**



ఈ ఏడాది సంతోషంగా ఉందని స్టేషన్‌ఘనపూర్ మండలం శివునిపల్లి గ్రామానికి చెందిన గాండ్ల రంగయ్య తెలిపారు. తనకు 6 ఎకరాల 6 గుంటల భూమి ఉండగా 36వేల 900 రూపాయలు తన ఖాతాలో జమ అయ్యాయన్నారు. వానాకాలం పంటల సాగు సమయానికి రైతు బరోసా నిధులు అందడంతో అప్పులు చేసే అవసరం లేకుండా పోయిందన్నారు. ఎరువులు, విత్తనాలకు ఇవి ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ఈ ఏడాది ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు.

**రైతులు వ్యవసాయ అవసరాలకే వాడండి: కలెక్టక్ రిజ్వాన్ బాష షేక్**



రైతు బరోసా నిధులకు వ్యవసాయ అవసరాలకే వాడాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ రైతులకు సూచించారు. జిల్లాలో లక్షా 75వేల 563 మంది రైతులకు 211.21 కోట్ల రూపాయలు వారి వారి ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. గుంట భూమి ఉన్న రైతులతో పాటు 9 ఎకరాల లోపు రైతుల వరకు నిధులు జమ అయ్యాయన్నారు. రైతులు ఈ డబ్బులు ఎరువులు, విత్తనాలకు మాత్రమే ఖర్చు చేస్తే బాగుంటుందన్నారు. జిల్లాలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా రైతు బరోసా నిధులు జమ అవుతున్నాయన్నారు. యాసంగి వరి ధాన్యం కూడా పూర్తిగా కొనుగోలు చేయడం జరిగిందన్నారు. రైతుల అవసరం మేరకు జిల్లాలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కల్తీ విత్తనాల విక్రయాలను అడ్డుకునేందు టాస్క్‌ఫోర్స్ దాడులు జరుగుతున్నాయన్నారు.

## ముమ్మరంగా ప్రజాపక్షం చేర్పింపు



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రతి అక్షరం ప్రజల కోసం అంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా అక్షర రూపం దిద్దుకున్న ప్రజాపక్షం దినపత్రిక సంవత్సర చందాల చేర్పింపు కార్యక్రమం ముమ్మరంగా సాగుతుంది. ఖమ్మం నగరం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో చేర్పింపు కార్యక్రమం జరుగుతుంది. ఖమ్మంలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ నేతృత్వంలో 50 సంవత్సర చందాలను పూర్తి చేశారు. ఖానాపురం హవేలి పరిధిలో రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి, ఏనుగు గాంధీ నేతృత్వంలో ప్రజాపక్షం చందాల చేర్పింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జిల్లా ఇన్‌చార్జి ఏనుగు వెంకటేశ్వరరావు, ఆయా ప్రాంతాల సిపిఐ బాధ్యులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లిలో డ్రగ్స్‌పై అవగాహన




**ప్రజాపక్షం/వైరా:**మాదకద్రవ్యాలపై ప్రతిఒక్కరూ నిర్మూలనకు ఊహ కృషి చేయాలని వైరా ఎస్ఐ పి.రామారావు అన్నారు. దివారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లిలో డ్రగ్స్ పట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వాడటం వలన జరిగే నష్టాన్ని ఆయన అక్కడ ప్రజలకు వివరించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు, పిల్లల పట్ల శ్రద్ధ పెట్టాలని, యువత మత్తు పదార్థాలకు బానిస అవద్దని అలా పిల్లలను డ్రగ్స్‌కు బానిస కాకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉండేవిధంగా చూడాలని ఆయన కోరారు. అనంతరం అక్కడున్న ప్రజలతో మాదకద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కెయు దూరవిద్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యూకేషన్ (గతంలో ఎస్‌డిఎల్‌సిఈ)లో 2025 2026 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పిజి, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక కాకతీయ యూనిర్శిటి పిజి కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి.గోపి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఏ, బికామ్ జనరల్ , కంప్యూటర్స్, బిబిఏ, బిఎస్‌సి మ్యాథ్స్, బ్యాచ్‌లర్‌ఆఫ్ లైబ్రరిసైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా పిజి కోర్సుల్లో ఎంఏ తెలుగు, ఇంగ్లీష్, హిందీ, సంసకృతం, ఎకనామిక్స్, హిస్టరీ, రూరల్ డెవలప్‌మెంట్, సోషియాలజీ, హెచ్‌ఆర్‌ఎం, మాస్‌కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం, సోషల్‌వర్క్, ఎంకామ్, ఎంఎస్‌సి సైకాలజీ, ఎన్విరాన్మెంట్ సైన్స్, మాథ్స్, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంసిఏ, డిప్లమా, ఓరియన్‌టేషన్ మొత్తం 43 రకాల కోర్సుల్లో ప్రవేశాలకు ధరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా జూలై 10 వ తేదీ వరకు స్థానిక పిజి కళాశాల అధ్యయన కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు స్థానిక అధ్యయన కేంద్రంలోని కాని సెల్ నెంబర్ 8008811998 ను, కేయూ దూరవిద్య వెబ్‌సైట్ ఎస్‌డిఎల్‌సిఈ కేయూ. కో. ఇన్ లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు. యూజిసి డిస్టెన్స్ ఎడ్యూకేషన్ బోర్డు, అన్‌లైన్ డిస్టెన్స్ లెర్నింగ్ సంస్థల నిబంధనలు, యూనిర్శిటీ చట్టం మేరకు తరగతులు ఉంటాయని తెలిపారు.

## మాదకద్రవ్య రహిత సమాజ స్థాపనే లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మాదకద్రవ్య రహిత సమాజస్థాననే లక్ష్యంగా ప్రజలు, యు వ త కలిసి రావాల ని టూటౌన్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక కవిత డిగ్రి కళాశాలలో రేవతి సెంటర్‌కు చె ందిన యువతకు అంతర్జాతీయ మాదకద్రవ్యల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురుష్కరించుకుని నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మత్తుపదార్థల అలవాటు మెదట సరదాగా ప్రారంభమై తరువాత మత్తుకు బానిసలను చేస్తుందన్నారు. గతంలో సిగరెట్, మద్యంతో సరిపెట్టుకునే యువత నేడు నిషా కోసం గంజాయి, మాదకద్రవ్యల భారిన పడి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణ నియంత్రించేందుకు నషాముక్త్ భారత్ అభియాన్ ద్వారా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు, వాటివలన కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కలిగించేందుకు పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## 'ఇంటికో మనిషి శాఖకో బండితో కదలిరండి'



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఈ నెల26వ తేదీన పెద్దతండలో నిర్వహించనున్న సిపిఐ 14వ మండల మహాసభకు ఇంటికో మనిషి శాఖకో బండి చొప్పున కామ్రేడ్స్ కదలి రావాలని ఆ పార్టీ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వ రంగల్‌క్రాస్‌రోడ్‌లో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ మహాసభ ఉదయం తొమ్మిదిగంటలకు ప్రారంభం కానుందన్నారు. దీనికి పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారన్నారు. కావున కామ్రేడ్స్ పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, మండల సమి తి సభ్యులు దండి రంగారావు, వెంపటి సురేందర్, 30వ డివిజన్ కార్యదర్శి ,31వ డివిజన్ సహాయ కార్యదర్శి మేళ్లచెర్వు రవి పాల్గొన్నా రు.

## అంబేద్కర్ విగ్రహాన్ని పగులగొట్టిన దుండగులు





**ప్రజాపక్షం/వైరా:**వైరా మండలం సిరిపురం గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అంబేద్కర్ విగ్రహాన్ని పగులగొట్టారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున చేరుకొని విగ్రహాన్ని పగులగొట్టిన దుండగులను శిక్షించాలని ఆందోళన నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామారావు మాట్లాడుతూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని పగులగొట్టిడం దుర్మార్గమని, విగ్రహాన్ని పగులగొట్టిన వారిని ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని అన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నానని తెలిపారు.

## వైద్య శిబిర నిర్వహణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. ఆదివారం సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండాల మండలం ముత్తాపురం గ్రామంలో గుండాల వార్తా వేదిక ప్రెస్‌క్లబ్ సారధ్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రుద్ర గౌతమ్ నరేష్ ఎండి ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్యం బాగుంటేనే అందరూ ఆర్థికంగా బాగుంటారనే ఉద్దేశంతో సురక్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ రుద్రగౌతమ్ నరేష్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 160 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్‌కుమార్, మేనేజర్ సైదులు, మాజీ జెడ్పిటిసి దొండపాటి రమేష్, పిఆర్‌వో నవీన్, ఆర్‌ఎంపిలు నర్సింహారావు, ఫార్మసీ సిబ్బంది ప్రేమ్, ఆసుపత్రి సిబ్బంది మున్ని, ఉమా మాధురి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ నూతన మండల కమిటీ ఎన్నిక




**ప్రజాపక్షం/జూలూరుపాడు:**సిపిఐ జూలూరుపాడు 13వ మహాసభ స్థానిక ఎల్లంకి గార్డెన్‌లో నిర్వహించారు. నూతనంగా మండల కార్యదర్శిగా గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కారర్యదర్శిగా ఎస్‌కె నాగుల్ మీరాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు 25 మంది కార్యవర్గ సభ్యులను 71 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి గుండె పిన్ని వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి ఎస్‌కే నాగుల్ మీరా మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.

## అర్హులైన పేదలు ఆందోళన చెందొద్దు

తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఏదులాపురం మున్సిపాలిటీలో పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:**అర్హులు ఆందోళనచెందవద్దని దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారపౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురంమున్సిపాలిటీలో ముమ్మరంగా పర్యటించారు. ఇందులో భాగంగా నాయుడుపేట జంక్షన్ వద్ద రూ.4కోట్లతో ఖమ్మంమహబూబాద్ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులకు, పెద్దతండలో ఖమ్మంసూర్యపేట ఆర్‌అండ్‌బిరోడ్డు నుండి శ్రీ యోగానందసాయి ఆశ్రమం , చల్లపల్లి గార్డెన్ వరకు రూ.కోటీ 50లక్షలతో నిర్మించనున్న బి.టిరోడ్డు నిర్మాణ పనులకు, గుదిమల్ల వాటర్ ట్యాంక్ నుంచి బోడగుట్ల డొంక వరకు రూ.కోటి21లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు...సంవత్సరంన్నర కాలంగా సంక్షేమం, అభివృద్ధిని సమానంగా అమలు చేస్తున్నామన్నారు. పేదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. అర్హులైన పేదలందరికీ తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు అందించే బాధ్యత తాను తీసుకుంటనన్నారు. రేషన్‌కార్డు ఉన్న పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. ఏదులాపురంమున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ యాకోబ్, ఇఇ వి. యుగంధర్, ఆర్డీఓ నరసింహారావు, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మంత్రిక్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు ధరావత్ రామ్మూర్తి నాయక్, బండి జగదీష్, అజ్మీర అశోక్‌నాయక్, మండల అధ్యక్షుడు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు రానేరు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## వైరా మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు

డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేయాలి

సిపిఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రా బాబు




**ప్రజాపక్షం/వైరా:**వైరా మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు రూ.100కోట్లు కేటాయించి డ్రైనేజీ రహదారులు అభివృద్ధి చేసి మౌళిక వసతులు కల్పించాలని సిపిఐ వైరా నియోజకవర్గ ఇంచార్జి యరార బాబు డిమాండ్ చేశారు. ఆదివారం షేక్ షరీఫ్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మహాసభలో ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ గ్రామపంచాయతీ నుండి వైరా మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత మున్సిపాలిటీలో చుట్టుప్రక్కల అనేక గ్రామపంచాయతీలను విలీనం చేశారని వైరా పట్టణంతో పాటు విలీన గ్రామాలు సరైన డ్రైనేజీ వ్యవస్త లేక వర్షాకాలంలో వరద రహదారులపై వచ్చి ఇళ్లలోకి వస్తున్నాయని వాటి వలన మురుగు చేరి దోమలు వచ్చి ప్రజలు అనేక రోగాలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారరు. పట్టణంలో పెరిగిన ట్రాఫిక్ రద్దీకి సరిపడా రహదారులు లేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. మున్సిపాలిటీ వర్కర్లకు నెలనెలా జీతాలు రాక కుటుంబాలు అవస్థలు పడుతున్నారని నెల నెల జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో మున్సిపాలిటీలో సిపిఐ పార్టీ బం ఉన్న వార్డుల్లో పోటీ చేసి సత్తా చాలాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వైరా పట్టణ సమస్యల పరిష్కారం కొరకు భవిష్యత్తులో పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.ఈ మహాసభలో సిపిఐ వైరా మండల కార్యదర్శి పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, మూట కొండ, రామకృష్ణ, గారపాటి అశోక్, మోర్ శ్రీనివాసరావు, మోర్ ప్రభాకర్, మోరు నాని, రాయి రవి తదితరులు పాల్గొన్నారు. నూతన పట్టణ కార్యదర్శిగా మిట్టపల్లి రాఘవరావు, పట్టణ సహాయ కార్యదర్శిగా గారపాటి అశోక్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే అజెండాగా కార్యాచరణ

సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్

ఘనంగా పట్టణ 6వ మహాసభ




**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా కార్యాచరణ రూపొందించనున్నట్లు సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. పాలక వర్గాలు ప్రజలను విస్మరించి పాలన సాగిస్తున్నాయని ఆరోపించారు. ఖమ్మం త్రీటౌన్ ఏరియా ఆరవ మహాసభ ఆదివారం జెట్టి రంగారావు ప్రాంగణం (గోల్డ్ కాంప్లెక్స్ గాంధీచౌక్ )లో భూక్యా రవీందర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సురేష్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా పట్టణీకరణ పెరిగిందని ముఖ్యంగా ఖమ్మం నగర జనాభా గణనీయంగా పెరిగి ఐదు లక్షలకు చేరుకుందన్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగడం లేదన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు జీవనోపాధ కోసం ఖమ్మం నగరానికి వలస వచ్చారని వలస వచ్చిన వారికి ఉపాధి కల్పనలో సైతం ప్రభుత్వం వైఫల్యం చెందిందని సురేష్ తెలిపారు. పట్టణ పేదలకు సైతం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. నివాస స్థలాలు ఉండి ఇండ్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇంటి పథకానికి లబ్దిదారులుగా ఎంపిక చేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.భారత కమ్యూనిస్టు పార్టీ ఈ ఏడాది శత ఆవిర్బావ దినోత్సవాన్ని జరుపుకుంటుందని ఈ దేశంలో కార్మికులు, పేదలు, బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ఏకైక పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సిపిఐ శత సంవత్సర ముగింపు కార్యక్రమాన్ని డిసెంబర్ 26న ఖమ్మంలో జరుపుకోనుందన్నారు. ఈ సందర్భంగా 20 దేశాల ప్రతినిధులు హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. మహాసభల్లో ప్రజా సమస్యలను చర్చించి వాటి పరిష్కారానికి పోరాట కార్యాచరణ రూపొందించుకోనున్నట్లు ఆయన తెలిపారు.ఈ మహాసభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లైమెంట్, మహ్మద్ సలాం, మిడికంటి చిన్న వెంకటరెడ్డి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు బోజడ్ల సూర్యం, త్రీటౌన్ కార్యదర్శి నూనె శశిధర్, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## యాదవులకు సముచిత స్థానం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో కీలక పాత్ర వహించిన యాదవులకు రాజకీయ ప్రాతినిథ్యంతో పాటు సముచిత స్థానం కల్పించాలని జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు తెలిపారు. అఖిల భారత యాదవ మహాసభ, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో గొర్రెల సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల సమావేశం మేకల నాగేశ్వరరావు అధ్యక్షతన ఆదివారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని రామకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ , గొర్రెల పెంపకందారుల సంఘం నాయకులు మాట్లాడుతూ గొర్రెల సంఘాలను ఏర్పాటు చేసి యాదవులకు గొర్రెల, మేకల పెంపకందారుల ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కూడా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గతం లో యాదవులను గుర్తించి రాజకీయ ప్రాధాన్యత కల్పించింది కూడా కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. గత ఎన్నికల్లోకాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటులో యాదవులు కీలక ప్రాత పోషించారని అటువంటి యాదవులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించకుండా మొండి చేయి చూపించారన్నారు. మంత్రి పదవులతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పదవులను యాదవులకు ఇవ్వాలన్నారు. గతంలో డిసిసిబి చైర్మన్‌గా యాదవులకు అవకాశం కల్పించారన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు , పలువురు నాయకులు పాల్గొన్నారు.

## అధికారం ఉన్నా.. లేకున్నా పేదల పక్షాన సిపిఐ పోరాటం




**ప్రజాపక్షం/మణుగూరు:**దేశంలో అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసేది కమ్యూనిస్టు పార్టీనని,ఆ పార్టీలో కార్మికులు, కర్షకులు, పేద, బడుగు బలహీన వర్గాలు పనిచేస్తున్నాయని వారి హక్కుల కోసం నిరంతరం సిపిఐ పనిచేస్తుందన్నారు. ఆదివారం పివి కాలనీలోని ఏఐటియుసి కార్యాలయంలో సిపిఐ కూనవరం ఎంసి క్వార్టర్స్ పివి కాలనీ మూడు శాఖ సమావేశాలు, భావనకుంటలోని గ్రామ శాఖ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ దేశంలో అధికారం లేకున్నా 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని, పేద ప్రజల కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు కొనసాగించామని, కార్మిక హక్కుల కోసం అనేక ఉద్యమాలు చేసి కార్మిక హక్కులు సాధించుకున్నామన్నారు. సింగరేణి కార్మికుల హక్కుల కోసం యూనియన్ కొమరయ్య నాయకత్వంలో పోరాడి కార్మిక సంక్షేమ హక్కులు సాధించుకోగలిగామని వారు గుర్తు చేశారు. ఈ నెల 26వ తేదీన మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో పట్టణ, మండల మహాసభ జరగనుందని, ఈ మహాసభకు కార్మికులు పెద్ద ఎత్తున కార్మికుల తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్న లక్ష్మి కుమారి, మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి దుగ్యాల సుధాకర్, ఏఐటీయూసీ మణుగూరు బ్రాంచ్ కార్యదర్శి వై రాంగోపాల్, ఉపాధ్యక్షులు రాంనర్సయ్య, ఏఐటియుసిమణుగూరు మండల కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు,తదితరులుపాల్గొన్నారు.

**బాంబె కాలనీ సిపిఐ శాఖ కమిటీ...**

కొయ్యడి శేఖర్ శాఖ కార్యదర్శి గూడూరు కృష్ణ, సహాయ కార్యదర్శి కమిటీ సభ్యులు కె. రవి, జి.సంతోష్, కె. నాగేంద్రబాబు లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**పివి కాలనీ మల్లారం సిపిఐ శాఖ కమిటీ..**

దాట్ల సందీప్ శాఖ కార్యదర్శి, రత్నం శివకుమార్ సహాయ కార్యదర్శి, కమిటీ సభ్యులు కొత్తపల్లి సందీప్ జి.శరత్, ఎండి. ఇమామ్ లనుఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

**ఎంసి క్వాటర్స్ ఏరియా సిపిఐ శాఖ కమిటీ..**

ఈసం శ్రీనివాస్ శాఖ కార్యదర్శి, హుసేన్ సహాయ కార్యదర్శి, కమిటీ సభ్యులు కె. రవి, నక్క రాజేందర్, ఎం. పద్మావతి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. బాపనకుంట గ్రామ శాఖ కార్యదర్శి చల్ల కాంతారావు, గౌరవ అధ్యక్షుడిగా చింతల దశరథం కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

## పలు కుటుంబాలకు మాజీ మంత్రి పువ్వాడ పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాల్లో పర్యటించి పలు కుటుంబాలను పరామర్శించారు. ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం నగరంలోని 47వ డివిజన్ బిఆర్‌ఎస్ నాయకుడు ఇటీవల గుండెపోటుతోమరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా బిఆర్‌ఎస్ నాయకుడు పిట్టల శ్రీనివాసరావు ఇటీవల కాలు శస్త్రచికిత్స చేయించుకోగా వారిని అజయ్‌కుమార్ పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. 32వ డివిజన్‌కు చెందిన ఆకారపు చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆ కుటుంబాన్ని పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించారు. చంద్ర య్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాస నగర్‌కు చెందిన వెంపటి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు ఇటీవల రోడ్డు ప్ర మాదంలో గాయపడగా వారి ఇంటికి వెళ్లి పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాద ంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మేడారపు నాగాచారిని పువ్వాడ అజయ్‌కుమార్ పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. రఘునాథపాలెం మండలం రేగుల చలక గ్రామానికి చెందిన కేతినేని వెంకటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. పువ్వాడ అజయ్‌కుమార్ వారి స్వగృహంకు వెళ్లి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మి దేవి పల్లి మండలం బిఆర్‌ఎస్ నాయకుడు మాజీ ఎంపిపి కొట్టి వెంకటేశ్వర్లు మనవడు ప్రద్యుమ్, మనవరాలు ప్ర జక్త నూతన వస్త్రాలంకరణ వేడుకల్లో మాజీ ఎంఎల్‌ఏలు , కొత్తగూడెం ము న్సిపల్ వైస్ చైర్మన్ దామోదర్‌తో కలిసి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు , తదితరులు పాల్గొన్నారు


## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ముఖ్యమంత్రి, మంత్రి చిత్ర పటాలకు పాలాభిషేకం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా వి. వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ రావూరి సైదబాబు ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ అల్లిపురంలో రైతులతో కలిసి సంబురాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా యరగర్ల హన్మంతరావు, రావూరి సైదబాబు లు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా రూ. 21వేల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడుల కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రైతు భరోసా నిధులను కూడా రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఇప్పటి వరకు తొమ్మిది ఎకరాల లోపు రైతులకు రూ. 8 వేల కోట్లు జమ చేసిందన్నారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతి ఎకరాకు ప్రభుత్వం రైతుబంధు, రైతు భరోసా పథకం క్రింద రూ. 12వేలు ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. సాగుకు రైతులు సిద్ధమవుతున్న నేపథ్యంలో ఎరువులు, విత్తనాల కోసం ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నేతృత్వంలో రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు జిల్లాలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లకు రైతుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, రైతులు , తదితరులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్య నియంత్రణకు యువత కృషి చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:**మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలని కారేపల్లి ఎస్ఐ గోపి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో కారేపల్లి సెంటర్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు.

# క్రీడ



## ఏసికూనపై సూపర్ విక్టరీ

### కెనడాకు పొట్టి ప్రపంచకప్ బెర్త్

వచ్చే ఏడాది జరుగబోయే పురుషుల టీ20 వరల్డ్ కప్ పోటీలకు మరో జట్టు అర్హత సాధించింది. అమెరికా రీజినల్ నుంచి కెనడా జట్టు బెర్తు ఖరారు చేసుకుంది. ఆదివారం జరిగిన క్వాలిఫయింగ్ ఫైనల్స్‌లో విజయంతో మెగా టోర్నీకి క్వాలిఫై అయింది. మొత్తంగా వరల్డ్ కప్ బరిలో ఉన్న 13వ జట్టుగా నిలిచింది కెనడా. ఆదివారం జరిగిన అమెరికా రీజినల్ ఫైనల్లో బహామాస్‌పై నికోలస్ కిర్టన్ బృందం సూపర్ విక్టరీ కొట్టింది. తొలుత బహామాస్‌ను 57కే పరిమితం చేసిన కెనడా.. స్వల్ప లక్ష్యాన్ని కెనడా 5.3 ఓవర్లలోనే ఛేదించింది. ఈ లీగ్‌లో వరుసగా నాలుగో విజయంతో వరల్డ్ కప్ టోర్నీకి ఎంపికైంది నికోలస్ టీమ్. పురుషుల టీ20 వరల్డ్ కప్ 2026 పోటీలకు భారత్, శ్రీలంకలు సయుక్తంగా ఆతిథ్యమిస్తున్న విషయం తెలిసిందే. ఈ టోర్నీకి ఇప్పటికే 12 జట్లు క్వాలిఫై అయ్యాయి. టీమిండియా, లంకతో పాటు ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లాండ్ ఐర్లాండ్ న్యూజిలాండ్ పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, యూఎస్ఏ, వెస్టిండీస్.. వరల్డ్ కప్ రేసులో నిలిచాయి.
మరో ఏడు జట్లకు బెర్తులు ఖరారు కావాల్సి ఉంది. వీటిలో యూరోపియన్ క్వాలిఫయర్ ద్వారా 2, ఆఫ్రికా క్వాలిఫయర్‌లో ఫైనల్ చేరిన రెండు జట్లతో పాటు ఆసియా యూఏపీ క్వాలిఫయర్‌లోని టాప్3 జట్లు వరల్డ్ కప్ పోటీలకు అర్హత సాధిస్తాయి.

## అరుదైన జబ్బుతో 23 ఏళ్ల పోరాటం

### మాజీ పేసర్ కన్నుమూత



ఇంగ్లాండ్ క్రికెట్ ఒక దిగ్గజ ఆటగాడిని కోల్పోయింది. పేసర్‌గా ఆ జట్టుకు చిరస్మరణీయ సేవలందించిన మాజీ పేసర్ డేవిడ్ వాలెంటైన్ లారెన్స్ కన్నుమూశాడు. అరుదైన మోటార్ న్యూరాన్ జబ్బుతో బాధపడుతున్న లారెన్స్ ఆదివారం తుదిశ్వాస విడిచాడు. 23 ఏళ్లుగా ఎంఎన్‌డీతో పోరాడిన లారెన్స్ 61 ఏళ్ల వయసులో మరణించాడు. ఆయన మృతి పట్ల ఇంగ్లాండ్ క్రికెట్ బోర్డు విచారం వ్యక్తం చేసింది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసింది.
మోటార్ న్యూరాన్ డిసీజ్ అనేది ప్రాణాంతకమైనది. ఇది ఆయుష్షను తగ్గించే ఒక రకమైన న్యూరలాజికల్ డిసీజ్. కండరాలను బలహీనం చేసే ఈ జబ్బు కొన్ని నెలల్లో తీవ్రంగా మారుతుంది. ఈ వ్యాధి కారణంగా చక్రాల కుర్చీకే పరిమితమైన ఆయన 61 ఏళ్ల వయసులో కన్నుమూశాడు. 1964 జనవరి 28న జన్మించిన లారెన్స్ గ్లౌసెస్టర్‌షైర్ తరపున ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడాడు. 170 మ్యాచుల్లో 477 వికెట్లు తీసి సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు లారెన్స్. పేస్ సంచలనంగా మారిన అతడు 1988లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. అప్పటి నుంచి 1992 మధ్య ఈ పేసర్ ఐదు టెస్టులు మాత్రమే ఆడాడు. కానీ, తన సంచలన ప్రదర్శనతో ఇంగ్లండ విజయాల్లో కీలక పాత్ర పోషించాడు లారెన్స్. 1991లో వెస్టిండీస్‌పై 5 వికెట్ల ప్రదర్శన కనబరిచాడీ పేస్ గన్. ఆ మ్యాచ్‌లో డేంజరస్ వివ్ రిచర్డ్స్ వికెట్ తీసింది ఆయనే. ఆ టెస్టుతో ఒక్కసారిగా హీరో అయిన లారెన్స్ ఆశ్చర్యంగా ఆటకు దూరమయ్యాడు. న్యూజిలాండ్ పర్యటనలో వెల్లింగ్టన్ టెస్టు ఆడుతుండగా ఆయన మోకాలికి గాయమైంది. అయితే.. వైద్య పరీక్షల్లో ఆయనకు మోటార్ న్యూరాన్ డిసీజ్ ఉందని తేలింది. దాంతో, సర్జరీ అనంతరం లారెన్స్ ఆటకు దూరమయ్యాడు.
'మోటార్ న్యూరాన్ డిసీజ్‌తో పోరాడుతూ డేవిడ్ మరణించారనే విషయాన్ని మీకు తెలియజేస్తున్నందుకు చాలా బాధగా ఉంది. ఆయన ఒక స్ఫూర్తిదాయకమైన వ్యక్తి. మైదానం వెలుపల ఆయన చాలా ప్రశాంతంగా ఉండేవారు. ఇప్పుడు ఆయన మనమధ్య లేరు. ఇవి మా కుటుంబానికి బాధాకరమైన క్షణాలు' అని లారెన్స్ ఫ్యామిలీ ఒక ప్రకటన విడుదల చేసింది.

## బ్రూక్ 12వ హాఫ్ సెంచరీ..



సొంతగడ్డపై భారత జట్టుతో హెడింగ్లేలో జరుగుతున్న తొలి టెస్టులో హ్యారీ బ్రూక్(57 నాటౌట్) అర్ధ శతకంతో రాణించాడు. ప్రసిధ్ కృష్ణ, సిరాజ్‌ల విజృంభణతో మూడో రోజు తొలి సెషన్‌లో సహచరులు వరుసగా పెవిలియన్‌కు క్యూ కుడుతున్నా .. ఓపికగా ఆడిన బ్రూక్ జట్టు స్కోర్ 300 దాటించాడు. వికెట్ కీపర్ జేమీ స్మిత్(29 నాటౌట్)తో కలిసి విలువైన భాగస్వామ్యం నెలకొల్పాడు. భారత బౌలర్లను కాచుకున్న ఈ ద్వయం ఆరో వికెట్‌కు 51 రన్స్ రాబట్టింది. దాంతో, లంచ్ సమయానికి ఆతిథ్య జట్టు 5 వికెట్ల నష్టానికి 327 పరుగులు చేసింది. ఇప్పటికీ ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 144 రన్స్ వెనకబడే ఉంది.
రెండో రోజు టీమిండియాను త్వరగా ఆలౌట్ చేసిన ఇంగ్లాండ్ మూడో రోజు తొలి సెషన్‌లోనే కష్టాల్లో పడింది. సంచరీ వీరుడు ఓలీ పోప్(106)ను ప్రసిధ్ కృష్ణ ఔట్ చేసి ఆతిథ్య జట్టుకు షాకిచ్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ బెన్ స్టోక్స్(20) క్రీజులో పాతుకుపోవాలనుకున్నాడు. ప్రసిధ్, బుమ్రా, సిరాజ్‌లను కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బ్యాటు ఝులిపించలేకపోయిన స్టోక్స్.. నిదానంగా హ్యారీ బ్రూక్(57 నాటౌట్) అండగా స్కోర్‌బోర్డును నడిపించాడు. అయితే.. సిరాజ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చి ఐదో వికెట్‌గా వెనుదిరిగాడు స్టోక్స్. దాంతో, 276 వద్ద సగం వికెట్లు కోల్పోయింది ఆతిథ్య జట్టు. ఆ పరిస్థితుల్లో క్రీజులోకి వచ్చిన వికెట్ కీపర్ జేమీ స్మిత్(29 నాటౌట్) ధాటిగా ఆడాడు. జడేజా ఓవర్లో సింగిల్ తీసిన బ్రూక్ టెస్టుల్లో 12వ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

# ఫోకస్ ఆరోగ్యం






వర్షాకాలం తన వెంటే అనేక రకాల రుగ్మతలను కూడా తీసుకొస్తుంది. మలేరియా, కలరా, డెంగీ, చికున్‌గున్యా, ఇతర ప్రాణాంతక వ్యాధుల వంటి అనేక ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతుంది. వానాకాలం వేధించే వ్యాధుల్లో ప్రధానమైనవి...

## వర్షాకాలం వేధించే వ్యాధులు

**డెంగీ..**

వర్షాకాలంలో వచ్చే అత్యంత సాధారణ వ్యాధి డెంగీ. ఇది టైగర్ దోమ ద్వారా వ్యాపిస్తుంది. ఈ దోమల కాటు నుండి రక్షించుకుంటే, ఈ వ్యాధి బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. ఈ వ్యాధి సోకిన వారిలో అధిక జ్వరం, శరీరం వాపు, దద్దుర్లు, తలనొప్పి, తల్ల రక్తకణాల క్షీణత వంటి లక్షణాలు ఉంటాయి.

**చికున్‌గున్యా..**

చికున్‌గున్యా అనేది నిలిచిపోయిన నీటిలో జన్మించే దోమల వల్ల వస్తుంది. ఈ దోమలు ఓవర్ హెడ్ ట్యాంకులు, కూలర్లు, మొక్కలు, పాత్రలు, నీటి పైపులలో కనిపిస్తాయి. ఈ వ్యాధి ఏడిస్ అల్బోపిక్టస్ అనే పులి వల్ల వస్తుంది. తీవ్రమైన కీళ్ల నొప్పి, చలి, అధిక జ్వరం, అలసట తదితర లక్షణాలతో రోగులు బాధపడతారు.

**మలేరియా:**

వర్షాకాలంలో అత్యంత సాధారణ వ్యాధి ‘మలేరియా‘. వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల దోమల వల్ల వ్యాపిస్తుంది, ఎందుకంటే వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వల్ల దోమలు వృద్ధి చెందడానికి ఇది ఒక మంచి ప్రదేశం. అధిక జ్వరం, ఒళ్ళు నొప్పులు, శరీర చలి, చెమటలు పట్టడం, తీవ్రమైన రక్తహీనత వంటి లక్షణాలు ఉంటాయి.

**కలరా..**

వర్షాకాలంలో వ్యాప్తి చెందే మరో సాధారణ వ్యాధి కలరా. ఈ వ్యాధి కలుషితమైన ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల వస్తుంది. పరిశుభ్రత సరిగా లేకపోవడం కూడా దీనికి కారణమవుతుంది. కలరాకు తక్షణ చికిత్స అవసరం ఎందుకంటే ఇది గంటల్లోనే మరణానికి దారితీస్తుంది. ఈ వ్యాధి గ్రస్థుల్లో తక్కువ రక్తపోటు, దాహం, కండరాల తిమ్మిరి, వేగవంతమైన హృదయ స్పందన రేటు, పొడి శ్లేష్మ పొర, చర్మ స్థితిస్థాపకత కోల్పోవడం తదితర తీవ్రమైన లక్షణాలు కనిపిస్తాయి.

**టైఫాయిడ్..**

టైఫాయిడ్ అనేది వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే అంటువ్యాధి. ఈ వ్యాధి సాధారణంగా కలుషితమైన ఆహారం, నీటి వల్ల వస్తుంది. దీర్ఘకాలిక అధిక జ్వరం, బలహీనత, కడుపు నొప్పి, మలబద్ధకం, తలనొప్పి, వాంతులు ఈ వ్యాధి లక్షణలు.

**వైరల్ ఫీవర్..**

ఇది ఏడాది పొడవునా ఒక సాధారణ వ్యాధి కానీ వర్షాకాలంలో ఇది ఎక్కువగా కనిపిస్తుంది. జ్వరం, అలసట, తలతిరగడం, బలహీనత, తీవ్రమైన చలి, కండరాలు, శరీరం, కీళ్ల నొప్పులు తదితర లక్షణాలు ఉంటాయి.



**విరేచనాలు..**

వర్షాకాలంలో అతిసారం అనేది అత్యంత సాధారణ ఆరోగ్య సమస్యలలో ఒకటి. ఇది తాత్కాలిక పరిస్థితి నుండి ప్రాణాంతకం వరకు ఉంటుంది. అపరిశుభ్రమైన ఆహారం, నీటిని తీసుకోవడం వల్ల ఇది సంభవించవచ్చు.

**ఇన్‌ఫ్లుయెంజా..**

ఇది సాధారణంగా వాతావరణంలో మార్పు, ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గుల కారణంగా వస్తుంది. ఈ అనారోగ్యం నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవాలి ఎందుకంటే ఇది వైరల్ ఇన్ఫెక్షన్‌గా మారి ఒకరి నుండి మరొకరికి వ్యాపిస్తుంది. జ్వరం, కండరాలు నొప్పిగా ఉండటం, చెమటలు పట్టడం, తలనొప్పి, ముక్కు దిబ్బెడ, గొంతు నొప్పి, పొడి, నిరంతర దగ్గు ఈ వ్యాధి లక్షణాలు.

**లెప్టోస్పిరోసిస్..**

ఇది జంతువుల నుండి మానవులకు సంక్రమించే చాలా అసాధారణమైన బాక్టీరియల్ ఇన్ఫెక్షన్. మీకు ఏవైనా బహిరంగ గాయాలు లేదా కోతలు ఉంటే, ఈ వ్యాధి, ఇతర ఇన్ఫెక్షన్లు రాకుండా ఉండటానికి బయటకు వెళ్ళేటప్పుడు వాటిని కప్పి ఉంచడం మంచిది. వర్షాకాలంలో, చర్మం నీరు నిలిచిపోయే అవకాశం ఉండటం వల్ల ఇది సంభవించవచ్చు. అధిక జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పులు, కడుపు నొప్పి, కళ్లు ఎర్రబారడం, చర్మంపై దద్దుర్లు, విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తాయి.
ఇవేగాక, ఇన్‌ఫెక్షన్లు కూడా సోకడం పరిపాటి. అందుకే, వర్షాకాలంలో చాలా జాగ్రత్తగా ఉండాలి. ప్రత్యేకించి దోమల నుంచి రక్షణ పొందే మార్గాలను అనుసరించాలి. అత్యధిక శాతం వ్యాధులు దోమల వల్ల లేదా అపరిశుభ్రత వల్ల సోకుతాయి కాబట్టి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## పీడిత ప్రజల పక్షాన పోరాటం

### సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** పీడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. సిపిఐ వేంసూరు మండల మూడో మహాసభ రామలక్ష్మి, రంజాన్ బి, మారయ్యల అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముందుగా సిపిఐ జెండాను పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సింగ్ నరసింహారావు ఆవిష్కరించారు. మహాసభకు ముఖ్య అతిథిగా బాగం హేమంతరావు హాజరై మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి, బడుగు, బలహీన వర్గాలు, పీడిత ప్రజల పక్షాన నిరంతరం పోరాడే పార్టీ సిపిఐ అన్నారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్ముతుందని, ధరల పెరిగిపోయి సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడుతుంటే, యుద్ధం పేరుతో దేశాన్ని, మతం పేరుతో దేశ ప్రజలను విచ్ఛిన్నం చేసి కులాలు, మతాలుగా విభజించి దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తుందని భాగం విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించి, ఉపాధిహామీ పథకాన్ని విచ్ఛినం చేసేందుకు కుట్రపన్నుతున్నారన్నారు. మోదీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికవర్గాన్ని, రైతురంగాన్ని మహిళారంగాన్ని, యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడం లేదని, ప్రజల్లో వ్యతిరేకత రాకముందే సిఎం రేవంత్‌రెడ్డి ప్రజాసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టాలని బాగం హేమంతరావు కోరారు. మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు సింగ్ నరసింహారావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ మాట్లాడారు. టౌన్‌కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, మండల కార్యదర్శి యోబు, పిల్లి భాస్కర్, మహిళా సమాఖ్య డివిజన్ నాయకులు ఎస్‌కె రంజాన్‌బి, ఎం.రామలక్ష్మి, సిపిఐ నాయకులు ఎస్‌కె లాల్, మహమ్మద్, లోక వెంకటేశ్వర సామ్రాజ్యం, వెంకటమ్మ, అజయ్, వెంకటేశ్వరావు, పిల్లి బుచ్చాలు, సత్యవతి, పిట్ట వెంకటేష్, అంజమ్మ, తుమ్మల శీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలపై నిరంతర ఉద్యమాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ్మా



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** ప్రజా సమస్యలపై సిపిఐ నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్ నరసింహహ్మా అన్నారు. గద్వాల జిల్లా కేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో బి. ఆశన్న అధ్యక్షతన సిపిఐ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి బాల నరసింహ్మా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ పాలనలో దేశం ధనవంతుల చేతులోకి వెళ్లి, ప్రజలు మరింత పేదలుగా మారుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సమగ్ర అభివృద్ధిని, ప్రజల జీవితాలను గాలికొదిలేసి కేవలం మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచకుండా, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కొద్ది మంది పెట్టుబడిదారుల ప్రయోజనాలకోసం చట్టాలు చేయడం అంటే దేశానికి భవిష్యత్ లేకుండా చేయడమేనన్నారు. ప్రభుత్వ రంగాలను బాగు చేయకుండా, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా ప్రైవేటీకరణ చేయడమంటే అత్యధిక జనాభా, పేద వర్గాలున్న ఈ దేశం ఎట్లా అభివృద్ధి చెందుతుందని ప్రశ్నించారు. అందుకే ప్రజలు, సామాన్యుల కోసం నిరంతరం త్యాగాలు, పోరాటాలు చేసే కమ్యునిస్టులను బలపరచినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు బలంగా ఉండుంటే, పెట్టుబడిదారుల ఆటలు సాగేవి కావన్నారు. ప్రజల తరపున పోరాడుతున్న కమ్యూనిస్టులపై పెట్టుబడిదారులు, మతోన్మాదులు విషంకక్కుతూ దుష్ప్రచారం చేస్తూ వాళ్ళ దోపిడీని కొనసాగిస్తున్నారన్నారు. స్వాతంత్రం రాకముందు నుంచి నేటి వరకు సిపిఐ ప్రజల సమస్యల కోసం పోరాడిందని, భవిష్యత్తులో కూడా ప్రజలు, రైతుల సమస్యల కోసం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. జిల్లాలో పార్టీ నిర్మాణం పెంచాలని, అందుకు పార్టీ నాయకత్వం కృషిచేయాలని, జిల్లా సమితి సభ్యులు బాధ్యతగా పనిచేసి, జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని బాల నరసింహ్మా సూచించారు. అంతకు ముందు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు సమావేశ ఎజెండాను, పార్టీ ప్రజాసంఘాల కార్యాచరణను వివరించారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెద్దబాబు, ఉప్పేరు కృష్ణ, సిద్ధప్ప, రంగన్న, కాసిం, వెంకటేష్, రామాంజనేయులు, శివ, ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సీతారామ ప్రాజెక్టు ద్వారా వ్యవసాయ భూములకు సాగు, తాగునీరు అందించాలి

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా

### ఉత్సాహంగా అశ్వాపురం సిపిఐ మండల మహాసభ

**ప్రజాపక్షం/అశ్వాపురం :** సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ భూములకు సాగు, తాగునీరు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా డిమాండ్ చేశారు. ఆదివారం ఎడెల్లి శ్రీను, రాయపూడి రాజేష్, తెల్లం వెంకటరమణ అధ్యక్షతన అశ్వాపురం సిపిఐ మండల 20వ మహాసభకు ముఖ్యఅతిథిగా సాబీర్‌పాషా హాజరై మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ భూములకు నీరు అందించిన తర్వాతనే సీతారామ ప్రాజెక్టు నీటిని బయటకు తీసుకెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలకు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూ పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అన్నారు. మహాసభలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నారాటి ప్రసాద్, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సారెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మి కుమారి, మండల నాయకులు అనంతనేని సురేష్, అనంతనేని శేఖర్, మేలపుర సురేందర్‌రెడ్డి, కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్‌సాయి, కమటం సురేష్, అక్కెనపల్లి నాగేంద్రబాబు, దండి నాగేష్, సర్వ కృష్ణ, ఏడెల్లి కమలాకర్, చెలికాని శ్రీనివాస్, రెడ్డిబోయిన వెంకన్న, మల్లబోయిన లింగయ్య, తేజావత్ జయమ్మ, తురక అచ్చమ్మ, బెజ్జనబోయిన నాగమణి, తదితరులు పాల్గొన్నారు.



## పేదలకు భూమి పంచిన చరిత్ర సిపిఐది

### సిపిఐ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

### తాంసిలో సిపిఐ మండల మహాసభ

### బిజెపి నుంచి సిపిఐలోకి చేరికలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్/నిర్మల్:** అనేక ఉద్యమాలు, ప్రజా పోరాటాలు నిర్వహించి పేదలకు భూమిని పంచిన చరిత్ర సిపిఐకి ఉందని పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాంసి మండలంలో సిపిఐ 8వ మండల మహాసభ ఆదివారం ఘనంగా జరిగింది. సభకు ముఖ్యఅతిథిగా ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తాంసి గ్రామానికి చెందిన 50 మంది యువకులు బిజెపి నుంచి సిపిఐలో చేరారు. వారికి జిల్లా కార్యదర్శి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ తాంసి మండలం చరిత్ర గల మండలమని, వన్నెల ఎల్లన్న, వన్నెల గంగారెడ్డి, జింక జై హింద్ వంటి అనేక మంది యోధులు ఇక్కడే పుట్టారని గుర్తు చేశారు. గతంలో తాంసి ప్రజలు అనేక ఉద్యమాలు, ప్రజాపోరాటాలు నిర్వహించి పేదలకు భూమిని పంచిపెట్టిన చరిత్ర ఉందన్నారు. అలాంటి చారిత్రక గ్రామంలో ఈ రోజు మండల మహాసభ జరగడం, యువకులు సిపిఐలో చేరడం శుభపరిణామమన్నారు. పార్టీలో చేరిన యువతను అభినందించారు. మండలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన యవతకు పిలుపునిచ్చారు. మహాసభకు ముందు పార్టీ జెండా ఆవిష్కరించగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటల రాములు, చిలుక దేవదాస్, సీనియర్ నాయకులు బుర్రి నటువాజి, జింక సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల పక్షాన నిలబడతాం

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్

### నిర్మల్‌లో పార్టీ జిల్లా మహాసభలకు సన్నాహాలు

**ప్రజాపక్షం/నిర్మల్ ప్రతినిధి :** నిర్మల్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ బలాన్ని, ప్రజల్లో ప్రభావాన్ని మరింత పెంచుకునే లక్ష్యంతో జులై 6న జిల్లా మహాసభలకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామనని, పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేసి, ప్రజల సమస్యలపై మరింత ప్రభావవంతంగా పోరాడే దిశగా ఈ మహాసభలు కీలక భూమిక పోషిస్తాయని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ స్పష్టం చేశారు. ఆదివారం జిల్లాకేంద్రంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో నెలకొన్న అసమానతలు, ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ, అసంఘటిత కార్మికుల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన కోసం సిపిఐ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు సామాన్య ప్రజల జీవితాలను దుర్భరం చేస్తున్నాయని, ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి సమస్యలు పేదలను మరింత కుంగదీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా సభ్యత్వ నమోదు కార్యక్రమం ఊపందుకుందని, ప్రతి గ్రామంలోనూ పార్టీ జెండాను ఎగురవేయడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేస్తున్నారని విలాస్ తెలిపారు. ప్రజల పక్షాన మరింత పటిష్టమైన శక్తిగా నిలబడడానికి, ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాన్ని కొనసాగించేందుకు జిల్లా మహాసభలు ఒక స్పష్టమైన దిశానిర్దేశం చేస్తాయని ఎస్.విలాస్ పేర్కొన్నారు.



## సిపిఐ బలోపేతానికి సమష్టి కృషి

### పార్టీ మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి విజయసారథి



**ప్రజాపక్షం/తొర్రూరు :** జిల్లాలో పార్టీ బలోపేతానికి సమష్టి కృషిచేయాలని మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి పార్టీ శ్రేణులను కోరారు. ఆదివారం సిపిఐ తొర్రూరు మండల 14వ మహాసభ అమరజీవి దొనక రాజమల్లు ప్రాంగణం వెలికట్ట గ్రామంలో నిర్వహించారు. మహాసభ ప్రారంభానికి ముందు అరుణ పతాకాన్ని పార్టీ నాయకులు బోగా ఈశ్వరయ్య ఆవిష్కరించారు. పేరబోయిన కిరణ్, గంధం యాకమ్మల అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా విజయసారథి హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపి, నక్సలైట్లను చర్చలకు పిలువాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం ప్రయత్నించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే ఇండ్లు ఇవ్వాలన్నారు. గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా అర్హులైన పేద వాళ్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూభారతి చట్టాన్ని అమలు చేసి ఎవరైతే భూమి పాసుపుస్తకాలు రాకుండా ఇబ్బంది పడుతున్నారని, ఒకరి భూమి ఇతరుల పాసు పుస్తకంలో నమోదు అయితే దానికి కూడా సరి చేసి పేద వర్గాలను ఆదుకోవాలని విజయసారథి కోరారు. సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. జూలై 5, 6 తేదీల్లో కొరవిలో జరిగే పార్టీ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభలో ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు ఓమ బిక్షపతి, సిపిఐ మండల కార్యదర్శి బంధు మహేందర్, సహాయ కార్యదర్శి పేరబోయిన కిరణ్, సిపిఐ ప్రజాసంఘాల నాయకులు ఘనపురం లక్ష్మణ్, గూడెల్లి ఎల్లయ్యతో పాటు అన్ని గ్రామాల కార్యదర్శులు, సహాయ కార్యదర్శులు పాల్గొన్నారు.

# స్థానికం REGIONAL NEWS



కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

**ప్రజా పక్షం / వేములవాడ:** వేములవాడ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇవ్వాలంటూ ఆదివారం హైదరాబాద్ గాంధీభవన్ లో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజ్ ను కలసి వినతిపత్రాన్ని అందజేసిన వేములవాడ నియోజకవర్గ మున్నూరు కాపు నాయకులు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆమె సానుకూలంగా స్పందించి అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా మున్నూరు కాపు ప్రధాన కార్యదర్శి పొంచెట్టి శంకర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కూరగాయల కొమురయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్లు కచ్చకాయల ఎల్లయ్య, చేలుకల తిరుపతి, పట్టణ అధ్యక్షులు ఇప్ప పూల అజయ్, పట్టణ ప్రధాన కార్యదర్శి బొందిల మహేష్, కచ్చకాయల బాలరాజు, బోయిన్పల్లి మండల ప్రధాన కార్యదర్శి అమిరిశెట్టి భూమి రెడ్డి, పాక్స్ డైరెక్టర తోట రాజు, సాయిని అంజయ్య, మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్, బొప్ప బిక్షపతి, రుద్రంగి మండల అధ్యక్షులు తూం జలపతి, ఎర్రం గంగ నరసయ్య, పోంచెట్టి సురేష్, పోశెట్టి మధు, పొంచెట్టి సాయి, పొంచెట్టి ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికి భూమి కేటాయించాలి

తహసీల్దార్‌కు బిసి సంఘాల జెఏసి వినతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** బిసి సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికి భూమిని కేటాయించాలని కరీంనగర్ మండల రెవెన్యూ అధికారి ఇప్ప నరేందర్‌కు బిసి సంఘాల జెఏసి పక్షాన వినతి పత్రం సమర్పించారు. కరీంనగర్‌లోని నాలుగు కళాశాల స్థాయి బిసి బాలుర, నాలుగు కళాశాల స్థాయి బాలికల వసతి గృహాలు అద్దె భవనాలలో నడుస్తున్నాయని, వీటికి ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి భూమిని కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా బిసి జెఏసి నాయకులు మాట్లాడుతూ నగరంతో పాటుగా చుట్టుపక్కల గ్రామాలో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూమి ఉండగా ప్రభుత్వ బిసి సంక్షేమ వసతి గృహాలు అద్దె భవనాలలో లక్షలాది రూపాయల అద్దె చెల్లిస్తూ కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే నగరంలోని అన్ని బిసి సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని, అందుకొరకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. బిసి సంక్షేమ వసతి గృహాలలో విధ్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండడం, ప్రైవేట్ భవనాలలో సౌకర్యాలు సరిగా లేకపోవడం, ప్రభుత్వం ఏళ్ల తరబడి అద్దె బకాయిలు చెల్లించకపోవడంతో ఇంటి యజమానులు భవనాలు ఖాళీ చేయమని ఇబ్బంది పెట్టడం జరుగుతోందన్నారు. దీని దృష్ట్యా వెంటనే అన్ని ప్రభుత్వ బిసి వసతి గృహాలకు భూమిని కేటాయించాలని, నిర్మాణాలకు నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల జెఏసి నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు, దొగ్గలి శ్రీధర్, బత్తుల మల్లేశం, మంతెన కిరణ్, మియాపూర్ రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురి లయన్స్ క్లబ్‌కు నూతన కార్యవర్గం




**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి లయన్స్ క్లబ్ 2025–26 నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.నూతన అధ్యక్షులుగా మామిడాల రవీందర్, కార్యదర్శిగా సర్జారావు, కోశాధికారిగా పప్పుల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇన్స్టాలేషన్ ఆఫీసర్ ఫస్ట్ వైస్ డిస్టిక్ గవర్నర్ మోర భద్రేశం,ఆర్ సిపి కామిని శ్రీనివాస్, డిస్టిక్ పి ఆర్ ఓ తన్నీరు రాజేందర్, జి ఎల్ టి డిస్టిక్ కో ఆర్డినేటర్ ఇనుగుర్తి రమేష్,జోన్ చైర్ పర్సన్ పిన్న శ్రీనివాస్, డిస్టిక్ క్యాబినెట్ మెంబర్ జక్కు రవీందర్ పాల్గొని నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు

## పలిగిరి రాజేందర్‌కు జానపద కళా పురస్కారం



**ప్రజాపక్షం / ధర్మపురి :** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నేరేళ్ల కు చెందిన పలిగిరి రాజేందర్ కు ఆలయ ఫౌండేషన్ ద్వారా జానపద కళా పురస్కార్ అవార్డును అందుకున్నారు.పెద్దపెల్లి జిల్లా బసంత్ నగర్ లో శనివారం రాత్రి జరిగిన ఓ కార్యక్రమంలో పెద్దపెల్లి మాజీ పార్లమెంటు సభ్యులు వెంకటేశ్ నేత చేతులమీదుగా రాజేందర్ అవార్డును స్వీకరించారు. నేరేళ్లకు చెందిన రాజేందర్ గత 25 ఏళ్లుగా కళారంగంలో విశేషంగా రాణిస్తూ జిల్లా,రాష్ట్ర,జాతీయ స్థాయిలో వేలాది ప్రదర్శనలు ఇస్తూ ప్రజలలో సామాజిక రుగ్మతలపై అవగాహన కల్పిస్తూ కళామిమతల్లి సేవలో కొనసాగుతున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పరికిపండ్ల నరహరి తెలిపారు.ఈ అవార్డుకు ఎంపిక కావడం తనలో మరింత ఉత్తేజాన్ని నింపిందని పలిగిరి రాజేందర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జెడ్పిటీసీ మాజీ సభ్యురాలు కందుల సంధ్యారాణి,వకుళాభరణం కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సార్లూ.. జర పోలు వైపు చూడండి



**ప్రజా పక్షం / ఇబ్రహీంపట్నం :** కరెంటు సార్లు జర పోల్ వైపు చూడరు అని కరెంటు సార్లను అడిగి అడిగి విసిగి వేసారి పోయిన ఓ రైతు ఆవేదన. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని కుంభాల ప్రశాంత్ రెడ్డి పొలంలో ఇటీవలే నెల క్రితం భారీ ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన వర్షానికి తన పొలములో కరెంటు పోలు విరిగి పడింది. ఈ విషయాన్ని లైన్మెన్ తో పాటు కరెంటు ఏఈ దృష్టికి తీసుకు వెళ్లగా పొంతన లేని సమాధానాలు చెబుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బాధిత రైతు కుటుంబాల ప్రశాంత్ వాపోయారు. పొలాల సాగు సమయం దగ్గర పడుతుండడంతో నారువేద్దామన్న మోటార్ బావికి కరెంటు సప్లై లేక పోవడంతో ఎలా నారు వేసేది అని ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్తు అధికారులు స్పందించి సత్వరమే విరిగిన పోలు వద్ద కొత్త పోల్ అమర్చాలని రైతు కుంభాల ప్రశాంత్ విద్యుత్తు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నాడు.

## వర్షాలు కురవాలని జలాభిషేకం

**ప్రజాపక్షం/కొత్తపల్లి:** వరుణదేవుడు కరుణించి వర్షాలు కురవాలని గ్రామంలోని దేవాలయంలోని విగ్రహాలకు గ్రామస్థులు జలాభిషేకం చేశారు. కరీంనగర్ రూరల్ మండలంలోని గోపాల్‌పూర్ గ్రామంలో వినాయకునికి, పోచమ్మకు, గీతామందిరంలోని కృష్ణభగవాన్‌ఉ, జన్యంతునికి, శివుని జీలుగుల మల్లన్నకు, తపాల లక్ష్మి నరసింహ స్వామికి, వీరయ్యకు అభిషేకించారు. మాజీ సర్పంచ్ ఊరడి మంజుల మల్లారెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ నర్సయ్య, ముస్కు మల్లారెడ్డి, సంజీవ్, తిరుపతి, పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో తాటి, ఈత వనాల పెంపకం

సర్వాయిపాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/కొత్తపల్లి:** ప్రభుత్వ స్థలాలుంటే అక్కడ ఇజిఎస్ పథకం కింద 40లక్షల ఈత, 5 లక్షల తాటి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ తెలిపారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం వద్ద మొక్కలు సిద్ధంగా ఉన్నాయని, గౌడ సంఘం నేతలు ప్రభుత్వ స్థలాలు గుర్తించి అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. కల్తీ లేని కల్లు ఔషధం లాంటిదేనని పేర్కొన్నారు. కల్లు కాంపౌండ్లకు ని ధులిస్తామన్నారు. చింతకుంటలో కల్లు కాంపౌం డ్ నిర్మించుకుంటే రూ.5 లక్షలు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. సర్వాయి పాపన్న స్ఫూర్తిగా తీ సుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పంజాల స్వామి, మడుపు మోహన్‌చారి, బొమ్మఈశ్వర్ గౌడ్, కోడూరి పర్శరాం గౌడ్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడతాం

ప్రజాసమస్యలు పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తాం

సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్





**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు నిరంతర ఉద్యమాలు చేస్తు ఉంటామని , ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. తొగుట మండల 2వ మహాసభకు మంద పవన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజల భవిష్యత్ అంధకారంలోకి నెట్టివేయబడిందన్నారు. రోజురోజుకు దేశంలో పేదరికం పెరిగిపోతుందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం దేశంలో పేద ప్రజల కోసం కాకుండ పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో కార్మికుల హక్కుల కాలరాయబడుతున్నాయన్నారు. కార్మికులు పోరా డి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక లోకాన్ని అభద్రత భావంలోకి నెట్టివేశారన్నారు. మోదీ, అమిత్‌షాలు పూర్తిగా నియంతృత్వ పాలన కొనసాగిస్తున్నారన్నారు. బిజెపి ప్రభుత్వం నిత్యవసర ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి పేద ప్రజల నడ్డి విరుస్తుందన్నారు. అడవుల్లో ఉన్న సహాజ సంపదను విదేశి సామ్రాజ్య వాదులకు కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడానికి కుట్ర పన్ని 2026 జనవరి చివరి వరకు నక్సలైట్లను అంతం చేస్తామని ఆపరేషన్ కగార్ పేరిట బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తూ అమాయక,ఆదివాసి గిరిజనుల ప్రాణాలు తీస్తూ దమన కాండ కొనసాగిస్తుందని , ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, ఆదివాసి,గిరిజనుల ప్రాణాలను కాపాడాలని దేశమంత ప్రజాస్వామిక వాదులు, మేధావులు. ప్రజలంత ముక్తకంఠంతో ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ మావోయిస్తులు చర్చలకు సిద్ధంగా ఉన్నారని, తక్షణమే వారిని చర్చలకు పిలువాలని కోరుతున్న కేంద్రంస్పందించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శత్రుదేశమైన పాకిస్తాన్, భారత్ యుద్ధం జరిగితే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెపిన మాటతో ఇరుదేశాల మధ్య శాంతిచర్చలు జరిపిన ఈ ప్రభుత్వం, ఈదేశ ప్రజలు అయినటివంటి పీడీత వర్గాల హక్కుల కోసం అడవి బాట పట్టి తమ ప్రాణాలను సైతం ప్రజల కోసం అంకితం చేస్తున్న మా వోయిస్టుల విషయంలో చర్చలు జరిపి ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అర్హులైన పేదలకు ఇంటి స్థలాలతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి ఆదుకోవాలన్నారు. రాజీవ్ యువ వికాస్ కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి రుణం మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. మహాసభలో 11 మందితో నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మండల నిర్మాణ బాధ్యులు కనుకుంట్ల శంకర్,జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మ ణ్, మండల కార్యదర్శి బండారు పోచయ్య, సీతాలచ్చయ్య. రాజయ్య, యాదగిరి. ఎల్లయ్య, రాజు .భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన టిఎన్‌జిఒఎస్ నేతలు



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఎంప్లాయిస్ జెఎసి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఎంప్లాయిస్ చైర్మన్, టిఎన్‌జిఒఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మ ణ్‌రావులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉద్యోగుల సమావేశం నిర్వహిస్తామని, తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని, ప్రతి ఉద్యోగిని గుండెల్లో పెట్టుకుని కాపాడుకుంటామని హామీ ఇచ్చారు. త్వరగా ఎంప్లాయిస్ హెల్త్ స్కీం ఏర్పాటు చేయాలని, పెండింగ్ బిల్లులు, మెడికల్ బిల్లులు, సప్లమెంటరీ సాలరీ బిల్లులు త్వరగా వచ్చే విధంగా ప్రభుత్వానికి నివేదించాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారు. ఇటీవల సస్పెన్షన్‌కు గురైన వ్యవసాయ శాఖ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నిర్దోషులకు న్యాయం చేయాలని జెఎసి నేతలు విజ్ఞప్తి చేశారు. పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, నాయకులు రమేష్ గౌడ్, పోలు కిషన్, కామ సతీష్ పటేల్, అజ్గరుద్దీన్, కరుణాకర్, లవ కుమార్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా అక్రమ మద్యం విక్రయాలు



**ప్రజాపక్షం / ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం లోని ఓ గ్రామంలోని ఓ కిరాణా షాపులో ఆ షాపు యజమాని జోరుగా కిరాణం మాటున అక్రమ మద్యం విక్రయానికి తెర లేపాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని గోదూరు గ్రామంలోని అల్లూరి సీతారామరాజు విగ్రహం దగ్గర మెయిన్ రోడ్డు ఆనుకొని ఉన్న తన ఇంటిలో కిరాణా షాపు మాటును జోరుగా బెల్ట్ షాపు నిర్వహిస్తూ అధిక ధరలకు అక్రమ మద్యం విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. చూడ్డానికి కిరాణా షాపుల ఉంటుంది కానీ రాత్రి అయితే చాలు ఆ షాపు వైన్స్‌ని తలపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు బెల్ట్ షాపు నిర్వాహకునిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి


తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నేతలు




**ప్రజాపక్షం/జమ్మికుంట:** కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ఉద్యమకారులకు పేర్కొన్న హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు కోరారు. ఆదివారం జమ్మికుంటలో విలేకరుల సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను విస్మరించడం తగదన్నారు. ఉద్యమకారులను గుర్తించేందుకు ఒక కమిటీని వేయాలని సూచించారు. తద్వారా భావితరాలకు ఉద్యమకారులను గుర్తించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ సెప్టెంబర్ 17లోపు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రజాప్రభుత్వం ప్రత్యేక తెలంగాణ సాధన కోసం పోరుబాటలో నడిచిన ఉద్యమకారులను మరువొద్దని విన్నవించారు. 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్ ఇవ్వాలన్నారు. తాము కోరుతున్నవి ఆర్థికేతర అంశాలు మాత్రమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రాజేందర్, వాసాల రామస్వామి, తదితరులున్నారు.

## ముగిసిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ 'సీజన్ వన్'

ఫైనల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎల్లా గౌడ్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలో నూతనంగా ఆవిర్భవించిన ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో సీజన్ వన్ పేరుతో 2025 ఏప్రిల్ 13 నుంచి 2025 జూన్ 22వరకు ప్రతి ఆదివారం గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్ ఇన్‌చార్జి సిర్ర మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆదివారం గోదావరిఖని జవహర్లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం సింగరేణి ఆర్జీ వన్ ఏరియాలోని గనులు డిపార్ట్మెంట్‌లు, ఒసిపి 5లలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులచే తమ ప్రతిభను వెలికితీయడానికి, గుర్తించేందుకు మూడు నెలల పాటు గుర్తింపు సంఘం ఎఐటియుసితో పాటు మిగతా సంఘాల సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా గత మూడు నెలలుగా ప్రతి ఆదివారం ఆర్జీ 1లోని మైన్స్ డిపార్ట్మెంట్‌ల నుంచి 9జట్లు 22 లీగ్ మ్యాచ్ల అనంతరం ఆదివారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ఫైనల్‌కు జిడికె 2 ఇంక్లైన్ టీం ఏ, జిడికె 11వ ఇంక్లైన్ టీం బి పాల్గొన్నాయని ఆయన అన్నారు. హోరాహోరీగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్లో జిడికె 2 ఇంక్లైన్ టీం ఫైనల్ విజేతగా నిలిచిందని, దీనికి స్పాన్సర్‌గా గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లా గౌడ్ ట్రోఫీని స్పాన్సర్ చేశారని, అదేవిధంగా ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం 5000/ జిడికె 1&3 ఇంక్లైన్ ఎఐటియుసి పిట్ సెక్రెటరీ మానాల శ్రీనివాస్ 5555/ నగదు ఇచ్చారని, వారికి మొదటి బహుమతిగా ట్రోఫీనిచ, రూ.11111/ నగదు బహుమతిని విజేతగా నిలిచిన జిడికె 2వ ఇంక్లైన్ టీంకు ఆర్జీ వన్ జనరల్ మేనేజర్ లలిత్ కుమార్, ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్‌ల చేతుల మీదుగా అందజేయడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా సెకండ్ ప్రైజ్ మనీ 5555/ ట్రోఫీని జిడికె 11వ ఇంక్లైన్ టీం కు అతిథులచే అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నమెంట్లో మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా 2 ఇంక్లైన్ జి. సందీప్ ఎంపికయ్యాడు, అదేవిధంగా ఫైనల్లో మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీని కూడా అందుకున్నాడని ఆయన పేర్కొన్నారు. టోర్నమెంట్ బెస్ట్ బ్యాట్స్మెన్ 11 ఇంక్లైన్ టీం (బి) సందీప్ ఎంపికయ్యారు.ఈ సందర్భంగా కార్మికులు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఆర్గనైజర్స్ వినయ్, సంతోష్, భరత్, జాన్ కెనడి, హరి కిషన్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో జీడికే 11 ఇంక్లైన్ ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ రంగు శ్రీను, జిడికె లెవెన్ ఇంక్లైన్ ఎఐటియుసి ఫిట్ సెక్రటరీ నాయిని శంకర్, పిట్ సహాయ కార్యదర్శి గొడిశెల నరేష్, జిడికె 2 ఇంక్లైన్ ఎఐటియుసి పిట్ సెక్రటరీ పొన్నాల వెంకటయ్య, జిడికె 2ఏ ఇంక్లైన్ ఎఐటియుసి పిట్ సెక్రటరీ కారంపూరి వెంకన్న, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సంతోష్ రెడ్డి లు పాల్గొన్నారు.

## శాతవాహన నూతన భవన నిర్మాణానికి కేంద్ర మంత్రి శంకుస్థాపన






**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి/ ధర్మపురి::** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆదివారం మధ్యాహ్నం శాతవాహన విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించనున్న కొత్త అకాడమిక్ భవనం, ప్రహారీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దాదాపు రూ.7 కోట్ల 28 లక్షల అంచనా వ్యయంత కొత్త అకాడమిక్ భవనం, రూ.2.85 కోట్ల అంచనా వ్యయంతో ప్రహారీగోడను నిర్మించనున్నారు. అకాడమిక్ భవన నిర్మాణానికయ్యే నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం పీఎం ఉషశ్రీ పథకం నుంచి నిధులను మంజూరు చేసింది. శాతవాహన వర్సిటీ అంతర్గత నిధులతో ప్రహారీ గోడను నిర్మిస్తున్నారు. ఈ సంధర్భంగా యూనివర్సిటీ అధికారులతో కలిసి ఆ ప్రాంగణమంతా కలియ తిరిగారు. విధ్యార్థులతో ముచ్చటించారు. యూనివర్సిటీ అభివృద్ధి, నిధుల కేటాయింపు విషయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చూపుతున్న చొరవ మరువలేనిదని వర్సిటీ వైస్ చాన్స్లర్ ఉమేష్ కుమార్ అన్నారు. విద్యార్థులు, అధ్యాపకుల పక్షాన సంజయ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జె.రవికుమార్‌తో పాటు విశ్వవిద్యాలయ క్యాంపస్, అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, బోధనా,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

### కేంద్రమంత్రి బండి సంజయ్ చేతులమీదుగా పోస్టర్ విడుదల

**ధర్మపురి:** వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మదర్ ఇండియా ప్రోగ్రాం కు సంబంధించిన పోస్టర్ ను ఆదివారం కేంద్రమంత్రి బండి సంజయ్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల్ల రామకృష్ణ,కార్యదర్శి గార్లపాటి శ్రీనివాస్, మదర్ ఇండియా ప్రోగ్రాం చైర్మన్ సిరిపురం రాజేష్,కో చైర్మన్ సిరిపురం సత్యనారాయణ పాల్గొన్నారు.

## హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధే మా లక్ష్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్

దమ్మక్కపేటలో పైప్ లైన్ పనులకు శ్రీకారం



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని, ఏళ్ళుగా ఎదురుచూస్తున్న ప్రజల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కొక్కటిగా పరిష్కారం చూపిస్తున్నామని, భవిష్యత్‌లో మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. ఆదివారం రోజున హుజురాబాద్ పట్టణ పరిధిలోని దమ్మక్కపేటలో 20లక్షలతో చేపట్టిన పైప్ లైన్ పనులను ప్రారంబించారు. అనంతరం ప్రణవ్ మీడియాతో మాట్లాడుతూ కల్వకుంట్ల కుటుంబానికి తొత్తులుగా మారిన వ్యక్తులు ఎవరు తప్పు చేసిన ఆది ఒప్పు అన్నట్టుగా కేటీఆర్, హరీష్ రావు మాట్లాడడం సిగ్గుచేటని, అసలు కేసు ఎందుకు అయ్యిందో బిఆర్ఎస్ నాయకులు గమనించాలని అన్నారు. ఒక గ్రానైట్ వ్యాపారిని బెదిరించి 50 లక్షల రూపాయలు ఇస్తావా, చస్తావా అని బెదిరిస్తే వ్యాపారి భార్య సుబేదారి పోలీసు స్టేషన్ లో కేసు పెడితే పోలీసులు కేసు నమోదు చేశారనీ, ఏదో ఉద్యమం చేసి రిలీజ్ అయిన వ్యక్తిలాగా సోషల్ మీడియాలో కౌశిక్ రెడ్డి బిల్డప్ ఇవ్వడం చూస్తే ప్రజలు నవ్వుకుంటున్నారని, ఎలాంటి తప్పు చేయకపోతే ముందస్తు బెయిల్ కు ఎందుకు వెళ్లాడనీ? ఒక ఎమ్మెల్యే స్థాయిలో ఉన్న వ్యక్తి చిల్లర వీధి రౌడీలాగా, రాజకీయ జోకర్ లాగా ప్రవర్తించడం సిగ్గుచేటని అన్నారు. మహిళ ఫిర్యాదు చేస్తే ఆ కేసు మీకు ఫాల్తు కేసులాగా కనపడుతుందా అని కేటీఆర్, హరీష్ రావు ను ప్రశ్నించారు. ఇదే కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు 25 లక్షలు ఇచ్చాను అని వ్యాపారి చెప్పింది నిజం కాదా అని, నియోజకవర్గంలో అనేక మందిని ఇబ్బందులకు గురి చేసింది కౌశిక్ రెడ్డి, స్వయంగా బాధితులే ప్రెస్ మీట్ పెట్టి చెప్పారనీ అన్నారు. ఇంకోసారి కౌశిక్ రెడ్డి స్థాయికి మించిన మాటలు మాట్లాడితే గ్రామాల్లో తిరగనియ్యమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు,గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## అటవీ ప్రాంతంలో నాలుగు నెలల బాలుడు లభ్యం!

**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మండల పరిధిలో కొండాపూర్ అడవి ప్రాంతంలో నాలుగు నెలల పసివాడిని గుర్తు తెలియని వ్యక్తులు వదిలేసి వెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ మెదక్ జాతీయ రహదారి ప్రక్కనగల కొండాపూర్ అటవీ ప్రాంతంలో నర్సాపూర్ నుండి హైదరాబాద్ వెళుతున్న కారును రోడ్డు ప్రక్కన సేదదీరేందుకుఆపారు. కారులోని వారు కిందకుదిగారు. ఆ సమయంలో వారికి పసిపాప ఏడుపులువినిపించాయి. 100కు డయల్ చేశారు. నర్సాపూర్ ఎస్సైలింగం తన సిబ్బం దితో అటవీ ప్రాంతంలో చెట్ల పొదల్లో గాలించారు. లభ్యమైన 4 నెలల బాలుడ్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాలుడు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



## పద్మశాలీల అభివృద్ధికి కృషి
### రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** పద్మశాలిల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. నగరంలోని మాధవ్‌నగర్‌లోని బీఎల్ఎన్ గార్డెన్‌లో నిర్వహించిన పట్టణ పద్మశాలి సంఘ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడారు. పద్మశాలిల పట్ల తనకు ప్రత్యేక గౌరవం, అభిమానం ఉందని, పద్మశాలిల అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు.నూతనంగా ఎన్నికైన సంఘ అధ్యక్షులు పెంట దత్తాద్రి, ప్రధాన కార్యదర్శి భూమేశ్వర్, సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పద్మశాలి సంఘం తరపున ఆయనను సన్మానించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్అలీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ కార్పోరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, గంగారెడ్డి, శేఖర్‌గౌడ్, 26 తర్పల పద్మశాలి సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాంపులు వినియోగించుకోండి




**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** భీమ్‌గల్ నిహారిక పిల్లల ఆస్పత్రి వారి ఆధ్వర్యంలో కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్, మెండోరా, నర్సాపూర్, దమ్మన్నపేట్ గ్రామాల్లో నవజాత శిశువు, పిల్లల ఉచిత మెగా వైద్య శిబిరం డాక్టర్ నిహారిక నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ప్రజల ఆరోగ్యమే మాకు శ్రీరామరక్ష అని, ప్రజలు ఉచిత క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పేదలకు వరం

**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద నిధులు మంజూరయ్యాయని మండల కాంగ్రెస్ అధ్యక్షులు మహిపాల్ తెలిపారు. ఫాతిమాకు 60 వేలు, నహిమ 60 వేలు, సుకన్య 12 వేలు, సమీద 6 వేల 500, శింబేగ్‌కు 15 వేలు, నవదీప్‌కు 22 వేల 500, రిజ్వానకు 60 వేలు, ఒడ్డె లక్ష్మికి 18 వేలు, సుజాతకు 41 వేలు, శ్రీనుకు 60 వేలు, లసంబాయికి 16 వేలు మంజూరయ్యాయని ఆయన తెలిపారు.

## ఘనంగా బోనాల పండగ



**ప్రజాపక్షం/బోధన్:** బోధన్ పట్టణంలోని రెడ్డికా కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలను తీసుకొని మహాలక్ష్మి అమ్మవారి గుడికి చేరుకొని నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్డికా కుల అడాక్ కమిటీ అధ్యక్షులు అశోక్ రెడ్డి, కుల సంఘ ప్రముఖులు సాయిరెడ్డి, రుద్ర సత్యనారాయణ, గుంత గంగాధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## 'భరోసా' డబ్బులు రైతులకే ఇవ్వాలి

**ప్రజాపక్షం/నేరడిగొండ :** నేరడిగొండ మండలంలోని రైతులందరికీ వారి ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా డబ్బులు జమవుతున్న బ్యాంకు అధికారులు వారు ఇచ్చిన రుణాల కింద జప్తు చేసుకొని ఇవ్వకపోవడం రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నరని ఆదివారం సామాజిక కార్యకర్త సాబ్లె సంతోష్ సింగ్ విలేకరులతో అన్నారు.ప్రభుత్వం రైతుల లబ్ధికోసం విత్తనాలు ఎరువులు పురుగు మందుల కొనుగోలు కై నేరుగా రైతు ఖాతాలకు అందజేస్తే ఇక్కడ బ్యాంకు అధికారులు వారి టార్గెట్లను పూర్తి చేసుకోవడానికి రైతు భరోసా డబ్బులను బాకీ నిమిత్తం వసూలు చేయడం ఎంతవరకు సమంజసమో అధికారులు ఆలోచించాలని ప్రభుత్వం కూడా బ్యాంకు అధికారులకు సూచనలు చేయాలని అప్పుడే రైతులకు రైతు భరోసానిధులు లబ్ధి చేకూరుతాయని, లేనియెడల నష్టపోయే ప్రమాదం ఉందని అన్నారు.

## నిజాయితీ చాటుకున్న నిర్మల్ డ్రైవర్



**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్ :** హైదరాబాద్ లో నిర్మల్ బస్సు ఎక్కి 70 వేల విలువగల ఐఫోన్ పోగొట్టుకొని నిర్మల్ బస్టాండ్ లో బస్ దిగిపోయాడు.డిపోలో డ్రైవర్ బస్ అప్పగించేటప్పుడు ఫోన్ కనబడింది.రిజర్వేషన్ చార్ట్ ప్రకారం ప్రయాణికుడు వంశీని తెలిసింది.ప్రయాణికుని పిలిపించి సెక్యూరిటి విజలెన్స్ వారి సమక్షంలో సెల్ ఫోన్ ఇవ్వడం జరిగింది.నిజాయితీ చాటుకొన్న హన్నంత్ డ్రైవర్ను డిపోమేనేజర్ కే.పండరి.పలువురు ప్రశంషించారు.

## మత్తుపదార్థాల నియంత్రణకు చర్యలు

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎస్సై లింబాద్రి తెలిపారు. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు ఆదివారం విశ్వనాథ్ పెట్ కాలనీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మత్తు పదార్థాల వినియోగం,రవాణా వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించిన ఎస్సై లింబాద్రి,వీటిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మత్తు పదార్థాలను వినియోగించినా,రవాణా చేసినా చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేశారు.మత్తు పదార్థాల వినియోగం లేదా రవాణా గురించి ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు.సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.

# ఇబ్బందులున్నా..యథావిధిగా పథకాలు
### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్



**ప్రజాపక్షం/నిజామాబాద్‌ప్రతినిధి:** ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పేదల అభ్యున్నతే ధ్యేయంగా సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిరంతరంగా కొనసాగిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ శాసనమండలి సభ్యులు మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఆదివారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తాతో కలిసి 572 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే ఇంద్రపూర్‌లోని నగర యాదవ సంఘంలో 261 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు. షబ్బీర్‌అలీ, మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వ అసంబద్ధ పాలన కారణంగా తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆక్షేపించారు. రూ. 7.50 లక్షల కోట్ల అప్పులపై తమ ప్రభుత్వం ప్రతినెల రూ.6500 వేల కోట్లు వడ్డీ కింద చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. అయినప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత ప్రయాణం, ఉచిత విద్యుత్, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర రైతు రుణమాఫీ, రైతు భరసా, రైతు బీమా, రాజీవ్‌ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తు చేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే కృతనిశ్చయంతో మొదటి విడతగా ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు తప్పకుండా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు హరోసాకల్పించారు.ప్రస్తుతం మంజూరి పత్రాలు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం తోడ్పాటుతో త్వరితగతిన ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని హితవు పలికారు. కాలనీలు నిర్మించేందుకు అనువైన ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ ఈరవత్రి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, నుడా చైర్మన్ కేశ వేణు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, ఆర్డీఓ రాజేంద్రకుమార్, నగరపాలక సంస్థ చైర్మన్ దిలీప్‌కుమార్ ఉన్నారు.

## జిల్లా కలెక్టరే రైతుగా మారినవేళ..



**ప్రజాపక్షం/టేక్మాల్ :** ఆదివారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కలెక్టర్ పొలం బాట పట్టారు. నిత్యం బిజీగా ఉంటూ ఆదివారాలు సెలవు రోజులను చూడకుండా ప్రతినిత్యం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రగతిని పరిశీలిస్తూ, జిల్లాలో సుపరిపాలన లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంలో టేక్మాల్ మండలం ఎల్లంపల్లి తండా కు చెందిన రైతు విట్టల్ పత్తి పంటను పరిశీలించారు. కలెక్టర్ స్వయంగా వచ్చి విట్టల్ బాగోగులు అడిగి ఎంత పొలం ఉన్నది.పత్తి పంటను ఎప్పుడు వేశారు. విత్తనాలు ఎక్కడ కొన్నారు.ప్రస్తుతం ఎలాగ ఉన్నది పత్తిలో చీడపీడలు నివారణకు తీసుకుంటున్న జాగ్రత్తలు,దిగుబడి వివరాలు అడిగిన కలెక్టర్. ప్రస్తుత వాతావరణ ప్రతికూల అనుకూల పరిస్థితులు ప్రభావం తెలియజేస్తూ అరక పట్టి, పొలం దున్నేరు. స్వయంగా కలెక్టరే వచ్చి పత్తి పంట సాగు వివరాలు తెలుసుకోవడంతో విట్టల్ ఆనందానికి అవధులు లేవు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సరిపడ విత్తనాలు ఎరువులు అందుబాటులో ఉంచామని నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. రైతు భరోసా డబ్బులు అర్హులైన ప్రతి రైతు కుటుంబాలకు జమ చేయబడుతున్నాయని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. రైతు భరోసా కింద ఆదివారం వరకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద జిల్లాలోని 2,54,504మంది రైతుల ఖాతాల్లో మొత్తం 207,14, 20,772 రూపాయలు జమ చేసినట్లు తెలిపారు.

## రోగులకు మెరుగైన వైద్యం
### మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఆదివారం అల్లాదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది హాజరు రిజిస్టర్, ప్రాథమిక గది, ఫార్మసీ, పేషెంట్ వార్డులను,పరిశీలించారు. మందుల కొరత లేకుండా చూసుకోవాలని, వైద్య సిబ్బందికి సూచించారు. ఆరోగ్య కేంద్రంలో ఓపి శాతం ఎక్కువగా ఉండేలా వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా జిల్లా కేంద్రం లోని డిఎం హాస్ ఓ, కలెక్టరేట్లో అనుసంధానం చేసి ఆస్పత్రుల పనితీరును పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, సి హెచ్ ఓ, సుదర్శన్, సిబ్బంది హసీనా తదితరులున్నారు.

# పంట పెట్టుబడికి ఆర్థిక భరోసా
### శనివారం నాటికీ రూ.246.86 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ..
### నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** వర్షాకాలం సీజన్ ను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద రైతులకు నిధులు అందజేస్తోందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు.శనివారం నాటికి నిర్మల్ జిల్లాలో మొత్తం అక్షరాల 246 కోట్ల 86 లక్షల 8 వందల 90 రూపాయల (246,86,00,890) రైతు భరోసా నిధులు విజయవంతంగా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. జిల్లాలో ఉన్న మొత్తం 1,86,400 మంది రైతుల్లో 1,82,896 మంది ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్ఫర్ (డిబిటి) ద్వారా నిధులు చేరాయని వివరించారు.మిగిలిన రైతులకు త్వరలోనే నిధులు జమ కానున్నట్లు తెలిపారు.రైతులకు ఆర్థి క భరోసా కల్పించడంతో పాటు,వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం ఈ పథకం లక్ష్యమని పేర్కొన్నారు.పెట్టుబడి భారం తగ్గడం వల్ల సాగు పనులను ముందుగానే ప్రారంభించేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారని చెప్పారు. రైతు భరోసా అందించడమే ప్రభత్వ ధ్యేయం అని కలెక్టర్ స్పష్టంచేశారు.పంట పనుల ప్రారంభానికి ముందే నిధులు జమ కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని కలెక్టర్ తెలిపారు.

# జర్నలిస్టులకు నగరంలోనే ఇళ్ల స్థలాలు ఇస్తాం



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** జిల్లా జర్నలిస్టులకు నగరంలో నివాస యోగ్యం కలిగిన ఇళ్ల స్థలాలు నూటికి నూరు శాతం ఇస్తామని ప్రభుత్వ టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ స్పష్టం చేశారు. ఈ మేరకు కలెక్టర్‌తో విపులంగా చర్చించి నగరంలో నివాస యోగ్యమైన అనువైన స్థలాన్ని చూడాలని జిల్లా కలెక్టర్‌కు ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నెలలోపు ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. హైదరాబాద్ టీమ్ ఆధ్వర్యంలో యూనియన్లకతీతంగా జర్నలిస్టు నాయకులు నిజామాబాద్‌లో మహేష్‌గౌడ్, షబ్బీర్‌అలీలను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్, షబ్బీర్‌అలీ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని నెల లోపు ఇళ్ల కల సాకారం చేయనున్నామని హామీనిచ్చారు. కార్యక్రమంలో జర్నలిస్టు నాయకులు జమాల్‌పూర్ గణేష్, పంచరెడ్డి శ్రీకాంత్, సుభాష ప్రమోద్‌గౌడ్, కొట్టూర్ శ్రీనివాస్, నర్సయ్య, మధు, కర్క రమేష్, శివకుమార్, కత్తుల రాజేష్, ఆడెపు శ్రీనివాస్, జైపాల్, సందీప్, నర్సింలు, మోహన్, కొక్కు రవికుమార్, శ్రీధర అహ్మద్, సదానంద్, రజనీ కాంత్, విఘ్నేష్, బాలకుమార్, దివాకర్, ఆనంద్‌పాల్, ధనుంజయ్, ఆంజనేయులు, గోవింద్ రాజ్, మహ్మద్ గౌస్, నర్సయ్య, సంగీత,అనిత,రవిబాబు, సతీష్, యాసిన్, ఉస్మాన్, రవుఫ్, ఫరూక్, సాజిద్, అజ్మత్, డాక్టర్ శ్రీనివాస్, శ్రీధర్, కిషోర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్‌తో పాటు వీడియో, ఫొటో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అక్రమ రిజిస్ట్రేషన్ల కథనంపై చర్చ..

**ప్రజాపక్షం/రామాయంపేట:** 'ప్రజాపక్షం' పత్రికలో ప్రచురితమైన కథనం రామాయంపేటమండలంలో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం మం జూరు చేసిన పట్టాలకు ప్రైవేటు రిజిస్ట్రేషన్లు అనే కథనం అక్రమార్కుల గుండెల్లో దడపుట్టించిందని చెప్పవచ్చు. పట్టణంలో ఎక్కడ చూసిన ప్రజాపక్షం పత్రికలో వచ్చిన వార్తపైనే ప్రతి ఒక్కరు చర్చించుకుంటున్నారు. బీడి కార్మికుల ప్లాట్లపై అక్రమ రిజిస్ట్రేషన్లు చేయడం ఏమిటని ఇదే విషయం ప్రజలను, ప్రజాసంఘాలను కదిలించింది. కొందరు అధికారులు సక్రమంగా విధులు చేపడితే ఇలాంటి ఘటనలు చోటుచేసుకోవని అంటున్నారు. ఆదివారం పెద్దమ్మ దేవాలయం వద్ద ముదిరాజ్ సంఘం సభ్యులు సమావేశమై అక్రమ రిజిస్ట్రేషన్లు చేస్తూ మోసాలకు పాల్పడుతున్న శీలం సుభాష్‌రెడ్డిపై ప్రభుత్వ చర్యల కోసం ఎక్కడి వరకైనా వెళ్లుటకు సిద్ధంగా ఉండాలని ఆ సం ఘం కమిటి తీర్మానించినట్లు తెలిసింది. ప్రజాపక్షం పత్రికలో వచ్చిన వార్త పేపర్ కథనాన్ని స్థానికులు జిరాక్స్‌లు తీసి ప్రజలకు పంచడం విశేషం.

## పూర్వ ప్రాథమిక తరగతులు తప్పనిసరి



**ప్రజాపక్షం/ కాగజ్ నగర్ :** రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమికతరగతులు ప్రారంభించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) డిమాండ్ చేసింది. కాగజ్‌నగర్ పట్టణంలోని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జరిగిన టిఎస్ యుటిఎఫ్ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కమిటీ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఎల్‌కెజి లేకుండా కేవలం యుకెజి మాత్రమే ప్రారంభిస్తామనే నిర్ణయం అన్యాయమని అభిప్రాయపడ్డారు.

## పౌరుల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యం
### మందమర్రి సిఐ శశిధర్‌రెడ్డి



**ప్రజాపక్షం / మందమర్రి :** ప్రజల రక్షణ, భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం అని, శాంతి భద్రతల పరిరక్షణ నేరాల నిర్మూలనే ధ్యేయంగా పనిచేస్తున్నామని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్ రెడ్డి స్పష్టం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డిసిపి ఎ. భాస్కర్ ఆదేశాల మేరకు, బెల్లంపల్లి ఎసిపి రవి కుమార్ పర్యవేక్షణలో, ఆదివారం తెల్లవారుజామున మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్‌వి టెంపుల్ ఏరియాలో సిఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాంను విస్తృతంగా నిర్వహించారు. కాలనీలోని అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏరియాకు కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించారు. సరైన ధ్రువపత్రాలు లేని 27 ద్విచక్ర వాహనాలను 4 త్రిచక్ర వాహనాలను (ఆటోలు) సీజ్ చేశారు. సిఐ శశిధర్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రజల డ్రగ్స్ నిర్మూలనకు ప్రజల భాగస్వామ్యం అవసరమని, ప్రజల భాగస్వామ్యంతోనే సంపూర్ణ నేర నిర్మూలన సాధ్యమని నొక్కి చెప్పారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.మందమర్రి ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ శ్రీనివాస్, రామకృష్ణాపూర్‌అదనపుఎస్ఐ లలిత పాల్గొన్నారు.

# నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు
### కొన్నిచోట్ల వసతులు కరువు.. ఆర్భాటంగా ప్రారంభించినా నెరవేరని లక్ష్యం







**ప్రజాపక్షం/ఎడపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ గ్రామంలో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. వాటిని ఆర్భాటంగా ప్రారంభించినా.. యువకులు, పిల్లలకుఆడుకోవడానికి అనువుగా వాటిని తీర్చిదిద్దక పోవడం వల్ల రూ. లక్షలు వెచ్చించినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో అవి నిరూపయోగంగా మారాయి. క్రీడా ప్రాంగణాల ప్రస్తుత దుస్థితిపై ప్రజాపక్షం ప్రత్యేక కథనం.**

### గ్రామానికో క్రీడా ప్రాంగణం...

నిజామాబాద్ జిల్లాలో 533గ్రామాలు, కామారెడ్డి జిల్లాలో 528గ్రామాలున్నాయి. గత ప్రభుత్వం క్రీడాకారుల అభివృద్ధి కోసం గ్రామానికో ఒక క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖోతో పాటు వ్యాయామం చేయడానికి అనువుగా సౌకర్యాలు కల్పించారు. అయితే ఉమ్మడి జిల్లా లోని పలు గ్రామాల్లో చాలా చోట్ల క్రీడా ప్రాంగణానికి స్థలం కేటాయించి బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాల్లో వసతులు కల్పించకపోవడంతో పాటు కొన్ని చోట్ల గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. హడావుడిగా ఏర్పాటు చేసి ఇప్పుడు ఎవ్వరూ పట్టించుకోకుండా ఉండటంతో క్రీడా ప్రాంగణాలుఏర్పాటు చేసినాఫలితం లేకుండా పోయింది. దీంతో అనువుగా క్రీడా ప్రాంగణాలు లేక పలుచోట్ల ఆయా గ్రామాల్లో క్రీడా కారులు చెరువుల గట్లు, పంట పొలాల్లో క్రీడలు ఆడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### కరువైన సామాగ్రి...

కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, లాంగ్‌జంప్, హై జంప్, షార్ట్ పుట్ తదితర క్రీడలలో ఉత్సహ వంతులకు శిక్షణ ఇవ్వడంతో పాటు పోటీల నిర్వహణకు అనువైన స్థలాలు అందుబాటులోకి తీసుకరావడానికి గత ప్రభుత్వం ఈ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసింది. కాని ఈ క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామాగ్రి కరువైంది. కొన్ని గ్రామాల్లో నామమాత్రంగా క్రికెట్ వాలీ బాల్ కిట్లు, టెన్నికాయింట్ రింగ్స్ సరఫరా చేసినా.. ఎక్కువ గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలలో సౌకర్యాలు కరువయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో ఖోఖో, కబడ్డీ వంటి క్రీడ సామాగ్రిని ఏర్పాటు చేసినా అవి కూడా ప్రస్తుతం పలుచోట్ల పనికి రాకుండా పోయాయి. దీంతో ఈ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి, వీటిని అభివృద్ధి చేసి వాడుకలోకి తేవాలని క్రీడాకారులు తదితరులు కోరుతున్నారు.

# రీల్

## జన నాయకుడు ఫస్ట్ లుక్




దళపతి విజయ్ నటిస్తోన్న 'జన నాయకుడు' చిత్రాన్ని హిస్టారికల్ మూవీగా అందరూ అభివర్ణిస్తున్నారు. అందుకు కారణం ఆయన నటిస్తోన్న చివరి చిత్రమిది. దళపతి విజయ్ బర్త్ డే సందర్భంగా మేకర్స్ 'ఫస్ట్ రోర్' గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఇప్పుడీ గ్లింప్స్ ఇంటర్నెట్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. ఆయన చివరి చిత్రం కావటంతో ఈ లెజెండ్రీకి వీడ్కోలు పలకటానికి బీజం చేసినట్లు గ్లింప్స్ చూస్తుంటే అర్థమవుతుంది. 65 సెకన్ల వ్యవధి ఉన్న 'జన నాయకుడు' ఫస్ట్ లుక్ వీడియోను గమనిస్తే, 'నా హృదయంలో ఉండే..' అనే మాటలు విజయ్ వాయిస్‌లో మనకు వినిపిస్తాయి. పోలీస్ డ్రెస్‌లో లాఠీ పట్టుకుని యుద్ధ వాతావరణాన్ని తలపించే ప్రదేశంలో నడుస్తూ వస్తుంటారు. ఈ విజువల్స్ చూస్తుంటే మైండ్ బ్లోయింగ్‌గా ఉన్నాయి. శక్తి, శాంతి, గంభీరతను కలగలిపేలా ఉన్న ఈ సన్నివేశం చూస్తుంటే జన నాయగన్ మూవీ దళపతి విజయ్‌కి సాధారణ వీడ్కోలు కాబోదనే సంకేతాన్ని స్పష్టంగా ఇస్తోంది. ఫస్ట్ లుక్ వీడియోతో పాటు విడుదలైన బర్త్ డే పోస్టర్ మరింతగా మెప్పిస్తోంది

## 'ఘాటి' ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్



క్వీన్ అనుష్క శెట్టి, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించిన మూవీ 'ఘాటి' గ్లింప్స్ విడుదల చేశారు. తమిళ స్టార్ విక్రమ్ ప్రభు ఇంటెన్స్ అవతార్ లో కనిపించిన క్యారెక్టర్ గ్లింప్స్ సినిమాపై ఉన్న బజ్‌ను మరింత పెంచింది. ఘాటిని యూవీ క్రియేషన్స్ సమర్పిస్తుంది. రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మిస్తారు. ఘాటి సినిమా జూలై 11న రిలీజ్ కానుంది. తాజాగా జానపద ఊపుతో నిండిన పాట 'సైలోరే' సాంగ్ ని విడుదల చేశారు. ఇది ఓ ఎనర్జిటిక్ బ్లాస్టర్‌లా ఉంది. ప్రకృతిసౌందర్యంతో నిండిన అడవుల నేపథ్యంగా చేసుకున్న ఈ ఫోక్ వెడ్డింగ్ ఆంథమ్‌లో లీడ్ పెయిర్ ఉత్సవంగా కనిపించి ప్రేక్షకులను అలరించారు. అనుష్క, విక్రమ్ కొత్తగా పెళ్లి అయిన జంటగా సంగీతం, నృత్యం, సాంస్కృతిక వెలుగులతో విందుగా, మేళా తాళాలతో, భావోద్వేగాలతో నింపారు.

## 27న 'కన్నప్ప' విడుదల



డైనమిక్ హీరో విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' జూన్ 27న విడుదల కాబోతోంది. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద డా. ఎం. మోహన్ బాబు నిర్మాణంలో ముఖేష్ కుమార్ సింగ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.'కన్నప్ప' ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత. ఎం. మోహన్ బాబు మాట్లాడుతూ ఆ భగవంతుడి ఆశీస్సులతోనే 'కన్నప్ప' చిత్రం నిర్మించామన్నారు. అంతా ఆ దేవుడి దయ వల్లే జరుగుతుంది. ఈ మూవీలోని ప్రతీ పాత్ర హీరోలానే ఉంటుంది. ఇందులో నటించిన ప్రతీ ఒక్కరికీ నేను ఎంతో రుణపడి ఉంటాను. నేను మహా భారతం సీరియల్‌ని ఎన్నో సార్లు చూశాను. 'కన్నప్ప' సినిమాను ఆయన అద్భుతంగా తెరకెక్కించారు. రథ సారథిగా ముందుకు తీసుకెళ్లారు. ముఖేష్ రిషి కెరీర్ ఆరంభం నుంచీ మా ఫ్యామిలీతో ఉంటున్నారు. ఆ శివుడి ఆశీస్సులతో 27న రాబోతోన్న ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

## ఘనంగా ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్



విజన్ స్టూడియోస్ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 అవార్డ్స్ అందించారు. హైదరాబాద్‌లోని ఓ హోటల్లో ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సినీ రంగంతో పాటు ఇతర రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు ఈ ఈవెంట్‌లో అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను బాలీవుడ్ సహా అన్ని సినిమాలకు కేంద్రంగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు హైదరాబాద్‌లో సినీ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయబోతున్నాం. హైదరాబాద్ ఇన్ ఛార్జ్ మంత్రిగా నేను ఆ బాధ్యత వహిస్తాను. విజన్ స్టూడియోస్‌లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ నా అభినందనలు తెలియజేస్తున్నా అని అన్నారు.

విజన్ స్టూడియోస్ అధినేత రమేష్ మాట్లాడుతూ.. చిన్న చిత్రానికి విడుదల టైమ్ లో ఎన్నో ఇబ్బందులు ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో మా విజన్ స్టూడియో నుంచి పోస్ట్ ప్రొడక్షన్ చేసుకుని దాదాపు వంద సినిమాలు థియేటర్స్ లోకి వచ్చాయని చెప్పారు.

టీఎఫ్ సీసీ ఛైర్మన్ డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. నిర్మాతలు ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉంటే విజన్ స్టూడియోస్ వారికి సపోర్ట్ చేస్తోంది. నా ఝాన్సీ సినిమా కూడా విజన్ స్టూడియోస్ లోనే డబ్బింగ్ చెప్పించాం అని అన్నారు.

నటి దివ్యవాణి మాట్లాడుతూ అవార్డ్స్ అనేవి కళాకారులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయి. తెలంగాణలో రీసెంట్‌గా గద్దర్ అవార్డ్స్ ఇచ్చారు. విజన్ స్టూడియోస్ కూడా ఐకాన్స్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ఇవ్వడం అభినందనీయం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాత గురురాజ్, వెన్నెల గద్దర్, నటులు రచ్చ రవి, గుండు సుదర్శన్, 30 ఇయర్స్ పృధ్వి, మిస్ ఏషియా అనుష, తదితరులు పాల్గొన్నారు.

## నైట్ కల్చర్‌పై యుఫోరియా

వినూత్న కథలతో సక్సెస్ ఫుల్ డైరెక్టర్‌గా పేరు సంపాదించుకున్న గుణ శేఖర్ రూపొందిస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'యుఫోరియా'. సమకాలీన అంశాలతో, లేట్ నైట్ కల్చర్, డ్రగ్స్, యువత అనే కాన్సెప్ట్‌తో ఈ మూవీని గుణ శేఖర్ తెరకెక్కిస్తున్నారు. రిలీజ్‌కు సిద్ధమవుతోన్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫ్లై హై సాంగ్‌తో మంచి బజ్ క్రియేట్ అయ్యింది. ఈ మూవీ నుంచి 'రామ రామ..' సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భూమిక, విఘ్నేష్ గవిరెడ్డి, రోహిత్, డైరెక్టర్ గుణశేఖర్, నీలిమ గుణ, ఎడిటర్ ప్రవీణ్ పూడి, ఆదిత్య మ్యూజిక్ మాధవ్, మాస్టర్ ఆరుష్, యానీ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు గుణశేఖర్ మాట్లాడుతూ 'నాతో పాటు రాగిణి, నీలిమ, యుక్త కలిసి 'యుఫోరియా' సినిమాను తీశారు. కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమాను తెరకెక్కించాం. అందరూ కనెక్ట్ అయ్యేలా ఆహ్లాదకరంగా చక్కటి మెసేజ్‌తో సినిమాను తెరకెక్కించాం. ఫ్లై హై అనే పాటతో అందరినీ మెప్పించిన కాల భైరవ ఇప్పుడు రామ రామ అనే సాంగ్‌తో మన ముందుకు వచ్చారు. చైతన్య ప్రసాద్ ఈ పాటకు మంచి సాహిత్యాన్ని అందించారు. అందరూ ఎంజాయ్ చేసేలా పాట ఉంటుంది. పవీణ్ పూడి వంటి టెక్నీషియన్‌తో వర్క్ చేయటం హ్యాపీ. ప్రవీణ్ కె.పోతన్ అనే సినిమాటోగ్రాఫర్‌ను ఈ సినిమాతో పరిచయం చేస్తున్నాను. ఇందులో దాదాపు 20 మంది కొత్త వారిని పరిచయం చేశాను. ఇందులో విఘ్నేష్ గవిరెడ్డి కథానాయకుడిగా కనిపించబోతున్నాడు. తను మనసు పెట్టి నటించాడు.. చాలా రోజుల తర్వాత భూమిక మా సినిమా ద్వారా.. చాలా మంచి పాత్రలో రీ ఎంట్రీ ఇచ్చారు' అన్నారు.




## ప్రిన్స్ హీరోగా నూతన చిత్రం ప్రారంభం



హీరో ప్రిన్స్, సుహానా ముద్వాన్ హీరోయిన్‌గా, సునైనా, నెల్లూరు సుదర్శన్, ప్రధాన పాత్రలలో కుమార్ రవికంటి దర్శకత్వంలో ఈ చిత్రం ప్రారంభించారు. లైట్ స్టోర్మ్ సెల్లులోయిడ్స్ పై కుమార్ రవి కంటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కెఎల్ స్టూడియోలో జరిగిన పూజా కార్యక్రమాలకు సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు హాజరు అయ్యారు. చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ సందర్భంగా కుమార్ రవి కంటి మాట్లాడుతూ ఈ చిత్రం జూన్, జూలై, ఆగస్ట్‌లో ఏకధాటిగా సినిమా చిత్రీకరణ జరుపుకుని విదేశాలలో సాంగ్స్ షూటింగ్ చిత్రీకరిస్తామని చెప్పారు. ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ బేబీ దియ రవికంటి కొట్టారు. కెమెరా స్విచ్ ఆన్ శ్రీమతి సుమ రవికంటి చేశారు.

## 'మార్గన్' నుంచి లిరికల్ వీడియో సాంగ్ రిలీజ్



హీరోగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, పాటల రచయితగా, ఎడిటర్‌గా ఇలా మల్టీ టాలెంటెడ్ అయిన విజయ్ ఆంటోని 'మార్గన్' అంటూ జూన్ 27న ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. విజయ్ ఆంటోని నటిస్తూ, నిర్మించిన 'మార్గన్' చిత్రానికి లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను విజయ్ ఆంటోని ఫిలింస్ కార్పొరేషన్ నిర్మిస్తుండగా, సర్వాంత్ రామ్ క్రియేషన్స్ బానర్ పై జె.రామాంజనేయులు సగర్వంగా సమర్పిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్ ఇలా అన్నీ కూడా సినిమాపై అంచనాల్ని పెంచేశాయి. ఈ చిత్రాన్ని ఏసియన్ సురేష్ ఎంటర్టైన్మెంట్ భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. ఇక ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా సోల్ ఆఫ్ మార్గన్ అంటూ ఓ పాటను రిలీజ్ చేశారు. 'చెప్పలేని ద్వేషముందే జగతిపై' అంటూ సాగే ఈ 'సోల్ ఆఫ్ మార్గన్'ను చూస్తే సినిమాకు సంబంధించిన ఎన్నో హింట్స్‌ను ఇచ్చినట్టుగా కనిపిస్తోంది. భాష్య శ్రీ రచించిన ఈ పాటను అక్షర ఆలపించారు. విజయ్ ఆంటోనీ బాణీ వెంటాడేలా, సినిమా థీమ్‌ను చాటేలా ఉంది.

## 'మిత్ర మండలి' నుంచి 'కత్తందుకో జానకి' పాట విడుదల



బన్నీ వాస్ నూతన నిర్మాణ సంస్థ బి.వి.వర్క్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిత్ర మండలి'. తాజాగా 'మిత్ర మండలి' నుంచి మొదటి గీతం 'కత్తందుకో జానకి'ని నిర్మాతలు విడుదల చేశారు. ఈ గీతావిష్కరణ కార్యక్రమం అమలాపురంలోని కిమ్స్ కాలేజ్‌లో జరిగింది. 'కత్తందుకో జానకి'ని తీసుకొని, ఈ తరం మెచ్చేలా అద్భుతమైన పాటగా మలిచారు. ఆర్.ఆర్. ధ్రువన్ స్వరపరిచిన ఈ గీతం.. వినసొంపుగా, అందరూ సరదాగా పాడుకునేలా ఉంది. కాసర్ల శ్యామ్ మరోసారి తన కలం బలం చూపించారు. ఈ సరదా గీతాన్ని ఎంతో అందంగా, అర్థవంతంగా వ్రాశారు. ఇక రాహుల్ సిప్లిగంజ్ తన గాత్రంతో పాటకు మరింత జోష్ తీసుకొచ్చారు. ప్రధాన పాత్రధారులు ప్రియదర్శి, విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరాల ప్రపంచాన్ని పరిచయం చేస్తూ గీతం సాగింది. అమలాపురం కిమ్స్ కాలేజ్ లో జరిగిన 'కత్తందుకో జానకి' గీతావిష్కరణ వేడుకకు ముఖ్య అతిథిగా అమలాపురం ఎంపీ జి.ఎం. హరీష్ బాలయోగి హాజరయ్యారు.

## 'లోపలికి రా చెప్తా' ట్రైలర్ విడుదల



మాస్ బంక్ మూవీస్ పతాకంపై కొండా వెంకట రాజేంద్ర, మనిషా జష్నాని, సుస్మిత అనాలా, సాంచిరాయ్ హీరో హీరోయిన్లుగా లక్ష్మీ గణేష్, వెంకట రాజేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న హర్రర్ బేస్డ్ కామెడీ ఎంటర్ టైనర్ చిత్రం 'లోపలికి రా చెప్తా'. కొండా వెంకట రాజేంద్ర హీరోగా నటించడమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వ బాధ్యతలను కూడా నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన ఈ సినిమా పాటలు, పోస్టర్స్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. 'లోపలికి రా చెప్తా' చిత్రం జూలై 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కాబోతోంది.

# విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

**వెంటనే పర్యవేక్షణ అధికారులుగా జారీ చేసిన ఉత్తర్వులను ఉప సంహరించుకోవాలి: ఎస్‌టియుటిఎస్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పని తీరును పర్యవేక్షించే బాధ్యతలను ఎస్‌టిజి, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను అప్పగించడం సరైన నిర్ణయం కాదని ఎస్‌టియు టిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సదానందంగౌడ్ అన్నారు. వారిని పర్యవేక్షణ అధికారులుగా నియమించడం విద్యారంగ తిరోగమన చర్యగా అభివర్ణించారు. ఈ నిర్ణయం విద్యారంగా సంక్షోభానికి దారితీస్తుందని, అందుకే వెంటనే పర్యవేక్షణ అధికారులుగా జారీ చేసిన ఉత్తర్వులను ఉప సంహరించుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని 629 మండలాలు 1, 817 క్లస్టర్ల పరిధిలో ఉన్న 24,146 పాఠశాలలను తనిఖీ చేసేందుకు పది సంవత్సరాల అనుభవం ఉన్న సుమారు రెండు వేలకుపైగా ఉపాధ్యాయులకు తనిఖీల బాధ్యతలు అప్పగించారని, వారిని విద్యా సంవత్సరం పొడవునా తనిఖీ బాధ్యతలలో పెట్టడంతో పాఠశాలలలో బోధన స్తంభించిపోతుందని, ఫలితంగా విద్యా ప్రమాణాలు మరింత కుంటు పడతాయని పర్వత్ రెడ్డి, సదానందంగౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు ప్రభుత్వం రాష్ట్రమంతా అన్ని పాఠశాలలో విద్యా ప్రమాణాలకు చర్యలు తీసుకుంటామని చెబుతూనే, మరోవైపు ఇలాంటి చర్యలకు పాల్పడడం అనాలోచితమైన చర్యగా వారు అభివర్ణించారు. కామన్ సర్వీస్ రూల్స్ సమస్య పరిష్కరించి పూర్తిస్థాయి మండల విద్యాధికారులను, ఉప విద్యాశాఖ అధికారులను, జిల్లా విద్యాశాఖాధికారులను నియమించి, పాఠశాలల పర్యవేక్షణను కొనసాగించాలని, తరగతికి ఒక గది, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే పాఠశాలల్లో వేలాది ఉపాధ్యాయ ఖాళీలు ఉండడంతో బోధన కుంటుపడుతున్నదని, వెంటనే డిఎస్‌సిని ప్రకటించి, ఉపాధ్యాయులను నియమించాలని పర్వత్ రెడ్డి, సదానందంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రోడ్లు, భవనాల శాఖ పరిధిలో పనుల వేగం పెంచాలి

**త్వరగా పూర్తయి వాడుకలో వచ్చేవాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి**

**పెండింగ్‌లో ఉన్న 5 జిల్లా సమీకృత కార్యాలయాలు, ఆర్వోబిలు నిర్మాణం త్వరగా పూర్తి కావాలి**

**రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రోడ్లు, భవనాల శాఖ పరిధిలో కొనసాగుతున్న నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రోడ్లు, భవనాల శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రోడ్లు, భవనాలు శాఖపై బృహత్తర బాధ్యత ఉందని, దానిని దృష్టిలో పెట్టుకుని త్వరగా పూర్తయి వాడుకలోకి వచ్చే వాటికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఈ సందర్భంగా ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న 5 జిల్లా సమీకృత కార్యాలయాలు ఆదిలాబాద్, వరంగల్, ములుగు, నారాయణపేట, కరీంనగర్ పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. పెండింగ్ బిల్లుల అంశం అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. వర్క్ ఫినిషింగ్ స్టేజ్‌లో ఉన్న వరంగల్, ములుగు జిల్లా కలెక్టరేట్లు వెంటనే పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని చెప్పారు. ఆర్‌ఓబిల నిర్మాణంపై ఆరా తీసిన మంత్రి నిజామాబాద్ మాధవనగర్ ఆర్‌ఓబి పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని సూచించారు. నిర్మాణం చివరి దశలో ఉన్న ఆర్‌ఓబిలు, మెడికల్ కాలేజీలు, టిమ్స్ ఆసుపత్రులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. మంచి రోడ్లు ఉంటే రవాణా సౌకర్యం పెరుగుతుందని, అది అభివృద్ధికి సూచిక అవుతుందన్నారు. ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లో 91 లక్షల వాహనాలు తిరుగుతున్నాయని, తెలంగాణ గ్రామీణ ప్రాంతాలలో కూడా సంఖ్య అదే స్థాయిలో ఉంటుందని, అందుకు మంచి రోడ్లు ఉండాలని, ప్రజలకు ప్రధానంగా కావాల్సింది సౌకర్యవంతమైన రోడ్లనీ అధికారులు గుర్తించి పనిచేయాలన్నారు. వర్క్ ఏజెన్సీలకు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడి క్లియర్ చేయిస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో ఈఎన్సి తిరుమల, చీఫ్ ఇంజనీర్లు మోహన్ నాయక్, రాజేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్

(మొదటి పేజీ తరువాయి)

సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయన్నారు. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లాల్లో బలమైన ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. మంగళవారం ఆదిలాబాద్, కొమరంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నిర్మల్, నిజామాబాద్, బుధవారం పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్ కర్నూల్, నల్లగొండ, సూర్యపేట, శుక్రవారం ఆదిలాబాద్, కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు వివరించారు.

# బడ్జెట్ నిధులు ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన పెట్టుబడులు ,మౌలిక సదుపాయాలకల్పన సబ్ కమిటీ మంత్రివర్గ ఉప సంఘం సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యుల, మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డితో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ నాన్ ట్యాక్స్ రెవెన్యూతో పాటుగా కేంద్ర నిధులను కూడా సాధించుకోవలని, గత ప్రభుత్వ పథకాలను ఏ ఒక్కటి కూడా ఆపకుండా కొత్తగా రూ 33,600 కోట్లతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. తాము (కాంగ్రెస్) అధికారంలోకి వచ్చిన 202324 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వానికి అవుటర్ రింగ్ రోడ్, ఎక్సైజ్ ఆదాయాలు రాకుండా పోయాయన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ కానుక, మహాలక్ష్మి, ఉచిత కరెంట్, ఇందిరమ్మ ఇండ్లు సహా పలు కొత్త పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు.

**అన్ని శాఖలకూ సమానంగా 'బడ్జెట్'ను పంచాలి**

బడ్జెట్‌లో కేటాయించిన నిధులను కొన్ని శాఖలకు అధికంగా, మరికొన్ని శాఖలకు అతి తక్కువగా అందుతున్నాయని, అన్ని శాఖలకు, డిపార్ట్‌మెంట్లకు ఆ నిధులను సమానంగా పంచాలని భట్టి విక్రమార్క తెలిపారు. డిపార్ట్‌మెంట్ల మధ్య ఉన్న ఖర్చు అంతరాలను తగ్గించి, అన్నింటిని ఒకే స్థాయిలోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని నియోజక వర్గాల్లో పెండింగ్‌లో ఉన్న మేజర్ ప్రాజెక్టులను ప్రాముఖ్యతను అనుసరించి, వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు.

**ప్రాధానత్య క్రమంలో ముందుకెళ్లాలి...**

రేషనలైజేషన్ చేసుకుని ప్రాధాన్యతల ఆధారంగా ముందుకెళ్లాలని, రెవెన్యూ తీసుకొచ్చే శాఖలు, డిపార్ట్‌మెంట్లపైన సీరియస్‌గా దృష్టి సారించాలని భట్టి విక్రమార్క తెలిపారు. అవసరాల మేరకు ఖర్చు చేయాలన్నారు. స్టేట్ రియలిస్టిక్‌గా, లాజికల్‌గా ఖర్చు చేయాలన్నారు. పబ్లిక్ ఇంట్రెస్ట్, అభివృద్ధి, ప్రజాసంక్షేమం, ప్రజాప్రభుత్వం ఆలోచనల మేరకు అందరూ పని చేయాలని సూచించారు. స్పిల్ ఓవర్ వర్క్స్ కూడా ప్రయారిటీల మేరకు పూర్తి చేయాలని, అన్ని శాఖలు సమానంగా అభివృద్ధి చెందితేనే, తెలంగాణ రాష్ట్రం సంపూర్ణ స్థాయిలో ముందకెళ్తుందని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.

# అక్రమ దందా

(మొదటి పేజీ తరువాయి)

పాటు వినియోగదారుల నుంచి ప్రత్యేకంగా కొనుగోలు చేస్తూ వాటిని ప్రత్యేక గోదాములు, ఇండ్లలో నిలువ చేస్తున్నారు. ఇక్కడి నుంచి రైస్ మిల్లులకు తరలిస్తూ వాటిని రీస్కెలింగ్ చేసి 25 కిలోల బస్తా చొప్పున మార్చి ప్రజలకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అంతేగా కాకుండా మహారాష్ట్ర వంటి ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అన్ని వ్యాపారాల్లో కంటే బియ్యం వ్యాపారంలోనే ఎక్కువ కమిషన్ వస్తుండడంతో ఈ బిజినెస్ పైనే ఎక్కువమంది దృష్టి సారిస్తు న్నారు. కొంత మంది రైస్ మిల్లర్లు కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని సీఎంఆర్ కోసం తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబ డుతూ.. నిల్వ చేస్తూ అధికారులకు చిక్కిన వారిపై నమోదు చేసే పీడీ యాక్టు, 6ఏ కేసులు ఎక్కడ అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**రేషన్ డీలర్ల నుండే పక్కదారి**

సన్న బియ్యం పక్కదారి రేషన్ షాపుల నుండే డీలర్ల సహకారంతోనే జరుగుతున్నట్లు తెలుస్తున్నది. రేషన్ షాపులలో డీలర్లు బియ్యానికి బదులు నగదు అప్ప జెప్పుతున్నారు. రేషన్ షాపులలో డీలర్లు కిలోకు రూ.15 చొప్పున కొనుగోలు చేస్తున్నారు.వాటిని తిరిగి అధిక ధరలకు మిల్లర్లకు విక్రయిస్తున్నారు. సుమారుగా రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు కొనుగోస్తు అప్పటికప్పుడే నగదు ముట్టజెబుతున్నారు.వచ్చేమూడు నెలల కాలం బియ్యాన్ని ఈ నెలలో ఒకే సారి ఇస్తున్నారు. దీంతో గ్రామాలలో చాలా మంది రేషన్ కార్డులను కుటుంబ పెద్దకు తిరిగి అప్పజెప్పారు. నాటి నుండి బియ్యం ఆన్‌లైన్ అమౌంట్‌ను కోల్పోతే వారి,వారి కుటుంబాలు అగమయ్యేవిధంగా తయారయ్యారు,

**బియ్యం పట్టివేతపై సమగ్ర విచారణ ఎక్కడ**

అక్రమంగా నిల్వ ఉంచిన, తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు, అధికారులు పట్టుకుంటున్నారు. కానీ వాటి మూలాల్లోకి వెళ్లి సమగ్ర విచారణ చేయడం లేదని సమాచారం. బియ్యం పట్టుకున్న వెంటనే సదరు వ్యక్తులపై లోతుగా విచారణను చేయడం లేదన విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టుబడిన వ్యక్తులు ఎక్కడి నుంచి వాటిని సేకరించారు. ఎన్ని నెలల నుంచి ఈ వ్యాపారం సాగుతోంది తదితర అంశాలపై లోతుగా దర్యాప్తు జరగకపోవడం వల్లనే కేసులు నమోదైనా మళ్లీ ఇదే దందా సాగించడమో,లేదంటే వారి ప్రతినిదులను ఈ వ్యాపారంలో దింపి వెనుక నుంచి నడిపించడం లాంటివి చేస్తున్నారని తెలుస్తోంది. దొరికిన బియ్యానికి లెక్కలు అడిగి చర్యలు తీసుకుంటున్నారు తప్పితే వారి వ్యాపార చరిత్రపై ఆరా తీయడం లేదనే ఆరోపణ ఉంది.

# ప్రతిపక్షం విలవిల

(మొదటి పేజీ తరువాయి)

అనుభవించాల్సిందేనని కూడా వారు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడాది వరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే విధంగా సాదాసీదాగా వ్యవరించినప్పటికీ గత కొంత కాలంగా ప్రభుత్వంపై ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ చేస్తున్న విమర్శలను సమర్థవంతంగానే తిప్పి కొడుతున్నది. ప్రతిపక్ష బిఆర్‌ఎస్‌పై ప్రభుత్వం తనదైన శైలిలో విమర్శల దాడిని ఎక్కుపెట్టింది. బిఆర్‌ఎస్ దశ దిశా లేకుండా రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిందని, కెసిఆర్ పాలనలో రాష్ట్రానికి మిగిలింది అప్పుల భారం మాత్రమేనని, పదేళ్ల పాలనలో కెసిఆర్ ఒక్క రేషన్ కార్డు కూడా ఇచ్చిన పాపాన పోలేదని, డబుల్ బెడ్ రూమ్ వాగ్దానం చేసిన కెసిఆర్ ఒక్క ఇల్లు ఇవ్వలేదని విమర్శలు గుప్పిస్తున్నది. మరోవైపు ప్రభుత్వం బిఆర్‌ఎస్ నేతల అవినీతి, అక్రమాల చరిత్రను తోడుతోంది. అందులో భాగంగా ఫోన్ ట్యాపింగ్ పై సిట్ విచారణ, మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, అవకతవకలపై విచారణకు జస్టిస్ పి.సి.ఘోష్ కమిషన్ ఏర్పాటు, విద్యుత్తు ప్రాజెక్టుల నిర్మాణం, విద్యుత్తు కొనుగోలులో అవకతవకలపై విచారణకు జస్టిస్ లక్ష్మి నారాయణ రెడ్డి కమిషన్ ఏర్పాటు, ఫార్ములా ఈ కార్ రేస్‌లో రూ.50 కోట్ల అవినీతిపై ఎసిబి విచారణ, జిఎస్‌టి కుంభకోణంపై సిఐడి విచారణ ఇలా ప్రభుత్వం పలు విచారణలను వేగవంతం చేయడంతో బిఆర్‌ఎస్ నేతలు, ముఖ్యంగా మాజీ సిఎం కెసిఆర్, ఆయన కుమారుడు, అల్లుడు అయిన మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. ధరణి పేరుతో భూముల అక్రమాలను కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. వ్యవసాయ, రైతు కమిషన్ ఏర్పాటు చేయడం ద్వారా సాగుభూముల విషయంలో జరిగిన అవకతవకలను వెల్లడించేందుకు చర్యలు చేపట్టింది. ఇలాంటి అనేక విచారణలు కొనసాగుతుండడంతో 'కారు' నేతలతో కంగారు పెరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కొంగుబాటుపై విచారణ కమిషన్ ఏర్పాటు బిఆర్‌ఎస్ నాయకులతో పాటు అప్పటి అధికారులపై విచారణను వేగవంతం చేసింది. అందులో భాగంగా అప్పటి సాగునీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావును, అంతకుముందు నీటిపారుదల శాఖ బాధ్యతలను నిర్వర్తించిన సిఎం కెసిఆర్‌ను కూడా కమిషన్ విచారించింది. దీంతో ఎప్పుడూ ఫామ్ హౌస్‌ను వదిలి బయటకు రాని కెసిఆర్‌ను విచారణ కమిషన్ ముందు నిలబెట్టడంతో బిఆర్‌ఎస్ శ్రేణులు ఒక్క సారిగా ఖంగుతిన్నాయి. కాగా ఫార్ములా ఈ కార్ రేస్‌లో రూ.50 కోట్ల అవినీతి విషయంపై విచారణ చేపట్టిన ఎసిబి మాజీ మంత్రి కెటిఆర్‌ను మూడు సార్లు విచారించింది. ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని, ఇరుకున పెట్టాలని భావించాలని బిఆర్‌ఎస్ ఒక వైపు కెసిఆర్‌కు కవిత లేఖతో అంతర్గత సమస్యలను ఎదుర్కొంటుండగా, మరోవైపు విచారణ కమిషన్ల వరుస విచారణలతో ముఖ్యంగా కెసిఆర్, కెటిఆర్, హరీష్‌రావుతో పాటు బిఆర్‌ఎస్ నాయకులు, శ్రేణులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. తాజాగా గోదావరి – బనకచర్ల ప్రాజెక్టుపై బిఆర్‌ఎస్ చేసిన విమర్శలపై సిఎం రేవంత్‌రెడ్డి వాస్తవాలను వెల్లడిస్తూ చేసిన విమర్శలు, ఆయన స్పందన ఇందుకు నిదర్శనం. తద్వారా ప్రజా కోర్టులో కెసిఆర్‌ను దోషిగా నిలబెట్టినంత పనిచేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com